


విశ్రాంతివేళ * చిత్రశిల్పి : శ్రీ అంకాల వేంకట సుబ్బారావు



పూజానృత్యం

•

చిత్రశిల్పి:
శ్రీ సుధీర్ ఖాస్తగిర్

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 1 | విజయవాడ * మే 1959 | సంచిక 10

భూ సంస్కరణలు ...

భారతదేశంలోని పార్టీలన్నీ భూసంస్కరణలు జరిగి తీరాలని అంగీకరించినవి. భూమిపై వ్యక్తికి కొంత యాజమాన్యాన్ని గుర్తించినవి. వ్యక్తి జీవనం యీ పరిమితిలో కనీసం ఉండవచ్చునని నిర్దేశించినవి. గొప్పగా ఆలోచించి ఆలోచించి యిప్పటికి యీ నిర్ణయం చేయడం జరిగినది. ఈ విషయంలో పార్టీలన్నీ స్వార్థరహితంగా వివేకించి యీ నిర్ణయానికి వచ్చినవని మనం అంగీకరించక తప్పదు.

వ్యక్తికి యెంత ఆదాయం ఉంటే కనీస జీవనాన్ని గడుపుకోవడానికి వీలవుతుందో నిర్ధారణచేసి చెప్పడం మాత్రం జరిగినది. గరిష్ఠపరిమితిలో మాత్రం పార్టీలలో అభిప్రాయభేదాలున్నవి. అయితే భారతదేశంలో నివసిస్తున్న ప్రజలలో హెచ్చుభాగం భూమిపై ఆధారపడి జీవించేవారు కావటంవల్ల యీ నిర్ణయం చేయడంలో అభిప్రాయభేదాలున్నవని ఆయా పార్టీలు తమ తమ తీర్మానాలద్వారా అభిప్రాయాలను వెల్లడిస్తున్నవి. ఇది చాలా గడ్డుసమస్య. భూమి తక్కువకావడం, దానిపై ఆధారపడి జీవించేవారు హెచ్చుకావడం-యీ సమస్యా పరిష్కారానికి మార్గం లేకపోతున్నది. ఇది అందరూ అంగీకరిస్తూనే అభిప్రాయభేదాలను మాత్రం ప్రకటిస్తున్నారు. ఇది చాల వింతగా విడ్డూరంగా విమర్శకులైన విజ్ఞులకుమాత్రం అనిపిస్తూన్నది.

జాతీయ ఆదాయంలో వ్యవసాయాదాయం కూడా ఒక భాగంమాత్రం అయిఉన్నది. భారతజాతీయాదాయంలో హెచ్చుభాగం పరిశ్రమలవల్ల, బ్యాంకులవల్ల, తదితరఆదాయాలవల్ల సమకూరుతున్నది.ఈఆదాయంలోవ్యవసాయాదాయం కూడా కలసిఉన్నది. తక్కువమంది యెక్కువ ఆదాయంమీద జీవించడానికి ఒకవంక వసతి కల్పిస్తూ, యెక్కువమంది తక్కువ ఆదాయాన్ని అనుభవిస్తున్నా, మరొకవంక అది కూడా తగదని యింకా వ్యవసాయాదాయాన్ని తగ్గించడానికి ప్రయత్నం చేయడం హెచ్చు తగ్గులను సరిచేయటం యెలా అవుతుంతో దురూహ్యంగా ఉన్నది.

భారతదేశంలోని ప్రతి పౌరునికి హక్కులు, బాధ్యతలు, సమంగా ఉన్నాయని ఒకవంక నిర్వచిస్తూ, మరొకవంక తరతమ భేదాలతోకూడిన హక్కులను బాధ్యతలను నిర్వచిస్తూ, నూతన శాసనాలను చేయటం వింతగా ఉన్నది. ప్రతి పౌరుడు తన వృత్తి తాను నిర్ణయించుకొని, తన బ్రతుకు తాను నిర్ణయించుకో

వచ్చునని రాజ్యాంగంలో హామీ ఇచ్చి, ఆ హామీలన్నీ అందరికీ అర్థం కాకపూర్వమే, వాటి ప్రకారం పౌరులు జీవించకపూర్వమే, అడుగడుగునా హక్కులకు భంగం కల్పిస్తూ, యిది సమతాధర్మానికి ప్రాతిపదికయని నిర్వచించడం విధి వైపరీత్యంగా ఉన్నది.

మన శాసనసభలకు కొన్ని హక్కులున్నవి. మన పార్లమెంటుకు అన్ని హక్కులూ ఉన్నవి. మనం మన ప్రతినిధులను యెన్నుకొని పరిపాలన న్యాయ సమ్మతంగా, చట్ట సమ్మతంగా చేయమని పంపిస్తే, రాజ్యాంగం భద్రపరిచిన హక్కులను తిరస్కరిస్తూ యెప్పటికప్పుడు నూతన శాసనాలను యేర్పరుస్తూ, యిదే ప్రజా స్వామ్యమని చెప్పడంలో యోగ్యత యెక్కడ యిమిడియున్నదీ యేఒక్క పౌరునికీ తెలియడంలేదు.

కోటీశ్వరుడు కోట్లకొలది సంపాదించుకోవచ్చు. కోట్లకొలది పెట్టుబడి పరిశ్రమలపై పెట్టవచ్చు. బ్యాంకులలో దాచుకోవచ్చు. ప్రభుత్వ ఋణపత్రాలను పొందవచ్చు. ఒకటేమిటి ? అన్నింటికీ అవకాశం కలిగి ఉండవచ్చు. ఇది యిలా అంగీకరించడానికి కారణం ఉన్నది. అది యిది: సమతాధర్మం వర్ధిల్లడం, సాంఘిక పురోభివృద్ధి జరగడం,సాముదాయక సమత్వం పెరగడం-వీటికోసమేనని ప్రతిఒక్కరూ గుర్తించాలి. వ్యవసాయ వృత్తిమాత్రం యిందులో యే విధంగానూ చేర్చబడదగినది మాత్రం కాదు. దేశంలోని అన్ని సమస్యలు ఒక ఎత్తు, యీ భూసమస్య ఒక ఎత్తు. ఈభూమి అందరికీ సంబంధించిఉన్నది. అందువల్ల ప్రథమంలో యీ భూమిని సంస్కరించాలని తాముమనసారా నమ్మి యీనిశ్చయానికి వచ్చి ఉండవచ్చు. లేక సంఘంలో ఒక్కొక్కరిని సంస్కరించి మొత్తంపై అందరినీ సంస్కరించడానికి కొంత వ్యవధిని పుచ్చుకొని ఉండవచ్చు. ఏది ఏమైనప్పటికీ యిది యిప్పుడు జరిగితీరాలని మాత్రం అందరూ కోరుతున్నారు. ఇందుకు రాజ్యాంగంతో నిమిత్తంలేదు. సాంప్రదాయంతో నిమిత్తంలేదు. ప్రజల మంచీ చెడ్డలతో అసలే నిమిత్తంలేదు. మేమీదేశంలో ప్రజల బాగోగులను నిర్ణయించడానికి పార్టీలుగా ఏర్పడిఉన్నాం. మేము చెప్పడం మీరు వినడం జరిగితీరాలి. ఏదిచేసినా ప్రజాక్షేమం కోరే చేస్తున్నామని విశ్వాసం పెట్టి తీరాలి. మమ్మల్ని కాదంటే యీ దేశంలో మీకు దిక్కులేదు. మీరంతా చిక్కుల పాలయిపోతారు. దిక్కులేని దీనులుగా జీవిస్తారు. యోచన చేయండి. మామాట వినండి. మాపై విశ్వాసం పెట్టండి, భూసంస్కరణలకు తోడ్పడండి. సహకార వ్యవసాయం చేసుకోనండి. సమిష్టి వ్యవసాయానికి అలవాటు పడండి. అన్నిపార్టీలలో మాపార్టీ చెప్పేదొక్కటే యుక్తియుక్తంగా ఉన్నది. ఇది జయప్రదంగా జరిగిపోవడానికి, నీతి, శీలము అన్న పదార్థాన్ని తయారుచేస్తున్నాం. ఇది యావత్ భారత దేశానికి సప్లయి చేస్తాం. అందరూ అందుకోనండి. అభ్యుదయాన్ని పొందండి. గాం

ధీజీ భారతజాతిని కళాప్రియులు కమ్మని హెచ్చరించాడు. మన పైన మనకు విశ్వాసం తక్కువ ఉంటే అమెరికానుంచి భారతదేశానికి పరిశీలించి పోవడానికి వచ్చిన శ్రీ చెస్టర్ బౌల్సు చెప్పిన విషయాన్ని గమనించండి. ప్రపంచంలో కమ్యూనిజాన్ని వ్యతిరేకించడానికి అమెరికా అవసరమైనంత పెట్టుబడి పెడుతున్నది. భారతదేశంలోని భూములను సంస్కరిస్తే సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెడితే అందుకు అవసరమైన పెట్టుబడినంతా అమెరికా పెట్టేస్తుంది. ప్రపంచంలో కమ్యూనిజం నిర్మూలనం కావాలంటే పరిశ్రమలను పెంపొందనివ్వడం, వ్యవసాయాదాయానికి పరిమితి పెట్టడం భారతదేశానికి తప్పనిసరి అని హెచ్చరించారు. అందుకే యీ నాడందరూ ఆలోచించి అర్థం చేసుకొని పరిశీలించి వివేకించుకొని మంచిచెడ్డలనుగ్రహించి ఉత్తమ మార్గాన్ని నిర్ణయించుకోమని దేశభక్తులమైన మేము అందరినీ కోరుతున్నాం.

"ఈనాడు మనం అధికంగా సంపదల ఉత్పత్తికి ప్రణాళికలను అమలు జరుపుతున్నాం. కాని సమానమైన పంపిణీ లేనందున ధనికులు మరింత ధనికులవుతున్నారు. బీదవారు మరింతగా పేదవారవుతున్నారు. సంపదలో సమానంగా పంపిణీ చేయడాన్నిగురించి మనం తీవ్రంగా ఆలోచించడంలేదని నేను భావిస్తున్నాను. జాతీయ సంపదను-అంటే తలసరి ఆదాయాన్ని ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికిగాను అధికోత్పత్తిని ఉద్దేశిస్తున్నాం. బృహత్తర ప్రణాళికలు అమలు జరిగినా ఆహారధాన్యాల సమస్య యింకనూ పరిష్కారం కాలేదు. భవిష్యత్తులోనైనా ప్రజల మనస్సులలో ఉత్సాహాన్ని, తెలివితేటలను, కార్యదీక్షను, సంకల్పబలాన్ని మన ప్రణాళికలు రేకెత్తించగలవనే నమ్ముతున్నాను" అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు రాజకీయ మహాసభాధ్యక్షులు తమ ఉపన్యాసంలో వ్యక్తం చేసారు. అంతేకాదు. "ఈనాటి ప్రజాస్వామ్య వ్యవస్థకు అనువైనట్లుగా ప్రభుత్వ యంత్రం నడువడంలేదనే ఫిర్యాదు సర్వత్రా వినవస్తున్నది. బ్రిటిషువారు తమ జానిసలను పరిపాలించే పద్ధతులలో స్వల్ప విషయాలను అదుపులో పెట్టడానికికూడా లెక్కలేనన్ని నిబంధనలతో ఆఫీసు కర్మకాండలతంతును పెంచారు. మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన కొంతకాలంవరకు మనం కూడ యీ యంత్రాన్ని యథాతథంగా ఉంచుకొన్నామని చెప్పడానికి నేను సంకోచించను......కనుక ప్రభుత్వ యంత్రాన్ని ఆధునిక పద్ధతులలో పెట్టడానికి, అవినీతి శక్తులను అరికట్టడానికి తగినట్టుగా వెంటనే తగినచర్యలు తీసుకోవాలి" అని అదే రాజకీయ మహాసభ అధ్యక్షోపన్యాసంలో వివరించారు. ఈ అభిప్రాయాలు కాంగ్రెసు ఉన్నత నాయకత్వంలో ఉన్నవారివల్లనే వెల్లడింపబడుతున్నాయి. ఉన్నత స్థానంలో నున్న కాంగ్రెసునాయకులే యీ పద్ధతిలో ప్రభుత్వ యంత్రాంగంపైనా, పంచవర్ష ప్రణాళికలపైనా అభిప్రాయాలు వెల్లడిస్తూంటే సామాన్య కాంగ్రెసువాదులు యెలా నడచుకోవాలో దురూహ్యంగా ఉంది. ఈ అభిప్రాయాలు దేశహితంకోసం వెల్లడించామనిఅనవచ్చు.వాస్తవానికి యిందులో దేశహితంఎక్కడున్నది? భారతప్రజలం

దరి శ్రేయస్సులో నూతనబాధ్యతలను కాంగ్రెసు స్వీకరించిన యీ సమయంలో కాంగ్రెసుపై అపోహలను వ్యాపింప జేస్తున్నారని అనుకొంటున్నప్పుడు యివి యెలా దేశసౌభాగ్యానికి దోహదం చేస్తాయో కాంగ్రెసు అగ్రనాయకులే సమాధానం చెప్పవలసి ఉంది ప్రజాభిప్రాయాన్ని సమీకరించి ప్రజాహితం కోరి దేశాభ్యుదయంకోసం సహకార సమిష్టి వ్యవసాయాలను ప్రోత్సహించి కాంగ్రెసు తీర్మానాలను అమలుచేసే పద్ధతి ఇదిమాత్రం కాదని మేము విన్నవిస్తున్నాం.

సుభాషితం

"ఈనాడు ఈ సహకార వ్యవసాయ సమస్య, దుమారంలా అంతటా వ్యాపించి ఈ పద్ధతి అమలు విషయమై పలువురు పలురకాలుగా తమ ఆంతర్యాన్ని వెళ్ళబుచ్చారు ఏది యెలావున్నా, భారతదేశంలో రైతు సమస్యను పరిష్కరించందే దేశాభివృద్ధి సాధ్యంకాదు. రాజకీయపార్టీలు అన్నీ ఈ సమస్యను కాతరవుచేయటం లేదు కాని యేది అమలులోకి తీసుకురానున్నా, యేదో రకమైన తమ 'పార్టీ' దృక్పధానికి లొంగి నిజమైన అభివృద్ధి మార్గాన్ని బలహీనపఱచి, కుంటుపరుస్తున్నారు."

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు వారపత్రిక "ఆంధ్రశ్రీ" నుండి

శ్రీ జగన్నాథపండితరాయ విరచిత

గంగాలహరి

అనువాదకులు : డాక్టర్, శ్రీ బూర్గుల రామకృష్ణరావు

౬

శరచ్చంద్రశ్వేతాం శశిశకల శ్వేతాలముకుటాం
కరైః కుంభాంభోజే వరభయనిరాసౌచ దధతీమ్।
సుధాధారాకారాభరణవసనాం శుభ్రమకర -
స్థితాం త్వాం యే ధ్యాయన్త్యుదయతి న తేషాంపరిభవః॥

శారదచంద్రవిభ్రమ, విసారిశశిద్యుతిమత్కిరీటశ్రీ
హార, కరాంబుజాంచిత వరాభయవారిజసౌధకుంభ, వి
స్తారసుధారసాభరణ చారునవాంబర, నక్రరాజసం
చార, నినున్ దలంపఁ గనఁజాల పరాభవ దుఃఖజాలమున్. ౪౮

దరస్మిత సముల్ల సద్వదన కాంతిపూరాస్పదై -
ర్భవజ్వలనభర్జితా ననిశ మూర్జయంతీ నరాన్ ।
చిదేకమయ చంద్రికాచయ చమత్కృతిం తన్వతీ
తనోతు మమ శంతనోః సపది శంతనోరంగనా ॥

దరహాసోల్లసితాననాబ్జ విగళద్ధారా సుధాపూరముల్
గురియన్ జేసి భవాగ్నిభర్జితులకాలో జీవనమ్మిచ్చుచున్,
గరుణన్ జిన్మయచంద్రికాకృతి చమత్కారమ్ము లూరించుసుం
దరి, శ్రీశంతనుసుందరిన్ గొలుకు "దద్యాత్ శంతనో" రంచునిన్ ౪౯

మంత్రైర్మీలిత మౌషధైర్ముకులితం త్రస్తం సురాణాం గణైః
స్రస్తం సాంద్రసుధారసై ర్విదలితం గారుత్మతై ర్గ్రావభిః ।
వీచిక్షాలిత కాళియాహితపదే స్వర్లోకకల్లోలిని
త్వం తాపం నిరయాధునామమ భవజ్వాలావలీఢాత్మనః ॥

సురిగెన్ మంత్రము, లౌషధమ్ములుడిగెన్, క్షోభించెదేవాళుల్
విరిసెన్ జారుసుధారసమ్ము, లురలెన్ వేవే గరుత్మన్మణుల్
సురకల్లోలిని ! నా భవాగ్నితపనక్షోభమ్ము వారింపు మ
మ్మరో ! సంక్షాళితకాళియాహిరిపు శుంభత్పాద ! గంగానదీ. ౫౦

ద్యూతే నాగేంద్రకృత్తి ప్రమథగణమణిశ్రేణి నందీందుముఖ్యం
సర్వస్వం హారయిత్వా స్వమథపురభిది ద్రాక్పణీకర్తుకామే ।
సాకూతం హైమవత్యా మృదులహసితయా వీక్షితాయాస్తవాంబ
వ్యాలోలోల్లాసి వల్గల్లహరి నటఘటీతాండవం నః పునాతు ॥

ద్యూతమ్మందు ఫణీంద్రకృత్తి ప్రమథాదుల్ నందిరత్నాఘముల్
జేతంగల్గిన వెల్లయోడి శివుఁడుత్సేకించి తన్నొద్ద, సా
కూతశ్రీ సుమయుల్లసన్ నగుచు గన్గో, నీచలద్వీచికా
ఘాతోల్లోల విలోలతాండవ శుభాకారమ్ము మమ్మోముతన్. ౫౧

విభూషితానంగరిపూత్తమాంగా సద్యఃకృతానేకజనార్తిభంగా
మనోహరోత్తుంగ చలత్తరంగా గంగా మమాంగాన్యమలీకరోతు॥

కనదనంగరిపూత్తమాంగానఁ గులికి
ఘనతరాశ్రిత భంగ భంగమ్ముఁ జలిపి
పొలుచు నుత్తుంగ మధుర మంగళ తరంగ
గంగ దనియించుఁగాక మాయంగకముల. ౫౨

ఇదియు జగన్నాథునిచే
నుదితము "పీయూషలహరి"యను, నాంధ్రమునం
దిదె రామకృష్ణకవిచే
గదితమ్మా కల్పభద్రకల్పమ్ముగుతన్

శ్రీ శ్రీ శ్రీ

ఉపనిషత్తులు

న్యాయ, సాహిత్య విద్యాప్రవీణ . ధూళిపాళ రామచంద్రశాస్త్రి.

౨

నమోబ్రహ్మణే నమస్తేవాయో త్వమేవ
ప్రత్యక్షం బ్రహ్మాసి
త్వమేవప్రత్యక్షం బ్రహ్మవదిష్యామి ఋతం
వదిష్యామి
సత్యంవదిష్యామి తన్మామవతు తద్వక్తార
మవతు
అవతుమామ్ అవతువక్తారమ్।
ఓంశాంతి శ్శాంతి శ్శాంతిః॥

నమోబ్రహ్మణే = పరబ్రహ్మము కొరకు నమస్కారము. ఇంతకు పూర్వ భాగమున యోగాంతరాయముల నివృత్తికొరకు అవయవములయందును, అవయవియందును, అభిమానులగు దేవతలను సుఖప్రాప్తికొరకు ప్రార్థించి ఈ వాక్యముచే ఆదేవతలకు అంతర్యామియై ప్రేరకుడగు పరబ్రహ్మమునుగూడ ఆసుఖము నుద్దేశించి ఉపాసకుడు నమస్కరించుచున్నాడు. నమస్తేవాయో = వాయు దేవత కొరకు నమస్కారము. అనగా జ్ఞానక్రియాశక్తి సముపేతమగు సూత్రరూపమున నిఖిలప్రాణి సమూహమునకు ప్రాణరూపమున వెలయుచున్న వాయు దేవతకు నమస్కారమని భావము. ఈ యర్థమున, "వాయుర్వైగౌతమ తత్సూత్రం వాయునావై గౌతమసూత్రేణాయంచలోకః పరశ్చలోకః స్సర్వాణిచ భూతాని సందృబ్ధానిభవంతి" యను శ్రుతి వాక్యము ప్రమాణమగుచున్నది. ఇచట సర్వాంతర్యామియగు పరబ్రహ్మము పరోక్షమై కేవలము శాస్త్రానుమాన గమ్యమగుటచే మొదటివాక్యమున పరబ్రహ్మమునకు సంబోధనము లేదు. వాయు దేవత సూత్రరూపమున త్వగింద్రియ గ్రాహ్యమగుచున్నందున రెండవ వాక్యమున నమస్క్రియమాణమగు వాయు దేవతకు సంబోధనము శ్రుతియందగపడు చున్నది. అనగా పరబ్రహ్మము సూత్రస్వరూపమగు వాయురూపమున అపరోక్షమని భావము. గనుకనే 'త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి' అను సమనంతరవాక్యముచే వాయుదేవతయగు నీవే ప్రత్యక్షమగు పరబ్రహ్మమని పైన ఉదహరించిన భావమే విశదీకరింపబడినది.

త్వమేవప్రత్యక్షం బ్రహ్మవదిష్యామి = ఓ వాయుదేవతా! నీ రూపమునే సాక్షాత్కార యోగ్యమగు పరబ్రహ్మమునుగా చెప్పగలనని యర్థము. అనగా సోపాధికమగు బ్రహ్మము, ఏయేరీతిగ ఉపాసింపబడుచున్నదో చిరకాలము అభ్యాసముచే ఆయారీతిగ సాక్షాత్కార యోగ్యమగునని భావము. ఈ విషయము శాండిల్యవిద్యయందు "ఏవమితః ప్రేత్యాభి సంభావితాస్మీతియస్యస్యాదద్ధానవిచికిత్సాఽస్తి" ఈ మొదలగు వాక్యములచే చక్కగ వివరింపబడినది. మరియు "దేవోభూత్వా దేవానప్యేతి" వాక్యముగూడ పైవిషయమునే స్పష్టపరచినది.

ఋతంవదిష్యామి = విద్యమానమగు యర్థమును (వాయుదేవత సాక్షాత్కార యోగ్యమగు పరబ్రహ్మమను యర్థమును) మానసముచే ఆలోచించుట ఋతవదనము ఈరీతిగ ఋతమును చెప్పగలనని తాత్పర్యము.

సత్యం వదిష్యామి = మానసముచే చింతితమగు విషయమును వాగ్రూపమున

ఉచ్చరించుట సత్యవదనము. ఈ విధముగ సత్యమును చెప్పగలనని భావము.

తన్మామవతు = తత్ = ఉత్తర భాగమున వక్ష్యమాణమగు ప్రత్యక్షమగు బ్రహ్మము, మాం = విద్యార్థియగు నన్ను అవతు = రక్షించుగాక.

తద్వక్తారమవతు = వక్తారం = విద్యోపదేశమందు సామర్థ్యముగల ఆచార్యుని గూడ ఆ పరబ్రహ్మము రక్షించుగాక. అనగా విద్యోపదేశమందు సమర్థుడగు ఆచార్యపురుషుని విద్యాగ్రహణమందు ప్రయత్నము చేయుచున్న అంతే వాసి నిన్ని ఉపదేశగ్రహణ సామర్థ్యమునిచ్చి రక్షించుగాక యని తాత్పర్యము.

అవతుమాం। అవతువక్తారం॥ ఈ రెండు వాక్యములచేతను పైవిషయమునే తిరిగి దృఢపరచుట కొరకు గ్రహణోపదేశముల యందు సామర్థ్యమును సమకూర్చి శిష్యాచార్యులమగు మా ఇద్దరిని రక్షింమగాక యను యంశము దార్ఢ్యముకొరకు తిరిగి ప్రతిపాదితమైనదని తేలుచున్నది.

"ఓంశాంతి శ్శాంతి శ్శాంతిః" ఇచట శాంతి కలుగుగాక యను విషయము మూడు పర్యాయములు శాంతిపదత్రయముచే చెప్పబడినది. ఇందలి భావమేమనగా- శాంతియనగా విఘ్నోపశమనము. విఘ్నములు ఆధ్యాత్మికములనియు, అధిభౌతికములనియు, అధిదైవికములనియు మూడువిధములగ నున్నవి. జ్వరము, శిరోవ్యాధి మొదలగు విఘ్నములు ఆధ్యాత్మికములు. యక్షరాక్షసాద్యుపద్రవములు- అధిభౌతికములు- దేవాద్యుపద్రవములు- అధిదైవికములు. ఈ మూడు విధములగు విఘ్నముల ఉపశాంతికొరకు శాంతిశబ్దము మూడు పర్యాయములు పఠింపబడుచున్నది మరియు ఈవాక్యమున ఆదియందు పఠితమగు ఓంకారముచే ప్రతిపాద్యుడగు పరమేశ్వరుడు స్మరింపబడు చున్నాడు. పరమేశ్వరానుస్మరణముగూడ విఘ్నోపశాంతికి పరమమగు సాధనమైనది కావున ఓంకారవాచ్యుడగు పరమేశ్వరుడు విద్యకు సంభవించు సమస్తములగు విఘ్నములను నివారించి మమ్ములను రక్షించుగాక యని భావము.

★

కౌటిల్యార్థశాస్త్రమ్

ఆంధ్ర వివరణము

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి

౨

11 ప్ర కోశప్రవేశ్య రత్నపరీక్ష. ధనాగారమునందు దాచదగిన రత్నములను పరీక్షించుట, నానావిధ రత్నలక్షణములు మొదలగు రత్నపరీక్షా విషయములు ఒక అధ్యాయమున గలవు. 12ప్ర. ఆకరకర్మాంత ప్రవర్తనము. ఆకరములు అనగా గనులు. గనుల యందు లభించు లోహములు, ధాతువులు,లవణములు, రసములు, ఉపరసములు మొదలగు వాటికి సంబంధించిన ప్రకరణము ఒక అధ్యాయము. 13 ప్ర అక్షశాలయందు సువర్ణాధ్యక్షుడు, అక్షము వ్యహారములలోనిది. అనగా రాజ్యమందు వచ్చెడి ఆదాయవ్యయములను సంబంధించిన లెక్కలను కట్టు కార్యాలయము అక్షశాల. ఈ అక్షశాలయందు బంగారమును పరీక్షించు పని ఒక కార్యము. నాణెముల రూపములోగాని కరిగించిన ముద్దగా గాని,ప్రభుత్వమునకు చెల్లింపదగిన ద్రవ్యమునకై బంగారము నిచ్చినచో దాని పరీక్షించు కార్యాలయము. ఆ కార్యాలయమున కధ్యక్షుడు సువర్ణాధ్యక్షుడు.

14 ప్ర. విశిఖయందు సౌవర్ణిక ప్రచారము. విశిఖ అనగా టంకసాల. వెండి, బంగారము. మొదలగు లోహములచే నాణెములను తయారు చేయు శిల్పశాల విశిఖ. నాణెములను తయారు చేయు వారు సౌవర్ణికులు. ఆ సౌవర్ణికుల నడపడి, వారు చేయవగిన పని మొదలగు విషయము సౌవర్ణిక ప్రచారము ఒకఅధ్యాయము. 15ప్ర. కోష్ఠాగారాధ్యక్షుడు. వ్యవసాయము వలనను, పన్నులు వగైరాల రూపముగను వచ్చిన, ధాన్యములు,లవణములు, తైలములుమొదలగు పదార్థములను వేరువేరుగా నిల్వచేయదగిన గృహములు (కొట్లు) కోష్ఠాగారములు. వీటి యందు నియుక్తులగు అధికారులలో మొదటి పైయధికారి కోష్ఠాగారాధ్యక్షుడు నిల్వ చేయదగిన పదార్థములను సేకరించుట, వాటిని యథాయోగ్యముగ వినియోగించుట మొదలగు విషయములు గలది. 16 ప్ర.పణ్యాధ్యక్షుడు. పణ్యములనగా విక్రయింపదగినవి, స్థలజములు, జలజములు, ఇతరదేశములనుండి వచ్చినవి, తన దేశమందును తన భూమియందును పుట్టినవి యగు నానావిధ పదార్థములయొక్కయు ధరలను నిర్ణయించుట, మొదలగు విషయములు గలది. 17ప్ర. కుప్యాధ్యక్షుడు. ధాన్యాదులు తైలాదులు కోష్ఠాగారమందు చేర్పదగినవి.వాటికంటె భిన్నములగు వృక్షముల పట్టలు, మృగచర్మములు, గజవంతములు, కలప మొదలగు వస్తువులు లోహములు మొదలగునవి కుప్యములని చెప్పబడినివి. అట్టి కుప్యవస్తువులను తెప్పించుట, సంగ్రహించుట, విక్రయించుట మొదలగు విషయములపై అధికారి చేయదగిన పనులు గలది. 18ప్ర. ఆయుధాగారాధ్యక్షుడు.సమయ భేదముచే ఆయుధభేదములు, సహజముగ ఆయుధ భేదములు వాటి నిర్మాణము, ఆయుధ రక్షణము మొవలగు విషయములు గలది. 19 ప్ర. తులామాన పౌ(యౌ)తవము.తూచిగాని కొలచిగాని పరిమాణమును నిర్ణయించుట పౌతవము లేక యౌతవము అని చెప్పబడును. అందు త్రాసు మొవలగు తులామానముచే నగు పరిమాణనిర్ణయము తులామాన పౌతవము. ఇందు ఆయా తులామాన భేదములు నిరూపింపబడినవి. 20 ప్ర. దేశకాలమానము అంగులాది ప్రదేశమానములు, దినమాసవర్షాది కాలమానములు ఇందు గలవు. 21 ప్ర. శుల్కాధ్యక్షుడు. క్రయ విక్రయాదులందు విధింపబడు (పన్ను) గ్రహించుధనము శుల్కము. (సేల్టాక్సు) ఈ శుల్కశాఖ, ఈ శుల్కమును సంబంధించిన భవనములు (కార్యాలయములు) అందలి కార్యకరవర్గము, ఆశుల్కపరిమాణభేదములు(దానికిపై అధికారి అధ్యక్షుడు) ఆ అధ్యక్షుని కర్త

వ్యము మొదలగునవి యిందు గలవు. 22 ప్ర. శుల్క-వ్యవహారము. శుల్క-ము ఏవిషయము నందెంత విధించి గ్రహింపవలెనో ఆశుల్క-నిర్ణయమందు వివరింపబడినది. 23 ప్ర సూత్రాధ్యక్షుడు. రోమములు (ఉన్ని) నార, పత్తి, పట్టు మొదలగువాటిచే నగు దారములు, ఆదారములచే నగు వస్త్రములు కంబళ్ళు మొదలగు వాటిని నిర్మింపచేయుట మొదలగు విషయములపై అధికారి సూత్రాధ్యక్షుడు. పేము మొదలగువాటిచే నిర్మింపబడు ఆసనములును బుట్టలు మొదలగున్నవియును ఇందు చేర్పబడినవి. వీటిని సంబంధించిన విషయములు గలవు. 24 ప్ర. సీతాధ్యక్షుడు. సీతా నాగేటిచాలు.గావున వ్యవసాయశాఖ, సీతాధ్యక్షుడు, వ్యవసాయ శాఖాధ్యక్షుడు. ఈ శాఖాధ్యక్షుడు తెలియవగిన విషయములు-వ్యవసాయ పద్ధతి, వృక్షములు, పొదలు, తీగలు (పాదులు) మొదలుగాగల వాటి భేదములు, వాటి పెంపకము,వాటి విత్తనములను సంగ్రహించుట, వాటివాటి ఋతుకాలములు మొదలగు విషయము లిందుగలవు. 25 ప్ర. సురాధ్యక్షుడు. మద్యములు, వాటి భేదములు.వాటిని తయారుచేయుట, నానావిధ మద్యములయొక్క- క్రయవిక్రయములు, ప్రభుత్వమునకు వాటిపైగల యధికారము, ప్రభుత్వానుమతి లేక, మద్యముల నుత్పత్తిచేయుచో శిక్షించుట, గూఢపురుషుల కర్తవ్యము,మద్యోత్పత్తి విక్రయములపై శుల్క-ము మొదలగు విషయము లిందుగలవు. 26 ప్ర. సూనాధ్యక్షుడు. మృగపశుపక్ష్యాదులను రక్షించుట, మాంసాదులకై హింసించుట. మాంసాస్థి చర్మాదుల విక్రయము వాటి నిబంధనలు, నిబంధనల నతిక్రమించిన దండనము మొదలగు విషయము లిందుగలవు, ఈ విషయములందు పెద్ద యధికారి సూనాధ్యక్షుడు. సూనా అనగా వధస్థానము. 27 ప్ర. గణికాధ్యక్షుడు. నృత్తగీతాదులందును, పుష్పమాలా బంధాదులందును, కళలయందు నైపుణ్యముగల రాజపరిచారికలు గణికలు. ఆ గణికలపై యధికారి గణికాధ్యక్షుడు, గణికలకృత్యము, ఆగణికల రక్షణము మొదలగు విషయము లిందుగలవు. 28 ప్ర. నావధ్యక్షుడు సముద్రమునందును,నదులందును,మనుష్యులను పదార్థములను స్థలాంతరమునకు చేర్చు పడవలు, నావలు - వాటిపై యధికారి నావధ్యక్షుడు. మనుష్యులను, పదార్థములను, పశ్వాదులను దాటించుట, అపుడు వారివారి వలన గ్రహింపదగిన శుల్క-ము మొదలగువిషయములుగలది. 29 ప్ర, గోధ్యక్షుడు, గోవులు, వృషభములు, మేకలు, మహిషులు,మహిషములు,వాటిసంగతి స్వదేశీయములు,పరదేశీయములు వాటిని రక్షించుట, వాటి చికిత్స, మొదలగు విషయములు గలవు. ఈ పనులకై యధికారి గోధ్యక్షుడు. 30 ప్ర. అశ్వాధ్యక్షుడు. అశ్వభేదములు, అశ్వచికిత్స, అశ్వశాలానిర్మాణము. అశ్వశిక్షణము, మొదలగు విషయము లిందుగలవు. 31 ప్ర. హస్త్యధ్యక్షుడు. ఏనుగులపై యధికారి. ఏనుగులను పెంచుటకు అరణ్యములు, గజశాల, గజరక్షణము ఇత్యాది విషయములు గలవు, 32ప్ర. హస్తిప్రచారము, గజభేదములు మొదలగు విషయములు గలవు. 33 ప్ర. రథాధ్యక్షుడు, సేనాధ్యక్షుడు. సేనాపతిప్రచారము మూడు విషయములు గలవు.అందు రథభేదములు వాటిపరిమాణములు సేనాభేదములు, సేనానాయకుడు గమనింపవలసిన విషయములు ఇందుగలవు. 34ప్ర. ముద్రాధ్యక్షుడు, వినీతాధ్యక్షుడు రెండు విషయములు, ప్రవేశ నిర్గమనములం దియ్యబడు చిహ్నము ముద్ర. జనసంచార శూన్యప్రదేశముల కధికారి వినీతాధ్యక్షుడు 35ప్ర.సమాహర్తృ ప్రచారము(బహువిధాదాయములను గ్రహించువాడు సమాహర్త ఇందు రెండు విషయములు సమాహర్త చేయవలసిన పనులు, కార్యవిభాగము, సమాహర్తచే నియోగింపబడిన చారులు చేయవలసిన కార్యములు,చారులయొక్క- గృహపతి, వైదేహిక, తాపసాది రూపములు. ఇందు గలవు. 36 ప్ర. నాగరకప్రణిధి, నగరమందు చారులవలన విషయములను తెలిసికొని చేయవలసిన కార్యము లిందు చెప్పబడినవి. ఇది అధ్యక్ష ప్రచారము రెండవ యధికరణము.

క్షుభిత పథయాత్ర

“అ సూ నా”

తరలెఁ వసంతముల్ సుమ వితానవిహీనత, దారుణాతపా
దరణఁ గఱంగె దర్పమును, తద్దయు వ్రాలెను కుంభపోతలన్
పరువము దప్పి భావలత, పత్రములల్లన రాలె శైశిర
స్ఫురణల నౌర! సత్కుసుమ భోగ మరందము లంద వెందునన్!

ఏ నెఱుగన్ త్వదీయ తలమెయ్యెడో ? జేరగ మార్గమెట్లో ? నీ
యానన దీప్తిచంద్రికల యాదరమెంతయొ ? రాగ పూర్ణ హృ
త్స్వాన మధూపభోగ పరితోషితులేరో ? మదీయ మానసో
ద్యాన లతాంత మొక్కటి పదాంతికమైనను జేరనిత్తువో ?

శ్రీ నిరవొందు సౌఖ్యముల జెన్నగు చెన్నడొ తోచకుంట నెం
తేని దరిద్రతాఘయుత దీనతమః పరిపూర్ణ మానసా
స్థాన విపంచి మ్రోగెడిని, తావకపాదనిషేవణాంచిత
ధ్యాన పునీతరాగముల ; తానము, పల్లవు లీవు కూర్పవే!

నగరే నన్నని తోడివారలిల విన్నాణంపు భోగంబులే
తగనాపాలిటి కెండమావులగుటన్ ; దాక్షిణ్య మొప్పారనీ
గగనోత్తుంగ సరిర్ఝరీ విమల సత్కావ్యామృతాస్వాదనన్
తగనాచాన ! విజేతఁగాఁగ మధుసంధాన ప్రచారమ్మునన్ !

సుప్తమనోగతాంకురము సూనమః విచ్చి నిమేషమేని ని
క్షిప్త పరాగరేణుల వశీకృత దౌత్యమొనర్ప, భావసం
ప్రాప్త మధూదయాధరవిభాసిత సౌఖ్యము కొల్లగొందు, నా
లిప్తయె కోరుచుంటి నవలీల లభింపగజేయవే రహిన్ !

చేసెదు పర్వులందెపుడు చేరగలేదొక ఘట్టమీ సమా
శ్వాస సుదీర్ఘ వేదికన శాశ్వతబంధము లెట్లొ ప్రీలిపో
నాసలమించు దీవెలిల నద్భుత దీప్తులనింపు నత్తఱిన్ ;
బాసటలేమి నీక్షుభితపాంథ పురోగతి యెట్టులుండునో ?

సైడ్ లైట్సు

సా కా

[శ్రీ ఖాసా సుబ్బారావుగారు ఇంగ్లీషు పత్రికా రచనావృత్తిలో ప్రసిద్ధుడని ప్రతీతి ఈమధ్య విజయవాడ పట్టణంలో తెలుగు పత్రికా రచనావృత్తిలో ప్రసిద్ధి గాంచిన శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారికి సన్మానం జరిగితే అందుకు ఆనందించి యీ క్రింది అభిప్రాయాలను 'స్వరాజ్య' సైడులైట్సులో వెలువరించారు. నవభారతి పాఠకుల సౌకర్యార్ధం 'స్వరాజ్య' వారపత్రికకు కృతజ్ఞతతో యిది ప్రచురిస్తున్నాం.]

గత సోమవారం శ్రీ నార్ల వెంకటేశ్వర రావుకు విజయవాడలో జరిగిన సన్మానానికి నేను అనారోగ్య కారణాలవల్ల హాజరు కాలేక పోయాను. శ్రీ నార్ల సన్మానం మహోజ్వలంగా జరుపబడిందని కొందరు మిత్రులు చెప్పగా విన్నాను. పత్రికా రచనావృత్తి చాలా విచిత్ర మైనది. గాలిలో దీపం పెట్టడంవంటిది, కష్టించినదానికి ఫలితం తప్పక రాగలదనే హామీ లేని వృత్తి ఇది. అవరోధాలు అనేకం. శ్రీ నార్లకూడా ఈ వృత్తిలో అడుగు పెట్టిన తొలి రోజులలో ఈ కష్టనష్టాలన్నిటిని రుచిచూచిన వారే. ఆయనకు అండదండలాలేవు. కేవలం స్వయంకృషివల్లను, చిత్తశుద్ధి వల్లను ఆయన తెలుగుదేశంలోని పత్రికారచనా ప్రపంచంలో ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించగలిగినారు.

'స్వరాజ్య' పత్రికలో శ్రీ నార్ల విలేఖరిగా ఉన్నప్పుడు ఆయన్ను నేను ఎరుగుదును. ఆయన ఎంతటి కార్యభారాన్నైనా ఎంతో మెలకువతో నిర్వహించగలిగి ఉండడం నన్ను ఎంతో ఆకర్షించింది. తరువాత శ్రీ రామనాధ్ గోయింకా 'ఆంధ్రప్రభ'ను స్థాపించినప్పుడు సంపాదకవర్గాన్ని సూచించవలసిన బాధ్యత నాపై పడింది. శ్రీ నార్ల తన వైశిష్ట్యాన్ని నిరూపించుకుని సంపాదక వర్గానికంతకూ నాయకుడు కాగలిగినాడు పత్రికారచన అనగా కేవలం వార్తల అనువాదంకాదు. శ్రీనార్ల దైనందిన ప్రపంచ వ్యవహారాలతో సంబంధ బాంధవ్యాలను పెట్టుకుని పత్రికా రచనలో ఒక నూతన దృక్పథాన్ని ఆవిష్కరించారు. శ్రీ నార్ల ఎంతో కష్టించి పని చేయగల స్వభావం గల వ్యక్తి. తన కృషిలోనే తన ఆనందాన్ని సాక్షాత్కరించుకో గలిగాడు. కృషి, లక్ష్యనిరతి ఈ రెండు లక్షణాలవల్లను శ్రీ నార్ల తెలుగు ప్రజలందరి ఆదరాభిమానాలను చూరగొనగలిగాడు. అనవరత కృషివల్ల పత్రికా రచనా వృత్తిలో మహోన్నత శిఖరాన్ని అధిరోహించగలిగిన ఒక వ్యక్తిపట్ల ఒక సంఘము చూపగల గౌరవాదరాలకు ఈ సన్మానం ఒక ఉదాహరణ. రాజకీయాలలో కంటె పత్రికారచనా వృత్తిలో వ్యక్తికి స్వాతంత్ర్యం హెచ్చు. పత్రికారచనా వృత్తి నిష్పాక్షికమైనది. పార్టీ రాజకీయాలకు అతీతమైనది. పార్టీ రాజకీయాలకు అతీతంగా నిష్పాక్షికంగా పత్రికారచన మన గలగడం ఇక ముందు మనం చూడవలసిఉంటుంది, ఇకముందు పార్లమెంటరీ రాజకీయాల ఆటుపోట్లు శ్రీ నార్లను మధ్యపెట్టవని, ఇతః పూర్వంవలెనే ఆయన పవిత్రమైన పత్రికారచనా వృత్తికి సేవ చేయగలరని నేను ఆశిస్తున్నాను.

శ్రీ సుభటుని దూతాంగదము

[నాటకము]

అనువాదకుడు : పాలావఝ్ఝల రామశాస్త్రి, ఎం. ఏ.

కుముదకుంద మృణాలగౌరము మురారి
కరతలాంబర పూర్ణిమా కైరవాప్త
మసురనారీ జఘన కాంచికాపహారి
పాంచజన్యము మిమ్ముఁ గాపాడుఁగాత.

ప్రాంతదైత్యు డొల్ల వోవఁగనేమొ గిరిశు ని
    ష్వసనమ్ము విఱుఁగుఁశబ్దమ్ము సౌరదు
శక్రసూను వినాశ సమకాలమున దూర
    భారమ్ము కాఁబోలు వార్తపోదు
స్వాయత్త త్రిభువనీ వ్యాహారమున సేతు
    బంధమ్ముగూడ విస్వరము తేదు
గతిమాలెనా యేమి కపిరాజ సుతుఁడైన
    యంగదు సంవాద మసుర వినఁడు.

కారణము గాని యొకఁడైన కారణమున
మానుష విభూతి ధరియించు మాధవుండు
జరపు వైష్ణవభావము జగతిజనుల
నరసి శోభనపంక్తి నోలార్చుగాత.

- నాంద్యంతమున -

సూత్రధారుఁడు : **(పరిక్రమించి నేపథ్యమవలోకించి) - ఓసి విలాసవతి ! ఇటు రమ్ము.**

నటి : ఆర్యపుత్ర ! ఇదె వచ్చితిని. కర్తవ్యమాజ్ఞాపింపుఁడు.

సూత్ర : సమస్త భూమిభారసముద్వహన కుహనా వరాహుఁడు, నిజభుజయుగవిదళితవైరి సుందరీ నయన నీలోత్పల బహాలబాష్ప పరిప్లవమాన ప్రతాప రాజసింహుఁడు. మహారాజాధిరాజ శ్రీమత్కుమారపాలదేవుని పరిషత్తు శాసనానుసారము ప్రబంధవిశేషము నుపక్రమించుచున్నాఁడను. ఓహో ! సామాజికులార ! సావధానులై యాకర్ణింపుఁడు. ఈ వసంతోత్సవ సమయమున శ్రీ కుమారపాలదేవుని యాత్రా సమయముఁనఁ బదవాక్యప్రమాణ పారంగతుఁడు మహాకవి శ్రీ సుభటునిచే నిర్మితమగు దూతాంగదము ఛాయానాటక మభినయించుటకు యోగ్యమైనది.

నటి : ఆర్యుని వ్యవసాయము యుక్తముగానున్నది.

తెరలో

తారాపతి వాలి నణచి
సౌరికిఁ గీశాధిరాజ్య సంపదనిడి యం
భోరాశి దాటి రఘుకుల
వీరుండు సువేలశైల విటపిన్ విడిసెన్.

సూత్ర : ఆర్యులారా ! కుశీలవునిచే నారంభింపఁబడినది గూడ. ఇవె రామానుచరులగు వీరులపరస్పరాలాపములు వినవచ్చుచున్నవి. మనము ననంతర కరణీయముల సజ్జీకరింపుదము. పదము.

(నిష్క్రమింతురు - ప్రస్తావన)

అంతట సువేలశైలమున సుగ్రీవాది పరివారముతో శిలాతలమున నాసీనులై రామలక్ష్మణులు ప్రవేశింతురు—

రాముఁడు : వత్స ! లక్ష్మణ !

జడధి తరింపనయ్యె కపి
    శాసను శూరభటాళిచేత వ్రే
ల్మిడి కబళింపగాఁ బడిన
    లీల నిశాచర రాజధాని చొ
ప్పడె నిపుడేమి పౌరుష
    నిబంధన ముల్లలవట్టి కార్యముల్
విడువక యాచరించితిని
    విల్లును దైవము మీఁదఁగల్గెడున్.

లక్ష్మణుఁడు : ఆర్య ! కాతరజనుల మనస్సు నవలంబించెడి దైవముతో నేమి.

ఉద్యోగించెడు పూరుషోత్తముని
    సంయోగంబు పొందున్ సిరుల్
సద్యం బిట్టిద దైవమంచును
    నదృష్టంబంచు నెంతుర్జనుల్

వద్యుల్ దైవము మాటమాని నిజ
సత్త్వ ప్రాప్తమౌ పౌరుషం
బుద్యోగింపుము దాన సిద్ధియగుఁ
గాదో దోసమే మిందునన్.

మఱియు—

భ్రుకుటి లలాట దేశమునఁ
బొందనిదాఁక తథా విధంబు కా
ర్ముక శిఖరంబు మౌర్వి యధి
రోహము సేయనిదాఁక రాక్షసా
ధికుని త్రిలోకమూల
విమథి ప్రసభంబు భుజామదంబు మి
న్నక పటువై చెలంగుత
వినాశదశాభిముఖీన వైఖరిన్.

కావున నంగదుని దౌత్యముసేయ నాదే
శింపుము.

రాముడు (**సబహుమానముగ నంగదు నవలో
కించి**) వత్స!

నీ తండ్రిన్ సురరాజ సూనుని
బలోన్నిద్రున్ దశగ్రీవు నా
రీతిం జేసిన చేఁత నేఁటికిని
వర్ణింపంగఁ జాలన్ మనః
ప్రీతిం జూపెడుఁ జూడు మీ పులక
తండ్రిన్ బుత్రతావృత్తి నీ
వై తోపింతు వలంకరింపుము
నిసృష్టార్థాఖ్యమున్ దౌత్యమున్.

అంగదుఁడు (**శిరమునఁ గేల్దోయి దోయిలించి**)
స్వామి!

ప్రాకారాట్టవిహారతోరణవతిన్
లంకన్ సపాటంబుగాఁ
దోకొంచిప్పుడ వత్తునా యచటనే
తూగింతునా సైన్యమున్
నీకుం గోత్రమహీధ్ర ముల్వెఱికి
కంధిన్వేగ బంధింతునా
యాకల్పంబుగ దేవ! యానయిడు
దో, ప్రాప్యంబు నా కెల్లయున్

రాముఁడు - వత్స!

అజ్ఞానంబగు నాధిపత్య రభసం
జేఁగాదు నేలేక సా
వజ్ఞంబియ్యది సీత నెత్తికొని
పోవం జెప్పుమా దీని నా
యజ్ఞున్ రావణునేఁగి లంక విడు
కాదా లక్ష్మణోన్ముక్తమ
ర్మజ్ఞోగ్రాస్త్ర నిపీత శోణితము
యామ్యమ్మెగుదో సంతుతోన్.

అంగదుఁడు - దేవ!

సంధిసేయంగనో రణోత్సవము సేయ
నేను దూతుఁడఁగా నిర్జితేందిరయొ య
నిర్జితేందిరయోగాని నిర్జరారి
లక్ష్మికుతి పీరిపై నీవరాజిలుదువు.

రాముఁడు-సాధు వాలినందన సాధు.

(**అని వీపు చేతనిమిరి పంపును. అంగదుఁడు
ప్రణమిల్లి నిష్క్రమించును**).

సుగ్రీవుఁడు (**లంకాశైల శిఖర మాలోకించి**)
దేవ! చూడుము.

వానర వీరవరూధిని నూనరి
చూడ్కులను జూచుచున్ దశకంరుం
డానెఱి నిజాంసములపై నూనెను
మత్తేభమునకు నొనరిన పోల్కిన్.

కావున రమ్ము మనమును సువేలవన తిలకిత
మగు జలధి తటముల దర్శింతము.

(**నిష్క్రమింతురు**)

(**అనంతరము రావణుఁడు మండోదరీ విభీషణాది
పరివారము ప్రవేశింతురు**).

రావణుఁడు (**విభీషణు నుద్దేశించి**) వత్స!
విభీషణ!

ఇవె నా బాహులు వృత్రహాభుజ శిరః
కృష్టాభి కంఠూతికల్
నవపంచ ప్రథిత ప్రభూత జగతీ
లావణ్య సంహారుఁడ
న్నవిలంకాపతి నేన రావణుఁడ
నిచ్చన్ సేతుబంధమ్ము వా
ర్త వినంజాలితి వానరావృతను
జూడంగంటి లంకాపురిన్

భువిజీవించెడువారు వేనిఁ గనిరో
పూరింపరో వీనులన్.

మఱి

జంభారాతి మదేభకుంభ దళన
స్వైరమ్ము మత్ఖడ్గమున్
కుంభద్ధారము చంద్రహాసము ముని
శ్రోత్రమ్మునుం జెందదో
జంభారాతి జిదాది యోధశత
విస్తారన్ బురిన్ లంక నీ
దంభారంభుఁ డెఱుంగఁడో నిజము
ప్రాప్తంబైన, గాలమ్ము సం
రంభంబంతయు వీడి జంతుమతి
విద్రావమ్ము నందుంగదా.

ఈనా బాహుయుగమ్ము లి
దానీంతన లేఖనాథ దర్పశశికి స్వ
ర్భానులు తలిసికవ పయింబూనెను
బగయన నరిష్టమునకుఁ గొలఁదియే.

మండోదరి (స్వగతము)

ఈయన గళమున గర్వము పాయక
యిప్పుడును విషము వర్షించెడిఁ దా
నాయతి చెడిన యసురసముదాయము
నడలుకొన సాగియలరక యున్నే.

(ప్రకాశముగ)నాథ! చూడుచూడు మాశ్చర్య
మాశ్చర్యము.

విలసిల్లి వానరావళి కలుపించి
వరూధినులయు, గలకలమలవై
మలఁగి భవత్క్రీడావని విలాస వాసముల
యందు వినుచును బ్రతులన్.

రావణుఁడు- దేవి! ప్రకృతి ప్రియవాదిని!
చాలుచాలు నీ మర్కట కీటకోలాహల
బిభీషికలు.ఇఁక నేమైన జెప్పఁదలఁచితివా.

మండోదరి- ఇప్పుడైన దోసమేమియు లేద
యా రాఘవేశునకును రామసీత
నిచ్చిపుచ్చుదేవ! యింతి మండోదరి
యైదు సొమ్ములాంత మమరుఁగాఁత.

రావణుఁడు (సకోపహాసము) దేవి!
దోసంబొక్కఁడు మిక్కుటం బిదెయునేఁ
దోతెచ్చుట మైథిలిన్
దోసంబౌనది యిమ్మడిం బిదప
సాదుం దెచ్చి యొప్పింపకన్
దోసంబియ్యది ముమ్మడింగపి
వరూధుల్ లంకపై నెత్తగాఁ
దాసంధానము సేయు రావణుఁడు
సీతాదేవి నర్పించుచున్.

కావున దేవి విలాసగృహాము నలంకరించుఁ
గాక.

**(అన్నంతనే మండోదరి యశ్రులఁ జార్చుచు
నిష్క్రమించును).**

రావణుఁడు- వత్స! విభీషణ! నీవుకూడ నే
మైనఁ జెప్పఁదలఁచితివా.

విభీషణుఁడు- దేవ! నయచక్షువుతోడ విచా
రించుము.

మనుజులన్నవారు మనుజులుకారు వా
నరు లటన్నవారు వరలరట్లు
దేవ! తావకీనదైవ దుర్విలసనం
బిట్టిపేర దాపురించెఁగాని.

కావున రాక్షసకుల కాళరాత్రిని జానకిని
విడిచిపుచ్చుము.

రావణుఁడు (**రోషముతో ఖడ్గము వెఱికి**) ఆ!
పాప! శత్రు పక్షపాతి! దైత్యకులాంగార!
ఇదె యీ చంద్రహాసముచే నీ శిరస్సు
డొల్ల వేయుదును. (**అని సంరంభించును**).

విభీషణుఁడు భయముతో నోసరిల్లును.

మాల్యవంతుఁడు- (**అంతరాళమందుండి**) దేవ!
లంకాధినాథ! నయదృష్టితో విచారిం
పుము. కుమార విభీషణుఁడేమి యహిత
మాడెనా ?

రావణుఁడు- ఏమి నీవు నిట్లే యైతివా.

మాల్యవంతుఁడును భయముతో నూరకుం
డును.

రావణుఁడు (**విభీషణుని దిక్కుమొగమయి**)
ఓరి బాంధవాపసద! నా రాజధాని విడిచి
పొమ్ము. ఆ వనేచరుని ప్రక్కఁ జేరి నీనీతి
కౌశలము నెఱపుము. లేకున్న నిన్ను
కథాశేషుఁ జేయుదును.

విభీషణుఁడు- కానున్నది కాకమానదు.

(అని నిష్క్రమించును.)

(అంతఁ బ్రహస్తుఁడను ప్రతీహారి ప్రవేశించును)

ప్రహస్తుఁడు- దేవ! రాముని దూతనని
చెప్పుచు నొక్క-శాఖామృగము ద్వారము
నొద్ద నధివసించి యుండెను

రావణుఁడు (సావజ్ఞము) ప్రవేశపెట్టుము.

(అంతటఁ బ్రహస్తునితో నంగదుఁడు ప్రవేశించును)

అంగదుఁడు **(రావణు నవలోకించి స్వగతము).**

త్రిజగదాస్కంద కౌతుకోద్రిక్తుఁ డెవ్వఁ
డెవ్వఁడగు దశకంధరుఁ డెవనిశీర్ష
కమల వనమున రాముఁడు గాఢవేధి
కాండములగ్రుచ్చునో రావణుండె వీఁడు.

(ప్రకాశముగ)

ఓరి రక్కసులెచట సుధోష్ణకరుల
వంశరత్నముఁ దెచ్చి యపాయమంది
త్రిజగ దుద్దీపన కరాస్త్ర తీక్ష్ణశిఖికి
రామనామాగ్ని కెరయైన రావణుండు

(బహురాక్షసులు రావణరూపము నందుదురు.)

అంగదుఁడు-

ఓరీ రావణ! రావణులక్కటిపయుల్
వ్యుత్పన్నులా హైహయ
స్వారాడ్దోర్భర పేషితుం డొకఁడు
నీవార్థియై తాండవ
స్ఫారుండొక్కఁడు దైత్యదాసికలతో
సౌరెన్నఁగా లజ్జయే
స్వైరంబు ల్పచరించు నొక్కరుఁడు
నీవాలెక్కలో నౌదువా.

రావణుఁడు**(బహురూపములనుజ్జగించి హేలతో)**

ఓయి శాఖామృగ! ఎవఁడవు నీవు. ఎవ్వని
దూతవు.

అంగదుఁడు-

తండ్రి యుపరమింపఁ దనయుఁడు పైతృక
మైన వృత్తిభార మూనకున్న
యట్టివాఁడు వంశమందలి పూర్వుల
నెన్నికొనఁగ రాదు మన్నన యెడ.

అయినను
రక్కసి ముక్కిడి మూఁకల
వెక్కసము హరింపఁబడమి వెతమాన్పింపన్
ద్రొక్కిన రాముని దూతుఁడ
నక్కజుఁడనువాలిసుతుఁడనంగదుఁ డనఁగన్.

వాలిన్నా జనకుని మును
వాలించిన యట్టి రామభద్రుని దూతన్
బోలింప వాలిభుజబల
హేలావిక్రమము లీవు నెఱుఁగుదు గాదే.

రావణుఁడు- రాముండేమి పొనర్చుచుండె
నిపుడు ?

అంగదుఁడు- ఔరా! ఏమియున్లేద.

రావణుఁడు- తా, నేమై వార్ధితటమ్ము నిడ్డ
దరిసెన్ ?

అంగదుఁడు- ఈమైన

రావణుఁడు- బంధించెనేలా మున్నీటిని ?

అంగదుఁడు- లీలగాన్

రావణుఁడు- ఎఱుఁగఁడో లంకేశుఁడీ దిక్క-
నన్ గీమ్మైయుంట ?

అంగదుఁడు- ఎఱుంగు లంకపదవింగీలించి నీ
తమ్మునిన్

రావణుఁడు- రాముని యిప్పటి చర్య
యెట్టిది

అంగదుఁడు-

కపిబలాధిపతి యంకమున
శిరమున ఉహుని యంకమున
స్వపదమ్ముఁ జేర్చి శిష్టశరమృగ
చర్మపయి మేనువాల్చి
సపదిరక్షః కులఘ్నాస్త్ర
పీఠుల సౌమిత్రితోడ
నపరాబ్ముఖుండు రాఘవుఁడు
నీ తమ్ము నర్థివించుండె.

(రావణుఁడవజ్ఞను నటించుచుఁ బ్రహస్తుని చెవిలో నేమియో చెప్పఁగా)

ప్రహస్తుఁడు- దేవర యాజ్ఞాపించినట్లే.

(అని నిష్క్రమించును.)

(పిదప మాయామైథిలి ప్రహస్తునితోఁ బ్రవేశించును.)

మాయామైథిలి- ఆర్యపుత్రుఁడు జయించుఁ
గాక జయించుఁగాక.

(అని పలుకుచు రావణు నుత్సంగము నారోహిం
చును.)

రావణుఁడు- (తనలో) సాధుమాయామయి!
దశకంఠు నారాధించుట లెస్సగా నెఱుఁ
గుదువు.

(ప్రకాశముగ)

దేవి! విదేహనందిని! రామప్రేషితుఁడగు నీ
శాఖామృగమును ప్రతిబోధింపుము.

అంగదుఁడు - (సవిషాదముగఁదనలో) జానకి
యని పరాయాంగనా చరిత మాచరిం
చునా చూచుచు నుందును.

మాయామైథిలి- (అంగదుని సబహుమానముగ
నవలోకించి)

వత్స! అంగద! నా మాటలుగా రాఘవునిఁ
దెలుపుము.

వీరిపయి రాఘవేశ! కు
మారిలగా నేల యరుగుము నిజనగరిన్
మారుఁడు కరిగా నిజహృద
యారంభముతోడ దత్తనైతి నితనికిన్.

ఇటు నేను రావణాంక
స్ఫుటపంకజ రాజహంసముగ
రాఘవుఁడున్
దటుకున భరతుని రాక్షస
భటాళి భంగించి రాజ్యపదవి నెసఁగుతన్

అంగదుడుఁ- (కర్ణములు మూసికొని) ఇది
పూజ్యురాలు జానకి కాదు, కాదు
ఎన్నఁడేని వినియు నెఱుఁగ మీ యవినయ
మా త్తశీలమనఁగ నలరుభూష
గలుగు రామపత్ని గంగాపగయబోలె
భువనములనుఁ బూతముల నొనర్చు.

(అంతటఁ బటాక్షేపమునఁ బ్రవేశించి)

రాక్షసి- రాముని కించిదనిష్టముఁ
దామైథిలివించు సుమలతా పాశముచే
స్వామి! నిజసర్వ దుఃఖము,
బ్రామికొనందలవియురితివంగఁదొడంగెన్.

రావణుఁడు (ఖేదముతో)- ఆ, ఏమి యిట్లన
మయమందుఁ జెప్పితివి. రాక్షసులార!
జానకిని రక్షింపుఁడు, రక్షింపుఁడు.
(అని మాయామైథిలిని ద్రోసివైచును)

అంగదుఁడు- పరమార్థమైథిలీతే జము న
మాయామైదిలీ మయమయిన యంధకా
కారము తిరస్కృతమైనది.

రావణుఁడు- ఓయి వలీముఖ! ఇంక నేమైనఁ
జెప్పనిచ్చగింతువా?

అంగదుఁడు-

కొంచెము యేనియున్ దొసగు
గుంరదసూవె యకృత్యముల్ ప్రవ
ర్తించెదు నీకు - రక్కసుల
కిట్టిది మండనముఖ్యమై చనున్
గ్రించుఁదనమ్ము నంబరుని
గేహినిఁ దెచ్చుట దైత్యనాథునం
దంచితమైన యౌచితియు
నౌ; మఱి క్షత్రియరోష మెట్టిదో

రావణుఁడు- ఆ! పాప! దుర్ముఖుఁడ! మౌఖ
ర్యము ప్రదర్శించి రాఘవు నగ్గించుచుం
టివి మఱి నిదర్శనముచేఁ గాదురా

అంగదుఁడు- ఏమి ఒక యుదాహరణము
చూడుము

సరిగాఁ బ్రతిజ్ఞకు నుదు
స్తరమంభోరాశి దాఁటి స్వామియెవండా
పరి ఇతుచేత నువేల శి
ఖరితరువులుత్వగ్భుజముకై వడివిఱుఁగున్

రావణుఁడు- అరే విచారమూఢ!

పొరువాపిట్టలు తీరిచిదాఁట
నేరవే యీపయోనిధిఁ గ్రోతిగుంపు
తారుటల్గావచ్చి తరల దెగిరుల
నోరి! యాతని భూజాసారమ్ముగాని
సొరుగాఁ గరవాల ధారాకషోప
లారమ్ముపై శూరతా రేఖ వెలలు
వారించిననుఁ జాలువాఁడు ప్రస్తుతికి

మఱియు నోరి రావణు నీ వెఱుఁగవు.

మూఁపుల్దాపుగఁ గంఠపీఠమున
జీబుంగొన్న శీర్షాళి దీ

జాపారాయణ తత్క్షణమ్ము గెడపం
గాఁ జంద్రహాసాసిచే
నాపాటంబడు వానియం దొకఁడునే
నస్మేరమున్ గద్గదం
బౌపల్కన్ గళితాశ్రు భుగ్నమగుచో
నా శూలియే సాక్షియో.

అంగదుఁడు.

భువనభీతి విదారణమ్మలగు
రాఘవేశు శరములు నీచంద్రహాస వంశ
మందునేమగు వానిచేఁ జిందినీదు
తలలు శూలివిందునఁ బలెమొలువ వకట

రావణుఁడు. (**క్రోధముతోఁ జంద్రహాసము నంది**) ఓరి నా యెదురనుండి పోపొమ్ము లేదా కథాశేషుఁ గావింతును.

అంగదుఁడు. (**పోవనిచ్ఛగించుచు**) మధ్యాక్షరములు.

ఓరీ నిశాచరరాజ! మైథిలినున్న పాశమున
వే రామునకు నిచ్చిపొమ్ము వృథయు నీ
వీర్యమ్ము నీవ
పూరింపనేమియో కిన్నరోద్గీత భుజ విక్ర
మమ్ముఁ

గ్రూరమ్ముఁ గపినాథు సైన్యముం గనుం
గొనవె ముంగలను.
తలలిన్ని గలవను తేజుగొనబుగాఁ దలఁ
పకుమోరి
మలవింటివానిచేఁ గొన్నటులు రాముఁ
డొలికింపఁబోఁడు.

తిలకింపు కైలాససుభట! హార్దికయ్యల
చెఱ్వునయ్యోఁ
గొలుపరా నాబుద్ధివాలి దోర్దండగుంహిత
కీర్తి
మొదల సుబాహు ముఖ్యాసురులతోన
మోదెఁ దాటకను

జదురాలు చెలియలి మోము చెలువము
చదునుగఁ జేసెఁ
గుదురుగా వనములోనున్న నీ బందుగులఁ
గూల్చె వార్ధి
నదిమె రాముఁడు నిన్నుఁజంపు భ్రాంతి
యుంచెదర యింకేల.
ఔరా నిశాట! శంకరుఁడు వరమిచ్చెనని
నీతి విడకు

శ్రీరామపత్ని దొంగిలఁ గమతి నీవుచేసితే
నాఁడు
తా రోషమందె నానాఁడె మూఢ! కాదా
తలల్ భక్తి
దోరించి యీ ముండహారుఁడేల తోడ్తో
డనీ కొసఁగె.
ఇఁక నీ మహేశ్వర పరిచర్యా ప్రసంగ
పరమార్థము మాకుఁ దెలియనికాదు.
వృథాభిమాని!

పౌలస్త్యుండవు నీవు మై
పులకరింపుల్గొంచు శీర్షారవిం
దాళిం జంద్రకళా జటాభరణు
నేనైతృప్తిఁ బొందించితిన్
జాలన్నాపొగడో? విరించి ముఖమున్
ఘాతమ్ము గావింప ము
న్నాలంబై యది బాపఁగా శివుఁడు
కాయత్యాగి నిన్నోమెడున్.

ఓరి! దశకంధర! వినుము భవద్బహు
వదన గహ్వర వినిస్సృత బిభీషికలచే వెఱ
చెడివారము కాముర!

(**అని పలికి యంగదుఁడు నిష్క్రమించును**)
(**నే పథ్యమున**)

నీవై త్రిభువనపతి వి
ట్లీవానర సేన మిగిలి హింసించెడి రా
వే వీరాగ్రణి యెందు
న్నావో నీవిక్రమమ్ము నడపఁగ వలదే

రావణుఁడు (**సోత్సుకముగ**) అరే. అస్మదను జీవులు వధింపఁబడుచు మిగుల నాక్రోశించుచున్నారే.

(**అంతట విక్షతాంగులగు రాక్షసభటులు ప్రవేశింతురు**)

నిశాచర భటులు. నీవయి నాథుఁడవుండియు నీవన చరసేన మమ్ము హింసించుట యెట్లా విష్కృతమగు మఱి నీ

జీవితమున శాశ్వతోహ సేయకవు
వృథా

రావణుఁడు- ప్రహస్త! ప్రహస్త!
సజ్జమొనరింపఁబడుగాక సైన్యమిపుడ
రామహతకుని వనచరరాజి యెంత
నాకుఁ జంద్రహాసమ్ము శ్యామీకృతామ
రీవదన చంద్రహాసము క్రేవఁగలుగ.

(మరల వికటముగఁ బరిక్రమించి) అరామమరా
వణముగాని జగత్తు నేఁడగును **(అని
నిష్క్రమించును.)**

అంత హేమాంగద చిత్రాంగదులు గగనవీధీ
సంచారులు గంధర్వులు ప్రవేశింతురు.

హేమాంగదుఁడు- సఖుఁడ చిత్రాంగద!
భూర్భువ స్స్వస్త్రికమ్మును వెంబడించి
తొప్పులవెట్టు దివాస్త్ర పంక్తితోడఁ
బోరాడి, విక్షిప్తములయి మింటమెలంగి
పదితలల్ భాస్కరుఁ బదియునొకఁడు
గాఁజూపఁదన విశిఖమ్ముల శిఖలు నా
యోగపీఠికనుపహూతమునయి
యవకీర్ణియాటఁ బ్రాయశ్చిత్త మొనరింప
దొరకొను నైష్ఠికు బెరసి రాము
బ్రహ్మనామకాస్త్ర వరముచే నవకీర్ణ
మయి నిశాచరేశుఁ డయిన రావ
ణుని కబంధమదిర! నుతియింపదగు వీర
శయ్య నధివసించె శాశ్వతముగ

చిత్రాంగదుఁడు- సఖుఁడ! ఇట్టి గగనవీధిని
నిర్భయముగ సంచరించి యెంతకాలమైన
దోగద!

(నేపథ్యమునఁ గలకలము)

పదియవు శీర్షము ల్దిశలఁ
బాలనసేయ జనించెనేమొ యి
ర్వదియగు చేతులన్ బది
తెఱంగుల వీర్యపువర్షమ్ము పొందెనాఁ
బొదలిన రావణుండు రణ
భూమిఁ బెనంగుడు క్షిప్రమర్చిరా
స్పదముల రాము బాణముల
వ్రాలెఁ గబంధము నిర్విబంధమై

చారణుఁడు- హేమాంగద! చిత్రాంగద! చిత్ర
ముగా నున్నది. చూడుము చూడుము
మునుముగఁ బైఁడివేడిఁబొరి
బుచ్చిన బాణము దైత్యవంశముం
బెనగొని చూడి, శేషిత
విభీషణమై రఘువీరుఁ జేరినన్
ఘనమగు శంకరావణుఁడు
క్రమ్మఱ వేచునటంచు దుందుభిన్
ఘనపథచారు లొత్తరు
ప్రకాశముగా నొలికింప రున్ననల్

చిత్రాంగదుఁడు- **(సచమత్కారముగ హేమాం
గదుని దిక్కు-మొగమై)** సఖుఁడ హేమాం
గద! ఈ దృగద్భుతరసైకభాజనుఁడు
పార్వతీపతి పరిచర్యా పారీణుఁడు నిజ
భుజాభార వినమిత సమస్తసుర రాక్ష
సుఁడు వీరవీరోత్తంసుఁడు గదా యీ
రాత్రిం చరచక్రవర్తి! ఈతఁడు మున్ను
పురారి పూజావ్యతికరమున
పూజాసాదితశీర్ష పంచకముతో
భూషించి పంచాననుం
బూజాప్తిన్ దశకంధరుండయిన యా
భూతేశుఁడే తానుగా
నోజందానె పురారిగాఁ దలఁచి
భక్త్యుద్రేకియై హస్తమున్
వేజేర్పన్ శివశీర్ష పంక్తి కెటులో
విడ్పించె నా గౌరియున్

దశగ్రీవుఁడు మాటలకొలఁది గాఁడు
(కర్మప్రాబల్యము నీక్షించి సఖేదముగ) సఖుఁడు
హేమాంగదుఁడ! చూడు చూడుము.
పుణ్యాపాపముల్ ప్రాక్తనములు శరీరి
కిందె యసదృశ ఫలముల నందఁజేయు
నే శిరమ్ములు శివశిరో భూషణములు
డొల్లు శివశివా గ్రద్దల కాళ్ళ నేఁడు

హేమాంగదుఁడు సఖుఁడ చిత్రాంగద! ఇది
యంత విచిత్రమేమియుఁగాదు. 'యతో
ధర్మ స్తతోజయ' యను నీ శాస్త్ర
ప్రవాదము సత్యము. కావున నీ యర్థ
మందు శరీరాదులతోఁ బుణ్యాపుణ్య

ములఁ జేయువారి యాయతి చూపఁబడి నది. ఇందు రావణుఁడే యుదాహరణ మగును. ఎట్లందువా.

సరివిని ధర్మవృత్తికయి
నంచి మొదలనువుం బొనర్చును
ర్వర బహుభోగ భాజనత
వర్తిలు నెవ్వఁడో వాఁడు నిక్కమీ
వెరవున రాక్షసాధిపుఁడు
వేల్చిబలిన్ స్వశిరస్సమాజముల్
సరసిజపాళికై పడయఁ జాలెఁ
త్రైలోకము నేలు సంపదన్.

(నేపథ్యమున)

బాణలాంఛిత కేతు యష్టిశిఖరమ్ము పటు మూర్ఛన నఁగి
వానినకుండ సారథియుగలయది బంతులు తీర్చి
పైన మూఁగెడు మాంసఖాది పక్షుల పాలకి యాశ
రీనాథుని కబంధముపడి నడుము విరిసి నట్టి రథము.
ఎపుడు నభ్యాస ఖేలనము మనసున నేర్ప ఱింపకయు
విపులకార్య ప్రపంచమ్ము చేతికి వీలు గావించు
నపగత శిక్షకము లయియును పరోషిత శ్వము ల్దురితగ
తపథమ్ములయి మందురాస్మరణ లంకఁ దారిచె రథము.

(మరల నేపథ్యమున)

ఎల్ల గీర్వాణ వధువులు నేఁగుఁడింక
నిజగృహానికి, వేల్పుమన్నిని పిఁట
మందువాలోని యాలాన మండపమునఁ
గట్టుమా ధోరణుఁడ సురగజము మరల
యామికులు నివర్తిల్లుఁ డాయమరు,లెల్ల
కల్పపాదపములు యథాక్రమము గాఁగ
నందనోద్యానమున బృందమొందుఁగాక
దశవదను శీర్షమెప్డు ప్రాగ్ద్వారమందుఁ
బడెనో యేవంవిధాలాప బాధముఖర
ముఖులు కింకరులెల్లచో ముసరి కొనిరి.

మఱియును

దేవతా కామినీ పరిదీయమాన
సాంద్రమందార దాముఁడువంది బృంద
శంసమాన మంగళుఁడు తీక్ష్ణకరకులుఁడు
లక్ష్మణ న్యస్తహస్తుఁడై రాముఁడదిగొ
స్యందనంబుండియవతార మొందుచుండె.

అంతఁ బుష్పకాధి రూఢుఁడై యయోధ్యకు, బోవుచున్న రాముఁడురణభూమిఁ జూపించుచు సీతతో.

పృథ్వీవృత్తము.

మృగాక్షీ! ఫణిపాశబంధమిట నిందునీ దేవరున్
బ్రగాఢముగశక్తిబొమ్మగలవైన ద్రోణా ద్రివా
యుగాదిలి సుతుండుతెచ్చె, గుహనోత్కు నిందింద్రజి
న్నిగిర్చెననుజుండు దైత్యుతల లెవ్వఁడో రాలిచెన్.
అనుచు నుత్పలకాంగుఁడు జనకజాప్రి
యంవదుఁడు తొంటిపైతృకమైన ధామ
నొందిమిమ్ములఁ బ్రజల నింపొందఁజేయు,
ప్రకటగుణభద్రుఁడగు రామభద్రవిభుఁడు
తన రచించిన యదియుఁ బ్రాక్తన కవీంద్ర
రచితమునుగుఁడ గద్యపద్యచితమౌచు
నలరు సుభటకృతమ్ము దూతాంగదమ్ము
నాట్యమిది రామశాస్త్రి యాంధ్రమున, జేసె.

శ్రీ భరతముని ప్రణీత
నాట్యశాస్త్రమ్

ఆంధ్ర భారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్., పి. హెచ్. డి.

చతుర్థోఽధ్యాయః—తాండవలక్షణమ్

46. వృశ్చికరేచితము

వృశ్చికం చరణం కృత్వా స్వస్తికౌచ కరా వుభౌ
రేచితౌ విప్రకీర్ణౌచ కరౌ వృశ్చికరేచితమ్ ౧౦౫

రెండు పతాకాహస్తముల మణికట్టులను జేర్చి పట్టినచో స్వస్తికహస్తమగును. ఈ స్వస్తికను వేరుచేసి హంసపక్ష హస్తములను వేగముతో కంపించునట్లు జేయుచు వృశ్చికపాదమును పట్టినచో వృశ్చికరేచితమను కరణము వచ్చును. దీనిని ఆకాశ గమనము నభినయించుటకు ప్రయోగింపవలెను.

47. వృశ్చికము

బాహు శీర్షాంచితౌ హస్తౌ పాదః పృష్ఠాంచితస్తథా
దూర సన్నత పృష్ఠంచ వృశ్చికం తత్ప్రకీర్తితమ్ ౧౦౬

భుజశిరస్సున కరిహస్తములను పట్టవలెను. సమున్నతములగు లతాహస్తములను ఒక ప్రక్కనుంచి మరొక ప్రక్కకు ఊపుచు, త్రిపతాకగా రెండవచేతిని చెవి వద్దనుంచిన కరిహస్తము రాగలదు.

కుడికాలిని వెనుకగా తలవద్దకు చాచిన వృశ్చికచరణము రాగలదు. వృశ్చిక చరణమును ప్రయోగించిన తర్వాత ఈ పాదమునకు దూరముగా నుండునట్లు పృష్ఠ భాగమును వంచగా వృశ్చికమను కరణము సిద్ధించగలదు. ఆకాశగమనమున, ఐరావణాది విషయమున దీనిని ప్రయోగించవలెను.

48. వ్యంసితము

ఆలీఢం స్థానకం యత్ర కరౌ వక్షసి రేచితౌ
ఊర్ధ్వాధో విప్రకీర్ణౌచ వ్యంసితం కరణంతు తత్ ౧౦౭

నిషణ్ణోరువృత్తో, త్ర్యశ్రముగా కాలినిడుంచి కుడిపాదమును పంచతలాంతరముగా ప్రసారించగా వచ్చునది ఆలీఢస్థానకము. వక్షమువద్దనున్న హంసపక్ష హస్తములను రేచితములుగా చేయవలెను. కుడిచేతి చూపుడువ్రేలితో ఉద్వేష్టిత కరణమున అధోముఖముగా విప్రకీర్ణము గావించవలెను. ఎడమచేతి చూపుడువ్రేలితో పరావర్తిత కరణము ఊర్ధ్వ గమనమును గావించవలెను. అప్పుడు ఉత్తాన హంసపక్షహస్తము ద్రుతభ్రమము కలదియై రేచితమగును. రెండవది అధోముఖ మగును.



46



47



48



49



50



51



52



53



54


55


56


57


58


59


60


61


62


63

ఆశ్చర్యముతో గూడిన పరిక్రమ విషయమున వ్యంసిత కరణమును చూప వలెను.

49. పార్శ్వ నికుట్టితము

హస్తౌతు స్వస్తికౌ పార్శ్వే తథా పాదో నికుట్టితః
యత్ర తత్కరణం జ్ఞేయం బుధైః పార్శ్వనికుట్టితమ్. ౧౦౮

రెండు పతాకహస్తముల మణికట్టులను జేర్చి ప్రక్క భాగమున నికుట్టితములుగా జేయవలెను. ఇట్లు జేయగా క్రమమున ఊర్ధ్వముఖత్వము, అధోముఖత్వము లభించ గలవు. అప్పుడు పాదము కూడ నికుట్టితము కావలెను. పార్శ్వమున నున్న హస్తనికుట్టిత యోగముచే ఈకరణము పార్శ్వనికుట్టిత మని పిలువబడుచున్నది. ప్రకాశన సంచరణాభ్యాస ప్రధానమైన వాక్యార్థము నభినయించు నపుడీ కరణమును ప్రయోగించవలెను

50. లలాటతిలకము

వృశ్చికం చరణం కృత్వా పాదస్యాంగుష్ఠకేనతు
లలాటే తిలకం కుర్యా ల్లలాటతిలకంతు తత్. ౧౦౯

వృశ్చిక కరణమున చెప్పబడిన వృశ్చికచరణమును చూపి, పాదముయొక్క బొటన వ్రేలితో లలాటమున తిలకమును బెట్టగా లలాటతిలక మను కరణము వచ్చును. కాని శిరస్సునకు వెనుకనుంచి వచ్చు కాలి బొటనవ్రేలితో తిలకధారణ చేయబడుట కష్టమనుటచే, ఆ పాదమును ఎడమ చేతితో పుచ్చుకొని, బొటనవ్రేలిని లలాటమునకు తాకునట్లు చేయవలెనని భావము. విద్యాధర గమనమును తెలుపునపుడిది ప్రయోగింప బడవలెను.

51. క్రాంతకము

పృష్ఠతః కుంచితం కృత్వా వ్యతిక్రాంతక్రమం తతః
ఆక్షిప్తౌచ కరౌ కార్యౌ క్రాంతకే కరణే ద్విజాః. ౧౧౦

కుంచితపాదమును పైకి ఎత్తి ముందుకు సాచి, మరల పైకి ఎత్తి భూమిపై వేయగా వచ్చు అతిక్రాంతాచారీవిధిని గావించి, క్రింద పడుపాదమును కుంచితముగా నుంచవలెను. ఈ కుంచిత పాదమును వెనుకగా తీసికొనివచ్చి క్రియాంతర పరిక్రమముతో సాచవలెను. హస్తములను చలింపజేయుచు వ్యావర్తిత కరణమున శరీరము నుంచి బయటకు వచ్చునట్లు చేయవలెను. అప్పుడు పరివర్తిత కరణముతో ఆక్షిప్తములుగా జేసి వక్షమువద్ద ఖటకాముఖములుగా నుంచవలెను. ఇట్లు అంగ పర్యాయ మొనర్చగా క్రాంతకమను కరణము రాగలదు. ఉద్ధతపరిక్రమమున దీనిని ప్రయోగించవలెను.

52. కుంచితము

ఆద్యః పాదో నతః కార్యః సవ్యహస్తశ్చ కుంచితః
ఉత్తానో వామపార్శ్వస్థ స్తత్కుంచిత ముదాహృతమ్. ౧౧౧

కుడిమోకాలిపై నిలచి, పాదమును అగ్రతల సంచరముగా చేయవలెను. కుంచింపబడిన కుడిచేతిని ఉత్తాన అలపల్లవరూపముగా ఎడమప్రక్క నుంచవలెను అప్పుడు కుంచితమను కరణము వచ్చును. అపరిమితము, అలౌకికము నగు ఆనందముతో నిండియున్న దేవత నభినయించుటలో నీ కరణమును ప్రయోగించవలెను,

53. చక్రమండలము

ప్రలంబితాభ్యాం బాహుభ్యాం యస్మాత్రేణానతేనచ
అభ్యంత రాపవిద్ధః స్యా త్త జ్ఞేయం చక్రమండలమ్. ౧౧౨

చక్రమండలకరణమున అడ్డితా అను చారీ ప్రయోగింపబడవలెను. సమముగానున్న ఒక పాదమునకు ముందు, వెనుక గూడ అగ్రతలసంచరపాదమును ఘట్టించుచు, శ్లిష్టముగా చేయుచు, అంగపర్యాయము గావింపగా అడ్డితాచారీ రాగలదు.

బాహువులు ప్రేలాడుచు శరీరముదగ్గరకు తీసికొనిరాబడి అభ్యంతరాపవిద్ధములైనచో చక్రమండల కరణము వచ్చును. ఉద్ధతపరిక్రమ పరిష్కరణాది విషయమున నీ కరణమును ప్రయోగించవలెను.

54. ఉరోమండలము

స్వస్తికాపసృతౌ పాదా వపవిద్ధక్రమౌ యదా
ఉరోమండలకౌ హస్తౌ వురోమండలికంతు తత్ ౧౧౩

అగ్రతలసంచరపాదముతో భూమిని ఘట్టించుచు, ఆ పాదమును రెండవకాలి జానువుతో స్వస్తికగా పట్టిన అభ్యంతరమండలము రాగలదు. ఇట్లు అంగపర్యాయము చేయగా వచ్చు స్థితావర్తా చారీని ప్రయోగించ వలెను. స్వస్తికలోనున్న పాదముల నీ చారీతో వేరుచేయవలెను. ఆపై బద్ధాచారీని ఆడవలెను. స్వస్తికాపసరణముతో పాదతలాగ్రములు మండలభ్రమణ పూర్వకముగా ఆయా ప్రక్కలకు రాగా ఊరు బంధనము కలిగి అపవిద్ధ మగును. అప్పుడు ఉరోమండలహస్తములను ప్రయోగింపగా ఉరోమండల కరణము వచ్చుచున్నది. ఉద్వేష్టితముగా కుడిచేయి, అపవేష్టితముగా ఎడమచేయి, వక్షమువద్ద భ్రమించగా వచ్చునవి ఉరోమండలహస్తములు.

55. ఆక్షిప్తము

ఆక్షిప్తం హస్త పాదంచ క్రియతే యత్ర వేగతః
ఆక్షిప్తం నామ కరణం విజ్ఞేయం త ద్ద్విజోత్తమాః ౧౧౪

కుంచితపాదమును ఎత్తి, ఆక్షిప్తముగా చేసి, అంచితముగా ముందుకు ఉంచవలెను. తర్వాత అర్ధమండలముగా ప్రక్కకు తీసికొనివచ్చి జంఘా స్వస్తికను పట్టి మడమను భూమిపై వేయగా వచ్చు ఆక్షిప్తాచారీతో, ప్రక్కకు వంగవలెను. అప్పుడు చతురముగాని ఖటకాముఖముగాని వేగముగా ఆక్షిప్తము చేయవలెను. ఇట్లు

చేయగా వచ్చునది ఆక్షిప్తకరణము. దీనిని విదూషకగతి విషయమున ప్రయోగించవలెను. కావున నీ కరణమును స్త్రీలు ప్రయోగింపరాదు.

56. తలవిలాసితము

ఊర్ధ్వాంగులితలః పాదః పార్శ్వే నోర్ధ్వం ప్రసారితః
ప్రకుర్యా దంచిత తలౌ హస్తౌ తలవిలాసితే. ౧౧౫

అరికాలు, వ్రేళ్ళు పైకి ఉన్న పాదమును ప్రక్కగా పైకి సాచవలెను. పాదమును పైకి సాచునప్పుడు అరచేతితో సంశ్లేష మొనర్పవలెను. పతాకహస్తములు పరస్పరము చక్కగా సంశ్లిష్టము లగుటచే పాదతలమునకు, హస్తతలమునకు దూరముగా సంశ్లేషణము జరుగవలెను. ఇట్లు అంగపర్యాయము చేయగా తలవిలాసితమను కరణము రాగలదు. నాట్యాచార్యు లీ కరణమును సూత్రధారాది విషయమున పాదోద్ధార మను పేరుతో ప్రయోగింతురు.

57. అర్గలము

పృష్ఠతః ప్రసృతః పాదో ద్వౌ తాలా వర్ధమేవచ
తస్యైవ చానుగో హస్తః పురగ స్త్వ ర్గలంతు తత్. ౧౧౬

రెండు జంఘలకు మధ్యదూరము రెండున్నరతాళము లుండునట్లుగా చేసి పాదమును వెనుకకు సాచవలెను. ఇదేసమయమున అలపల్లవమగు కుడిచేతిని ప్రక్కగా ఎడమవైపుకు చాచి, లోపల నున్న నీటిని క్రింద పోయునట్లుగా అధోముఖము చేయవలెను. అర్గలవలె దేహమును నియంత్రించుటచే నీ కరణమునకు అర్గలమను పేరు వచ్చినది. అంగదుడు మొదలగువారి గతిపరిక్రమమున దీనిని ప్రయోగించవలసియున్నది.

58. విక్షిప్తము

విక్షిప్తం హస్తపాదంచ పృష్ఠతః పార్శ్వతోఽపివా
ఏకమార్గగతం యత్ర తద్విక్షిప్త ముదాహృతమ్. ౧౧౭

హస్తపాదములను వెనుకకు ప్రక్కకు గూడ విక్షేపము చేయవలెను. విద్యుద్భ్రాంతా, దండపాదా అను చారీలను ప్రయోగించవలెనని భావము. ప్రక్కనుండి వెనుకకు పాదమును త్రిప్పి శిరఃసంశ్లేషముద్వారా అన్నివైపుల మండలమువలె తిరిగి ప్రసారించగా విద్యుద్భ్రాంతా యను చారీ వచ్చును.

నూపురపాదికలోని కుంచితపాదమును రెండవకాలి మడమవెనుక నుంచి ముందుకు చాచి దేహక్షేత్రమునకు అభిముఖముగా నుండునట్లు జాన్వగ్రము నుండి త్వరగా చాచగా, ఊరు జాను జంఘలు స్తబ్ధములై దండాకారమున నుండగలవు. అప్పుడది దండపాదాచారి యగును. ఉద్ధతగతిపరిక్రమ సూచనాదివిషయమున నీ కరణమును ప్రయోగించవలెను.

59. ఆవర్తము

ప్రసార్య కుంచితం పాదం పున రావర్తయే ద్ద్రుతమ్
ప్రయోగవశగౌ హస్తౌ తదావర్త ముదాహృతమ్. ౧౧౮

కుడిపాదమును ముందుకు ఒక అడుగు ప్రసారించి, వెనుకకు తీసికొనిపోయి ఎడమపాదముతో గంతువేసి అపసర్పణము చూపవలెను. ఇట్లు భయమును తెల్పు అపసర్పణక్రియ గల చాషగతి యను చారీని ప్రయోగించవలెను. కుంచితపాదమును ప్రసారించి, వేగముతో వెనుకకు తీసికొని రావలెను. ఉద్వేష్టితాపవేష్టిత రూపము లగు దోలాహస్తములను ఈ ఆవర్తకరణమున చూపవలెను. నాయకోపసర్పణమున, పాశబంధాద్యవసరమున. ఈకరణమును ప్రయోగింపవలెను.

60. దోలాపాదము

కుంచితం పాదముత్క్షిప్య పార్శ్వాత్ పార్శ్వంతు దోలయేత్
ప్రయోగవశగౌ హస్తౌ దోలాపాదం తదుచ్యతే. ౧౧౯

మొదట ఊర్ధ్వజాను చారీని, తర్వాత దోలాపాదా చారీని అభినయించవలెను. కుంచితమగు కుడిపాదమును పైకి ఎత్తి మోకాలు స్తనములతోను, పాదము జానువుతోను సమముగా నుండునట్లుంచి, రెండవపాదమును స్తబ్ధముగా నుంచి, అంగపర్యాయము చేయగా ఊర్ధ్వజాను చారీ రాగలదు. కుంచిత పాదమును ఎత్తి ఒకప్రక్క నుంచి మరొక ప్రక్కకు ఊగునట్లు చేసి, అంచితముగా క్రిందకు వేసిన దోలాపాదా చారీ వచ్చును. ఈ చారీలతో దోలాహస్తములను పట్టినచో దోలాపాదమను కరణము సిద్ధమగును.

61. నివృత్తము

ఆక్షిప్తం హస్త పాదంచ త్రికంచైవ వివర్తయేత్
రేచితౌచ తథా హస్తౌ నివృత్తే కరణే ద్విజాః. ౧౨౦

దేహము నుండి ఎడమపాదమును దూరముచేసి మరల దగ్గరకు తేవలెను. ఇట్లే చేతిని కూడ వ్యావర్తిత పరివర్తముగా చేయవలెను. ఎడమచేతిని, ఎడమకాలిని ఆక్షిప్తములుగా చేసి భ్రమరికాచారీతో కాలిని త్రిప్పవలెను. అప్పుడు హంసపక్షములు రేచితము లగును. ఈ విధముగా త్రికనివర్తన యోగ ముండుటచే నీ కరణము నివృత్త మగుచున్నది. ఉద్ధతగతి పరిక్రమమున దీనిని ప్రయోగింతురు.

62. వినివృత్తము

సూచీవిద్ధం విధాయాథ త్రికంతు వినివర్తయేత్
కరౌచ రేచితౌ కార్యౌ వినివృత్తే ద్విజోత్తమాః. ౧౨౧

కుంచితపాదమును ఎత్తి జానుపర్యంతము జంఘా భాగమును ప్రసారించి, పాదముయొక్క ముందుభాగము మొదట క్రింద పడునట్లుగా నుంచిన సూచీయను చారీ రాగలదు. ఈ చారీ విధానముతో మడమ వద్ద స్వస్తికను పట్టి రెండవపాదము నుంచవలెను. అప్పుడు త్రికోణాకారముగా కుడిపాదమును పట్టి ఒకే ఒక ప్రక్క వివ

ర్తింపజేసి, ప్రత్యావర్తన క్రమముతో నివృత్తిని చూపవలెను. అన్యోన్య జంఘాసంవేధముతో స్వస్తికనుపట్టి ఊరువలనము చేయగా వచ్చు బద్ధాచారీ నైనను ప్రయోగించవచ్చును. ఈ కరణ ప్రయోగావసరమున హంసపక్ష హస్తములను ద్రుతభ్రమము కలవిగా చేయవలెను. ఈ కరణమును గూడ ఉద్ధతగతి పరిక్రమముననే ప్రయోగింపవలెను

63. పార్శ్వాక్రాంతము.

పార్శ్వక్రాంత క్రమం కృత్వా పురస్తా దథ పాతయేత్
ప్రయోగవశగౌ హస్తౌ పార్శ్వాక్రాంతం తదుచ్యతే. ౧౨౨

పార్శ్వాక్రాంతాచారితో పాదమును ముందుకు వేయవలెను. చేతులనుకూడ పాదముతోబాటు ముందుకు ప్రసారించవలెను. రౌద్రప్రధానమైన పరిక్రమమున నీ కరణమును ప్రయోగించవలెను.

విజ్ఞప్తి

నవభారతి 1958 జూన్‌నెలలో ప్రారంభించబడింది. 1959 మే నెలతో ఒక సంవత్సరం పూర్తిఅవుతున్నది. ఈ పన్నెండు మాసాలలో ముద్రణాలయం ప్రారంభించడంవల్ల ఏర్పడిన ఇబ్బందిమూలాన రెండు సంచికలుతప్ప తక్కిన పది సంచికలు సకాలంలో వెలువరించ గలిగాం ఇందులకు మాకు అన్నివిధాల సహకరించిన రచయితలకు, చిత్రకారులకు, తెలుగు పాఠకులకు కృతజ్ఞత తెల్పుకుంటున్నాం.

1959 జూన్ మొదలు నవభారతి, రెండవ సంవత్సరం ప్రారంభిస్తుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రచయితలు, చిత్రకారులు తమతమ అమూల్య రచనలను, చిత్రములను మేనెల 20 వ తేదీలోగానే పంపి, మాకు తోడ్పడగలరని ఆశిస్తున్నాము.

—సంపాదకులు.

శ్రీమద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి

సీతాకల్యాణము - శివధనుర్భంగము

3

రామచంద్రుని చేతిలో శివధనుస్సు విరిగెను దానినుండి యొక మహాధ్వని యుద్భవిల్లెను. ఆ ధ్వనియొక్క పరిణామమును పురస్కరించుకొని శ్రీమద్రామాయణ కల్పవృక్షములో నైదు శార్దూల వృత్తములతో నా ధ్వని వర్ణింపబడినది. ఈ అయిదు శార్దూలములు దీర్ఘసమాస భూయిష్ఠములు. ఆ ధ్వనికి వ్యంజకములు. ఇది రచనా శిల్పములోని భాగము. ఈ పద్యములు దీర్ఘసమాస భూయిష్ఠములుగా నెందుకుండవలయును? తేలికమాటలతో నేల వ్రాయరాదు? అందర కర్థము కావలయునుగదా! అని యొక విమర్శ గలదు. మరియొక విమర్శ యేమనగా అయిదు పద్యములు యెందుకు? ఒక పద్యము చాలదా? అని. యీ రెండవ విమర్శలో కొన్ని కొసరు మాటలుగూడ కలవు. కవికి నిగ్రహము వలయును అని. ఇది ఆధునికులైన కొందరు విమర్శకులు పెట్టిన కొత్తసూత్రము. పూర్వలక్షణ గ్రంధములందు కవికి నిగ్రహము వలయునని చెప్పినట్లెచ్చటను లేదు. అధికముగా చెప్పినచో ననౌచిత్యమగును. అప్రస్తుతమైనది యనౌచిత్యము. ప్రస్తుతమైనచో నౌచిత్యమే. నిగ్రహమన్నమాటలో ననౌచిత్యమన్న యర్థములేదు. కొంచెము చెప్పినచో చాలును. ఎక్కువగా చెప్పుట యనవసరము అని వారి తాత్పర్యమైనచో, అనవసరమైనచో ననౌచిత్యమే. వారి నిగ్రహమన్న మాటకర్థములేదు. అది అనౌచిత్యముకాదు. ఎక్కువగా చెప్పినాడు అన్నమాట కర్థములేదు. అనగా ఆవిమర్శకునికి యిష్టములేదని కావచ్చును. కవి పాఠకుల నిష్టానిష్టముల విచారించి వ్రాయడు. తానప్పుడు పొందిన తత్కథాంశగతమైన యావేశమును తదుచితమైన తన వాఙ్మయమునుండి యేరిన శబ్ద సముదాయములో నతడు తన భావమున కావిష్కారము గావించును.ఆకవియొక్క ఆవేశము పరిపుష్టమైనదైనచో,అతని వాగ్జాలము సమృద్ధమైనచో, అతని వ్యక్తీకరణశక్తి విస్తారమైనదైనచో, నతని యాత్మ దానికి తగిన యౌచిత్యముయొక్క ప్రమాణమును నిశ్చయించుకొని తదనుకూలముగ వాగావిర్భావము కలుగును. ఒక విషయము అయిదంశములను పురస్కరించుకొని కవి చెప్పినచో, నదినిగ్రహము లేకపోవుట యెట్లగును? అయిదు భిన్నాంశములు గలవు. ఆ యంశములు సముచితములు కానిచో ననౌచిత్యము ప్రాపించును. సముచితములైనచో నిగ్రహము లేవనుట, లేదనినవాని విమర్శ పద్ధతికి నిగ్రహము లేకపోవుట యగును. అయిదంశము లొక్కదానిని గురించి యేకదా చెప్పినది? ఒక్క యంశము చెప్పి పూర్తి చేయరాదా యన్నచో, కవిత్వముయొక్క పరమార్థమే తెలియక పోవుట. "కవయతీతికవిః" 'కవయతి' యనగా వర్ణయతి. వర్ణించుట యనగా తత్సంబంధములైన పలు విషయములను పరామర్శించి చూపించుట. దీనివలన వచ్చెడి ఫలితమేమనగా, వర్ణితమైన వస్తువుయొక్క సంపూర్ణమైన స్థితియును,స్వభావమును పాఠకుని బుద్ధికి గోచరింపజేయుట. ఒక వస్తువును స్థూలముగా దర్శింతుము. దానిగురించి మనకు తెలిసినట్లు కానేకాదు. సూక్ష్మపరిశీలనచేతగాని తత్స్వభావావగతి గల్గదు. దానిపేరే వర్ణన. అది చేసినవాడే కవి. ఒకానొక వస్తువునకు బహుముఖము లుండును. బహుముఖ పరామర్శచేత దాని సంపూర్ణత్వము గోచరించును.

శ్రీరామచంద్రుడు శివధనుర్భంగము చేసెను. ఆ శివధనుస్సును పూర్వ మెన్నేండ్లనుండి యో వంచినవాడు లేడు. ఎక్కుపెట్టినవాడునులేడు. ఆనాడు లోకములో నా శివధనుస్సును మరెవ్వడునువంచలేడు అన్న విశ్వాసమే ప్రబలియుండెను. దానినొకనాడు శ్రీరామచంద్రుడు వంచెను. వంచుటయేకాదు. దానిని వంచబోగా నది విరిగిపోయెను ఇది యెంత పెద్దవార్త! ఏపనిని లోకమునందెవ్వడు చేయలేదని చెప్పుకొనుచుందురో, ఆపని నొకనాడొకడు చేసెను.

లోకమునందు దానిని గూర్చి విడ్డూరముగా చెప్పి కొందురు. ఎక్కువగా చెప్పికొందురు. ఆచెప్పి కొనుటలోని యాధిక్యమును నిరూపించుటకే నిచట అయిదు పద్యములు వ్రాయబడినవి.

మరియు నొకకార్యము జరిగినదనగా దాని ఫలితములు పదిచోట్ల పదివిధములుగా నుండును. ఒక్కొక్కచోట నొక్కొక్క రీతిగా ఫలించును. దానిని గూర్చిన భావములు పలు మందికి పలువిధములుగా తోచును.

శివధనుర్భంగము జరిగినది. మిథిలాపట్టణమందే శివధనుస్సు విరిగినదన్న వార్త విలక్షణముగానుండును. అమ్మయ్య! ఇన్నాళ్ళటికి మా సీతాదేవికి పెండ్లి కాబోవుచున్నది. ఆ రామచంద్రుడు వచ్చి శివధనుస్సును విరిచినాడట అన్న తృప్తి మైథిలేయులకు గల్గును. అందులో నా ధనుస్సు పెద్దగా మ్రోగినమ్రోత వారు విని, అబ్బో, ఆ పెండ్లికొడుకెంతటి మహా వీరుడు, సీత ఎంత అదృష్టవంతురాలు అనుకొందురు. మొదటి పద్యము ధనుస్సు విరిగినదన్న యర్థమునే చెప్పును. ఆ విరిగినప్పటి ధ్వనిని చెప్పుచున్నది. ఆ పద్యమునందు నాధ్వని వర్ణితమగుటచేత మిథిలాజనుల యూహలు చెలరేగుటకు కావలసిన సామగ్రి సంపాదనము జరిగినదన్నమాట. వారి యూహలన్నియు నా పద్యములోని ధ్వనులు. ఆ సమాసమంతయు ఆ వ్యంగ్యమునకు వ్యంజకము. వ్యంజకలక్షణము తెలియనివారు పలువిధములైన విమర్శనలు చేయుదురు. ఆ విమర్శనము పూర్వము చెప్పినట్లుండును.

మరికొందరు శబ్దవిరోధులు. వారికి సమాసము పనికిరాదు. నిష్ఠాదిశబ్దములు పనికిరావు. షకారముక్రింది ఠకారము నుచ్చరింపలేరు. ఆ యలసులకు నది కష్టమైన వాగ్వ్యాపారము.

శా॥ నిష్ఠావర్ష దుదార మేఘ పటలీ
నిర్గచ్ఛ దుద్యోదిత
స్ఫేష్ఠే రమ్మదమాలికా యుగపదు
జ్జృంభన్మహా ఘోరబం
హిష్ఠస్ఫూర్జథుషండ ఘుర్ఘుర రవా
హీన క్రియాప్రౌఢి ద్రా
ఘిష్ఠంబై యొకరావమంతట నెసం
గెన్ ఛిన్నచాపంబునన్.

నిష్ఠచేత వర్షించుచున్న అమోఘములైన మేఘముల సమూహములనుండి వెలువడుచున్న ప్రకాశించుచున్న స్ఫేష్ఠములైన ఇరమ్మదములనగా మెఱపుతీగలు. వాని వరుసలతో యుగపత్ సమానముగా విజృంభించుచున్న మహా ఘోరములైన, బంహిష్ఠములైన అనగా మిక్కిలి పెద్దవైన స్ఫూర్జథువులు అనగా పిడుగులు. వానియొక్క షండములయొక్క (సమూహముల యొక్క) ఘుర్ఘురమను ధ్వనియొక్క తక్కువకాని వ్యాపారప్రౌఢిచేత ద్రాఘిష్ఠంబై అనగా మిక్కిలి దీర్ఘమైనదై యొక రావము విరిగిన ధనుస్సునుండి పుట్టినది. ఆ ధ్వని యంత భయంకరముగా నున్నది. ఎంత భయంకరముగా నున్నను, మైథిలేయులకు శ్రీరామచంద్రుని బలపరాక్రమాదులకు వ్యంజకమగుటయే పరమార్థము. ఈ పద్యమునందలి సమాసదైర్ఘ్యము శ్రీరామచంద్రుని బాహుబలమునకు వ్యంజకము. ఆ పద్యము చదువుచుండగనే శివధనుస్సు విరిగిన మ్రోత వినిపించినట్లుండును. ఇట్లు వ్రాయుట యథార్థమైన కవిత్వము. కవిత్వము సాధించెడి ప్రయోజనములలో నిదియొకటి. వట్టియొకటికాదు. అధికమైన శిల్పములలో నొకటి.

తక్కిన నాల్గు పద్యములు నిట్లేకలవు. ఒకపద్యము శైవలోకములందా మ్రోత మ్రోగినది అన్న యర్థమును చెప్పును. ఇంకొకటి స్వర్గలోకమునందలి మ్రోతచెప్పును. నాల్గవ పద్యము రాక్షసలోకమునందలి మ్రోతచెప్పును. అయిదవ పద్యము రాజలోకమ్మునందలి మ్రోతచెప్పును. ఇట్లయిదు పద్యములు వ్రాయబడినవి. ఈనాల్గు పద్యములు తత్తల్లోకములయందు శివధనుర్భంగ వార్తా శ్రవణజనిత భావపరంపరా లక్షణద్యోతకములై యున్నవి. సమాసములు తద్భావవ్యంజకములు. తద్గతభావములు, తత్తల్లోక గతజనుల మనోభావ వ్యక్తీకరణములు.

శైవలోకములందీ వార్త వెలసినది. హేరంబుడు చెవులు విచ్చుకొని విన్నాడు. హేరంబోన్నత శూర్పకర్ణ వివరశ్రీ కారిగానున్నదీధ్వని. కుమారస్వామి తన పన్నెండుకన్నులు విప్పి చూచినాడు. అంతకంటె కన్నులు విప్పుటకు వీలులేనంతగా విప్పినాడు. నేత్రగోళ వివృతి ప్రాకారమైనదట యీ ధ్వని. పార్వతీదేవి కనుబొమలు ముడిచినది. ప్రమథులు ఆశ్చలద్గీరుగ్రులైనారు. ఆః ఇదిధిక్ అన్నటువంటి శబ్దము. కోపము వచ్చినపుడనెడిమాట. దీనిచేత చలత్ - కదలుచున్న, గీః - వాక్కుచేత, ఉగ్రులు - భయంకరులు. ఇది శైవలోకములలోని వార్త. శివధనుస్సు విరిగినదనగా, శైవలోకములందు నెవరు హర్షింతురు? తరువాత పరశురాముడు పరమమాహేశ్వరుడు కోపించి రాముని దండించుటకు వచ్చెనుగదా. ఆకథ దీనియందు సూచితమగుచున్నది.

తరువాత స్వర్గలోకములయందు నీధనువు మ్రోగినదన్న యర్థముచెప్పెడి పద్యము. ఆ పద్యములో దేవతాస్త్రీలు నృత్యము చేయుట, వారి భరతశాస్త్ర పాండిత్యము, వారి కంధరా భేదములు, వారి యూకేకరాదులయొక్క సౌందర్యము మొదలైన వానిని చెప్పునర్థముతో నిండియున్న పద్యము. శ్రీరామచంద్రుడు రావణసంహారము చేయుట కవతరించిన మహావిష్ణువు. ఇది దేవతలకు తెలియును. శివధనుస్సు విరిచినతోడనే శ్రీరాముడు విష్ణ్వతారమన్న తొలిసాక్ష్యమువచ్చినది. అందుచేత స్వర్గలోకములయం దుత్సవములు చేసికొన్నారు. ఆ యుత్సవమెంత మనోహారిగా నున్నదో శ్రీరామచంద్రుని ధనూరావమంత మనోహరముగా నున్నది.

ఈధనుస్సు మ్రోత దైతేయలోకములయందుగూడ వినిపించినది.అనగా వార్త వినిపించినదని యర్థము. పూర్వము రావణుడు మిథిలాసభలో శివధనుస్సు వంచుటకు వెళ్ళినాడు. అతనికా ధనుస్సు వంగలేదు. ఇప్పుడు రాముడు విరచెను. కనుక ఆరామునిముందీ రావణుడు పనికిరాడు. ఆరాముని చూచినచో నీరావణున కీర్ష్య గలుగును. అది విరోధమునకు హేతువు. ఆ విరోధము ప్రబలినచో రావణుడేమగును ? రాక్షసు లేమగుదురు ? ఈ యూహలన్నియు వారికి వచ్చును. వచ్చెను. వచ్చినప్పుడేమైనది? కొందరు రాక్షసవీరులు పొగరుబోతు తనముతో నవ్వుచు పొగరుబోతుమాటలు మాటాడుచునున్నారు. వారి నవ్వాగిపోయినది. వారికాలు జారిపోయినది. కొందరు రాక్షసస్త్రీలు గర్భవతులున్నారు. వాండ్లపయ్యెదలు జారిపోయినవి. వారి రైకలు జారిపోయినవి. వారికి భయము వేసినది. ఇట్లే శ్రీరామచంద్రుడు ధనుస్సు విరిచినాడన్నవార్త విశాలానగరాది రాజలోకములయందు వందిమాగధస్తోత్రాదులచేత సముత్సాహము దీపించినది.

ఇది శివధనుర్భంగ జనితరావ కథాగత సూక్ష్మార్థవివరణము.

కుసుమవసంతము

శ్రీ జూలూరి హనుమంతరావు

తెలియని పూలబాసలకుఁ దీరులు రీతులవేమొ కాని మం
జులమగు నిస్వనమ్ము దెఱచున్ హృదయమ్ముల సన్నసన్నవీ
చుల నొయనొయ్యనం గదలు సొంపుల వంపుల రేకుఁగన్ను గ్ర
జిలుఁగుల పూవులీ తెలుఁగుసీమల నింపె వసంతమాధురుల్.

కులికిన వేపపూల కనుగొల్కుల నిండిన క్రొత్తజిల్గు వె
ల్గులు నిఱుపేద గుండియలలో నమృతమ్మొలకించు రీతిఁ బ్రో
గులు కడుఁగోమలమ్ములన కొమ్మల జిగ్గులు మించుతేనె జా
లులునయి జారుచున్నవి తెలుంగు చెఱంగుల చెంగలించుచున్.

ఈ వాసంత మధూదయమ్మునఁ గళాహేలల్ ప్రసారించి నె
త్తావుల్ జిమ్ము ప్రసూనహాసముల నిద్రాజాగృతిం బొంది యే
వో వల్లించు గతించిపోయిన మనుష్యోత్సాహచారిత్రముల్
స్వావిర్భూత మనోజ్ఞ చంద్రికలు దేలందెల్గు మాగాణులన్.

తెలుఁగుపెడందలో బరువుదీరిన చిక్కని పూలబాట సొం
పులు సమకూరిచెన్ బ్రకృతి మోహనమూర్తి వసంతకాంతుఁడు
జ్జ్వల నవవత్సరోచిత వసంత దిశాంత నితాంతమంజులో
చ్ఛలిత పికీపికస్వరిత సర్వసుమంగళ వాక్స్రవంతితోన్.

ఒక్కొక తేకులో మలచియున్నవి నవ్యపురాచరిత్రముల్
లెక్కకుమీఱి యాంధ్రనగరీ జనతా చరితామితప్రభల్
దిక్కుల రాగరంజనలు దీర్పఁగ నీ నవచైత్రపుష్పముల్
ఱెక్కలువిప్పి జిమ్మియలరించు లిఖించి ప్రభాతరేఖలన్.

శైశిరపత్రభంగతరుజన్మలు దుఃఖవిలీన చిత్తముల్
శైశవవాసనాకలిత జర్జరదేహసుషుప్త భావనల్
పేశలచారుయౌవనప్రవృత్తులు బుల్కలఁదేర పుష్పితా
కాశము సాంద్రమౌచు నవకమ్ముల జార్చు మధుప్రవాహముల్.

రాధామాధవమై మిళిందయువకప్రాచుర్యసంగీతికా
వీధీమంజులమై సమీరలహరీవిద్యోతలీలాస్ఫుర
ద్గాథామోహనమై త్రిలోకసుకళాకళ్యాణవర్ణావళీ
మాధుర్యా నవమైనదీకుసుమకమ్రత్వమ్ము చైత్రమ్ములో.

చిగురుచిగురునఁ జిఱుపూలు చిట్టిపూల
మోములందునఁ దెలియన్ని ముద్దుబాస
లందునను వెల్గు వెన్నెల లలరుదేనె
లన్నిటిని దాచికొన్నదీ యాంధ్రసీమ.

వ్యాప్తిసాధక సిద్ధాంతము

బెర్ట్రండ్ రసెల్

అనువాదం : జి. ఎస్. ఎన్.

౬

ఇంతవరకు చర్చించినదానినిబట్టి చూచినచో ఇంద్రియార్థములను మించి ప్రపంచ మున్నదా యను ప్రశ్నకు సమాధానము లభించదు. అద్యయనమునకు తోడిపడినదానిని పూర్వ మనుభవించినదానిని బట్టి గాక, నేడు మనకు ప్రత్యక్షముగ కనబడుచున్నదానిని బట్టి మాత్రమే ఇట్టి విషయములు నిర్ణయింపవలసియున్నవి...

ఇంచుమించుగా వెనుకటి చర్చలన్నింటి లోను, వస్తువుల యస్తిత్వమునకు సంబంధించిన జ్ఞానమునకు సాధనభూతములగు నాధారములను విశదీకరించు ప్రయత్నమున మనము నిమగ్నులమై యున్నాము. తమతోడి పరిచయము కలిమిచే స్వీయమగు నస్తిత్వము జ్ఞాతము లౌటకు వీలుగల వస్తువు లేవేవి ప్రపంచమున గలవు ? ఇంతవరకును మనకు లభించిన యాధారములను బట్టి రెండు విషయములు మనకవగతమైనవి అందొకటి మన యింద్రియార్థముల విషయమై మనకు గల్గిన యనుభవము. మనను గూర్చి మనకు గల్గిన యనుభవము రెండవది. వీని యునికి విషయమై మనకు సంశయమేమియును లేదు. స్మృతిసిద్ధములగు గతకాలపు టింద్రియార్థములుగూడ పూర్వమున్నట్లు విదితములగుచున్నవి. ఈ జ్ఞానమే మన విజ్ఞానభవనమునకు తగిన యాధారములను సమకూర్చును.

ఈ యాధారములనుబట్టి యనుమాన ప్రమాణముద్వారా కొన్ని విషయములను తేల్చుకొనగల్గినచో అనగా ద్రవ్యము, ఇతర వ్యక్తులు,మన వైయక్తికమగు జ్ఞాపకశక్తి పొడసూపకమున్న గతకాలము, భవిష్యత్కాలము మొదలగు వాని యునికినిగూర్చి మనము తెలిసికొనగల్గినచో, అట్టి యనుమితి సిద్ధములగు విషయముల నిగమనమునకు సాధనభూతములగు కొన్ని సామాన్య సిద్ధాంతముల నెఱుంగవలయును ఎ అను ఒక తెగకు చెందినవస్తువు ఉన్నది అనగనే, బి అను మరియొక తెగకు జెందిన మరి యొకవస్తువు తత్పూర్వమునగాని,తదనంతరమునగాని,తత్కాలమునగాని ఉండి యుండవలెనను విషయము మనకు జ్ఞాతము కావలయును ఈ విషయము మన కవగత మగుటకు వీలుతేనిచో. మన వ్యక్తిగతానుభవ పరిధిని మించి, మన విజ్ఞానము విస్తరించి యుండెడిదిగాదు. మన మిదిపూర్వమే గమనించినట్లీ పరిధి మిపులపరిమితమైనది. కాని ఈ పరిధి విస్తరించుటకు వీలున్నదా, ఉన్నచో నది యెట్లు సాధ్యపడునన్న సమస్యనే ప్రస్తుతము మనము పర్యాలోచింపవలసి యున్నది.

వాస్తవమునకు, మన కెవ్వరికిని సంశయము గల్గుటకుగూడ వీలులేని విషయము నొకదానిని ఉదాహరణముగ దీసికొందము. రేపు సూర్యుం డుదయించునను విషయమై మన కెవ్వరికిని సంశయమే గలుగదు ఎందుచేత? ఈనమ్మకము పూర్వము గల్గిన యనుభవసాంతత్యమును బట్టి యవిచారితముగ నేర్పడినదేనా ? లేక దానిని సమర్థించుట కుపపత్తి యేదైనగలదా ? ఇట్టి నమ్మకము సహేతుకమగునా కాదాయను విషయమై తేల్చి చెప్పుట కనువగు ప్రమాణము నొకదానినారయుట యంత సులభముగాదు. కాని సూర్యుండు రేపుదయించునను విశ్వాసమును, మన వ్యాపారములకు నాశ్రయభూతములగు తదితర విశ్వాసములను సమర్థించుటకు ఏమూలభూతములగు విశ్వాసము లవసరమో కొంతవఱకు నిర్ణయింపవచ్చును.

సూర్యుండు రేపుదయించునని మనము విశ్వసించుటకు గల కారణమేమని యెవ్వరైన అడిగినచో, రోజును అట్లు జరుగుచున్నది గనుక యను సమాధానము చెప్పుదుము. వెనుక సూర్యు డుదయించుట యనునది అనుశృతముగా వచ్చుచున్నది గనుక ముమ్ముందుగూడ నది యట్లె జరుగునను విశ్వాసము మనలో దృఢపడినది. సూర్యుండు పూర్వమువలెనే ముమ్ముందుగూడ నవిచ్ఛిన్నముగా నుదయించునని యెట్లు చెప్పగలవని యెవ్వరైన సవాలు చేసినచో, మనకిక గతిసూత్రములే గతి. భూమి యనునది స్వచ్ఛందముగా నవ్యాహతముగా పరిభ్రమించు గోళము. వెలుపలనుండి దాని పరిభ్రమణమును నిరోధించు గోళమేమైన ఉండిననేమోగాని సామాన్యముగా నట్టివాని పరిభ్రమణమునకు విచ్ఛేదమనునది యుండదు. నేటి రేపటులలో దాని పరిభ్రమణమును నిరోధించు గోళమేమియు నుండదు. అసలట్టి గోళముండదను విషయమై నమ్మకమేమని శంకించుటకు గూడ వీలుగలదు, కాని యిదియంత ముఖ్యమైన సందేహముగాదు, గతిసూత్రములు రేపటివరకు నమలులో నుండునను విషయమై నమ్మకమేమనునది చాల ముఖ్యమైన శంక ఈశంకయే బయలుదేరినచో

సూర్యోదయమును గూర్చి సంశయము బయలు దేరినప్పుడెట్టి పరిస్థితిలో నుంటిమో, నట్టి పరిస్థితిలో యున్నట్లు మనకు తెలియును.

గతిసూత్రములు అమలులో నుండునని విశ్వసించుటకు గల యేకైకకారణము - అవి గత కాలమున గూడ నమలులో నుండుటయే. గత కాలమునుగూర్చిన మన జ్ఞానము అట్లు నిర్ణయ మొనరించుటకు తగిన యాధారములను గల్పించును. సూర్యోదయము విషయమై మనకు సమకూరిన నిదర్శనముల కన్న గతిసూత్రముల విషయమై మనకు సమకూరిన నిదర్శనములు తక్కువగా నున్నవి.ఏలన సూర్యోదయమును నది గతిసూత్రము లన్వయించుట కనువగు నొక ప్రత్యేకోదాహరణము.తదితరములగు నట్టి ప్రత్యేకోదాహరణములు పరశ్శతములుగాగలవు.కాని అసలు సమస్య ఇది. గత కాలమున నొక సిద్ధాంత మనేక సందర్భములలో నన్వయించినంత మాత్రమున ముందుగూడ నట్లే యన్వయించుననుటకు హేతువేమి? ఈ విషయమై మనకుతగిన హేతువులభింపనిచో, సూర్యుడు రేపుదయించునని యనుకొనుటకుగాని; మనము తినబోవు ఆహారము విషయము కాదని భావించుటకుగాని లేక మన దైనిక జీవితములను నియమించు ప్రతీక్షలలో దేనికిని, ఉపపత్తియుండదు. అట్టి ప్రతీక్షలన్నియును సంభవములనియే గ్రహింపవలయును కావున నవి సార్థకమై తీరవలెననుటకు గాదు మన ముపపత్తి నరయవలసినది, మరి యవి సార్థకమగుటకు సంభవము మాత్రమే అను నభిప్రాయమును సమర్థించుట కనువగు నుపపత్తిని మాత్రమే యరయవలయును.

ప్రస్తుతము మనమొక విషయమును ప్రధానముగా వివేచనము చేయవలసి యున్నది. లేనిచో మనము పెనుతికమకలోబడిపోదుము. పూర్వము రెండు సంఘటనలు ఒక పద్ధతిలో, ఒక ప్రత్యేక క్రమములో జరుగుటగాని లేక రెండు ఒక దానితో కలసియుండుటగాని పునః పునః సంభవించుట, అట్టి సంఘటనల పూర్వాపరక్రమము గాని, అట్టివాని సహభావము ముందుగూడ ప్రవర్తిల్లునని భావించుటకు తగిన యుపపత్తిని సమకూర్చుచున్నది.

ఒక విధమైన రంగుగల యాహారపదార్థము నకు సామాన్యముగా నొక విధమైన రుచియుండును. కాని యట్టి పదార్థమువలన దానికి విభిన్నమైన రుచి యను భూతమైనచో మన ప్రతీక్షలకు తీవ్రమైన యఘాతము గల్గును. మనము చూచెడి వస్తువులు, వానిని ముట్టుకొనినచో నిట్లుండునని భావించుటకు వీలైన కొన్ని స్పష్టమైన యనుభములతో గూడుకొని యుండును. దయ్యముల వలన కలుగు ప్రధాన భయములలో నొకటి - వానివలన మనకు స్పర్శానుభవము గల్గకపోవుట మొట్టమొదటసారిగా చదువురానివారు విదేశములకేగునపుడు తమభాష వారికర్థము కాకపోవుటచే వారికి కల్గు నాశ్చర్యమట్టిదే.

ఇట్టి సాహచర్యము కేవలము మనుష్యులకే నియతముకాలేదు. జంతువులలో నది చాల బలీయముగా నున్నది. ఒకానొక రోడ్డువెంట పోవుటకలవాటుబడిన గుఱ్ఱము నింకొక వైపునకు త్రిప్పినచో ఎల్లప్పు డెదురు తిరుగును. తమకు సామాన్యముగా మేతవేయు మనుష్యుని జూచునపుడు తమకు మేతవేయుటకే యాతడు వచ్చుచున్నాడని పెంపుడు జంతువులు భావించును. ఏకరూపతకు సంబంధించిన యట్టి యపరిణతములగు నూహలన్నియు తప్పుద్రోవనబడు నవకాశముగలవి. ప్రతి దినము కోడిపిల్లకు మేతవేసిన వ్యక్తియే - ప్రకృతిలోని యేకరూపత విషయమై ఇంతకంటె పరిణతములైన యభిప్రాయములు కోడిపిల్ల కుపయుక్తములై యుండునని నిరూపించుచు దాని కుత్తుకను త్తరించును.

అట్టి యూహలు తప్పుద్రోవల బడుటకు వీలున్నను, వాని యునికి విషయమై మనకెట్టి సందియమునులేదు. పూర్వము అనేకమారు లొకటి యొక తీరుగా జరిగినదన్న విషయమే ముమ్ముందుగూడ నది యట్లై జరుగునని యనుకొనుటకు తగిన కారణమును జూపుచున్నది. కావున ప్రకృతిలో జరిగిన కొన్ని సంఘటనల మూలమున మన మనస్సులో నేర్పడిన సంస్కారములే రేపు సూర్యుడుదయించునని విశ్వసించుటకు కారణభూతములగుచున్నవి. కాని తనకు తెలియకుండ కుత్తుక ఉత్తరింపబడిన కోడిపిల్ల ఉన్న పరిస్థితిలో కంటె నుత్తమస్థితిలో మనము లేమనియే చెప్పవచ్చును, కావున గతకాలపు ఏకరూపతలు- గత కాలమున కొన్ని సంఘటనలొక క్రమములో తిరిగి తిరిగి జరుగుట ముమ్ముందుగూడ నట్లే జరుగునని యూహించుటకు దగిన కారణసామగ్రిని సమకూర్చు చున్నదన్న విషయమును- అట్లు జరుగునని యనుకొనుట యెంతవరకు సమంజసమన్న విషయమునుండి వేఱుచేసి పరిశీలింపవలయును,

అసలు ప్రకృతిలో నేకరూపత యన్నది యున్నదని విశ్వసించుట కుపపత్తి యేమైన

కలదా యన్నదే మనము పర్యాలోచింపవలసిన సమస్య. ప్రకృతిలోని యేకరూపతను విశ్వసించుట యనగా జరిగినదిగాని జరుగనున్నదిగాని ఒక సామాన్య సిద్ధాంతమున సంతర్భూతమగు నొక యుదాహరణమనియును, దీని కపవాదమనునది లేదనియు విశ్వసించుట. మనమిప్పుడు పర్యాలోచించుచున్న యపరిణతములగు ప్రతిజ్ఞలన్నియు అపవాదములకు లోనగుచున్నవి. కావున నట్టి యాశలు పెట్టుకొనినవారు నిరాశోపహతులగుదురు. కాని అపవాద సహితములగు సామాన్య సిద్ధాంతముల స్థానమును అపవాదరహితములగు సామాన్య సిద్ధాంతము లాక్రమించుచున్నవనునది విజ్ఞానశాస్త్ర సిద్ధమగు విషయము. గాలిలో నాధారములేని వస్తువులు నేలపైఁబడును. వీనికి వాయునౌకలు, విమానములు అపవాదములు. అనేక వస్తువులు పడునునుటకు కారణసామగ్రిని సమకూర్చు గతిసూత్రములు, ఆకర్షణధర్మము, వాయునౌకలు, విమానములు ఆకాశమున నెగురగలవని గూడ నిరూపించును. కావున గతిసూత్రములు, ఆకర్షణధర్మము అపవాదములకు లోనుగావు.

భూమికి దాని పరిభ్రమణమును నిరోధించు పెద్దగోళ మొకటి యడ్డు వచ్చినచో సూర్యుడు రేపుదయించునను విశ్వాస మయథార్థము కావచ్చును. కాని అట్టి సంఘటనవలన గతిసూత్రములకుగాని. ఆకర్షణధర్మమునకుగాని యెట్టి క్షతియును గలుగదు, కాని ఐక్యమును కన్గొనుటయే విజ్ఞానశాస్త్రముయొక్క ముఖ్యధర్మము.

ఇట్టి ఐక్యము కొన్ని సామాన్య సిద్ధాన్తములలో కాననగును. వానికి నపవాదములనునవి యుండవు. ఇట్టి సామాన్య సిద్ధాన్తములద్వారా ప్రకృతిగతమగు నైక్యము పరిశోధించుటలో ప్రకృతిశాస్త్ర మఖండ విజయమును గాంచినదనియే చెప్పవచ్చును. ఇంతవరకును ఇట్టి యేకరూపత సిద్ధించినదనియే చెప్పవచ్చును. దీనిని బట్టి మరియొక ప్రశ్న బయలుదేరుచున్నది. అట్టి యేకరూపతలు పూర్వము ప్రవర్తిల్లినంత మాత్రమున ముందుగూడ ప్రవర్తిల్లుననుటకు మనకు హేతువేమైన గలదా ?

భవిష్యత్తుగతమును బోలియుండునని యనుకొనుటకు మన కుపపత్తి గలదని, వాదించుట గలదు. ఏలన ఒకప్పుడు భవిష్యత్తైనది గతముగా మారినది. దానినిబట్టి - భవిష్యత్తును గూర్చి - ఒకప్పుడు భవిష్యత్తుగానైన కాలమును గూర్చి - అనగా గత భవిష్యత్తును గూర్చి మనకు ననుభవము కల్గుచున్నది. కాని యట్టి యుపపత్తి సిద్ధసాధ్యదోషమునకు గురియగుచున్నది. మనకు గత భవిష్యత్తును గూర్చిన యనుభవము గల్గుచున్నదిగాని భవిష్యద్భవిష్యత్తులను గూర్చి గల్గుటలేదు. అసలుసమస్య యిది. భవిష్యద్భవిష్యత్తులు గత భవిష్యత్తును బోలియుండెనా ? ఈ ప్రశ్నకు సమాధానము చెప్పవలెనన్న, దానికి ననుగుణమగు నుపపత్తిని గత భవిష్యత్తునుండియే గ్రహింపవలయును. కావున గతమును భవిష్యత్తును సమముగా నియమించు సిద్ధాంతము నొకదానిని మనము పరిశోధింపవలసి యున్నది.

ఈ విషయమున భవిష్యత్తునుగురించి చెప్పుట యంత ప్రధానముగాదు. మన యనుభవములో పనిచేయు సిద్ధాంతములను, మన కనుభవములో లేని గతకాలపు విషయముల కన్వయించునపుడు ఉదాహరణమునకు, భూగర్భశాస్త్ర విషయములకుగాని, సౌరకుటుంబ వ్యవస్థకు సంబంధించిన వాదములకు గాని యన్వయించునపుడదే సమస్య బయలుదేరును. మన మడుగవలసిన సమస్య యిది. రెండు వస్తువులు పరస్పరము కలసి యున్నట్లు కన్పించినపుడు, ఆ రెండును ఒకదాని నొకటి వీడియుండు నిదర్శనము కన్పింపనపుడు, ఆ రెండింటిలో నొకదానియునికి రెండవదిగూడ నుండునని యనుకొనుటకు తగిన యుపపత్తిని సమకూర్చునా ? ఈ ప్రశ్నకు మనము చెప్పు సమాధానముమీదనే, భవిష్యత్తును గూర్చిన మన యూహలయొక్కయు, వ్యాప్తిసాధక సిద్ధాంతముచే సిద్ధించిన ఫలితములన్నింటియొక్కయు, వాస్తవమునకు. మన దైనికజీవితమునకు నాధారభూతములగు సర్వ విశ్వాసములయొక్కయు సామాంజస్య మాధారపడి యుండును.

కాని కేవలము రెండు వస్తువులు తరచుగా ఒకదానినొకటి వీడక కలసియున్నట్లు కన్పించిన వన్న విషయము, మనము పరిశీలించు వేఱొక సందర్భములో పూర్వమువలెనే ఆరెండును కలసియే యుండునని అనుభవపూర్వకముగా నిరూపించుటకు తగినంత యుపపత్తిని చేకూర్పదు. కాని ఒక విషయమును మాత్రము మనము కచ్చితముగా చెప్పవచ్చును. అది యిది.

రెండు వస్తువు లెంతయెక్కువ తఱచుగా కలసి యున్నట్లు కన్పించిన నంత యెక్కువగా మున్ముందుగూడ నా రెండింటి సహభావమునకు నవకాశము గలదు. చాలినన్ని యుదాహరణము

లలో నారెండును కలసి యున్నట్లు కన్పించిన, వాని సహభావము సంభవదశనుండి ఇంచుమించు నిశ్చితత్వదశ నొందును. ఈ విషయమున వాని సహభావము కేవలము సంభవమని చెప్పగల్గుదుము గాని నిశ్చితమని చెప్పజాలము. ఏలన, అవి రెండును కలసియుండుట యనునది సంతతము జరుగుచున్నను, కుత్తుక యుత్తరింపబడిన కోడిపిల్ల సందర్భములోవలె, ఒకప్పుడైనను, ఆ సహభావపౌనఃపున్యమునకు భంగముగల్గును. కావున ఈవిషయమున మనము సాధింపవలసినది వాని సహభావము యొక్క సంభావ్యమును (Probability) గూర్చియే.

మనమిప్పుడు అవలంబించుచున్న సిద్ధాంతమునకు వ్యతిరేకముగా ప్రకృతిసిద్ధములగు సర్వపదార్థములును అందు జరుగు సర్వసంఘటనములును ఒక నియమనిబంధనకు లోనగుననియు ఒక్కొక్కప్పుడు ఉదాహరణము లన్నిటిని ఒకే సిద్ధాంతమునుబట్టి యన్వయించుటకు వీలగునని పరిశీలననుబట్టి వాదించుటగలదు. ఇట్టి యభిప్రాయమునకు రెండుజవాబులు చెప్పవచ్చును. అపవాదము లేవియులేని యొక సిద్ధాంతము మన యుదాహరణకు అన్వయించినను, అట్టి సిద్ధాంతమును, అపవాదములులేని యట్టి సిద్ధాంతమును-గ్రహింపగల్గితిమని చెప్పలేము. ఇదియొక సమాధానము. అంతకంటె ప్రధానమైన జవాబు మరియొకటి గలదు, అట్టి నియమనిబంధన మేమైన ఉన్నను, అది కేవలము సంభవముగనే కన్పట్టును. గతకాలమున నపరీక్షితములగు సందర్భములలోను, భవిష్యత్కాలముననను - ఆ నియమనిబంధనము ప్రవర్తిల్లునను విశ్వాసమే మనము పరిశీలించుచున్న సిద్ధాంతముపై నాధారపడియున్నది.

మనము పరిశీలించుచున్న సిద్ధాంతమును వ్యాప్తి సాధక సిద్ధాంతమని చెప్పవచ్చును. దానిని రెండు భాగములుగ నీ క్రింది పద్ధతిలో విన్యసింపవచ్చును.

(a) ఎ అను ఒకానొక తెగకుజెందిన వస్తువు బి అను మరియొక తెగకు జెందిన వస్తువుతో కలసి యున్నట్లు కన్పించినపుడు. ఎ, బి అను తెగకు జెందిన వస్తువునుండి విడివడినట్లు కన్పింపనపుడు, ఎ, బి లు కలసియున్న సందర్భములెంత యెక్కువగా నున్న, అంతయెక్కువగా ఆరెండింటిలో నొకటియున్నట్లు జ్ఞాతమైన వేరొక క్రొత్త సందర్భములో నా రెండును కలసి యుండును.

(b) అనేక పరిస్థితులలో, ఆ రెండును కలసియున్న సందర్భములు చాలినన్ని యున్నయెడల మరియొక యుదాహరణలో నారెండింటి సహభావ మించు మించు నిశ్చితత్వదశ నొందును. తుదకు పరిమితిలేని నిశ్చితత్వదశ నందుకొనును.

పైన చెప్పినట్లు, మరియొక క్రొత్త యుదాహరణములో ఎ, బి లు కలసియుండునని మన మనుకొన్న యూహ యథార్థమైనదా అయథార్థమైనదా అని తేల్చుకొనుటకు ఈ సిద్ధాంత ముపయోగించును. ఎ, బి లు కలసియున్న సందర్భములు చాలినన్ని జ్ఞాతమైనచో, ఆ రెండును కలసియుండని సందర్భములు జ్ఞాతము కాకపోయినచో, ఎ అను తెగకు చెందిన వస్తువు లెల్లప్పుడును, బి అను తెగకుజెందిన వస్తువులతోఁ గలసియుండునను సామాన్య సిద్ధాంతమున కనుగుణమైన సంభావ్యము మనకు అపేక్షణీయము. ప్రత్యేకోదాహరణమునకు గల సంభావ్యముకంటె సామాన్య సిద్ధాంతమునకు గల సంభావ్యము తక్కువయే. ఏలన సామాన్య సిద్ధాంతము నిజమైనచో ప్రత్యేకోదాహరణముగూడ నిజమైయుండవలెను. కాని సామాన్య సిద్ధాంతము నిజము కాకపోయినను, ప్రత్యేకోదాహరణము నిజము కావచ్చును. అయినను,సామాన్య సిద్ధాంతముయొక్క సంభావ్యము, ప్రత్యేకోదాహరణముయొక్క సంభావ్యము వలెనే పౌనఃపున్యముచే బెరుగును. సామాన్యసూత్రమునకు సంబంధించి మన సిద్ధాంతమునకు సంబంధించిన రెండు భాగములను తిరిగి యీ రీతి విన్యసింపవచ్చును,

(a) ఎ అను తెగకు జెందినవస్తువు, బి అను తెగకు జెందిన వస్తువుతో గలసియున్న సందర్భములెంత యెక్కువగా నున్న వాని సాహచర్యమునకు భంగముగల్గు పరిస్థితులు జ్ఞాతముకానిచో Aఎల్లప్పుడు Bతో కలసియుండుటకు నవకాశము లంత యెక్కువగా గలవు,

(b) అవే పరిస్థితులలో, Bతో A కలసియున్న సందర్భములు చాలినన్ని యున్నచో, ఎ,బి తో కలసియుండుననుట నిశ్చితమైపోవును. తుదకు ఈ సామాన్య సిద్ధాంతము పరిమితిలేని నిశ్చితత్వము నొందును.

కాని సంభావ్యమనునది కొన్ని యాధారములనుబట్టి ఎల్లప్పుడును నిర్ణీతమగునని మనము గ్రహింపవలయును. ఇప్పటి మన యుదాహరణములు ఎ,బిలు కలసియున్న సందర్భములే మనకు తగిన యాధారములు. అసలీ సంభావ్యమును పూర్తిగా తలక్రిందులుసేయు తదితరములైన

యాధారములుగూడ నుండవచ్చును. ఉదాహరణమునకు అనేక తెల్లని హంసలనుచూచిన వ్యక్తి హంసలన్నియు సాధారణముగా తెల్లగా నుండునని, మన సిద్ధాంతమును బట్టి, వాదింపవచ్చును. ఇది సమంజసమైన యుపపత్తియే కావచ్చును. కొన్ని హంసలు నల్లగా నున్నంతమాత్రమున పై యుపపత్తికి భంగమేమియును లేదు. కొన్ని యాధారములు ఒక విషయమునకు గల సంభావ్యమును తగ్గించినను,దానిని పూర్తిగా నవివమ్ము చేయలేవు. హంసల విషయములో, మనము గ్రహింపవలసిన సంగతి యొకటి గలదు. రంగు అనునది జంతువులలో జాతివిశేషమునుబట్టి మారుచుండును. కావున రంగుకు సంబంధించిన వ్యాప్తిజ్ఞానము అయథార్థమగుటకు వీలుగలదు, కాని ఈ జ్ఞానము ఒక క్రొత్త యాధారమును కల్పించును. అంతమాత్రమున, మన వెనుకటి యాధారములవలన నేర్పడిన సంభావ్యమును పొరపాటుగా నిర్ణయించినట్లు చెప్పవలనుపడదు. ఒక్కొక్కప్పుడు కొన్ని సంఘటనలు మన మనుకొనినట్లు జరుగకపోయినను, ఒక ప్రత్యేక సందర్భమునగాని, యట్టి తదితర సందర్భములలో గాని అవి సామాన్యముగా జరుగవని చెప్పుటకు ఆధారమేమియులేదు. కావున అనుభవమునుబట్టి వ్యాప్తిసాధక సిద్ధాంతమును గాదనుటకు వీలు లేదు.

ఇంకొక దృష్టితో జూచినచో, అనుభవమును బట్టియే వ్యాప్తిసాధక సిద్ధాంతమును గాదనుటకు వీలుగలదు. కాని పరీక్షింపబడిన నిదర్శనములను బట్టి అనుభవము వ్యాప్తిసాధక సిద్ధాంతమును కాదనుటకు వీలులేదు. అపరీక్షితములగు నిదర్శనముల విషయమున మాత్రము - పరీక్షితమైన దానినిబట్టి యపరీక్షితమైన దానిని అనుమాన ప్రమాణముచే నూహించు విధానమును సమర్థింప గల్గినది వ్యాప్తిసాధక సిద్ధాంతమే. భవిష్యత్తు విషయమైగాని, గతకాలమునకుగాని వర్తమాన కాలమునకుగాని సంబంధించిన అననుభూతములగు సంశయముల విషయమై యనుభవమును బట్టి వాదించుటకు సాధనభూతములగు నుపపత్తులన్నియు, వ్యాప్తిసాధక సిద్ధాంతమునే ప్రాతిపదికగా నంగీకరించును. కావున సిద్ధసాధ్యదోషమునకు లోనుగాకుండ వ్యాప్తిసాధక సిద్ధాంతమును నిరూపించుట కనుభవము నెప్పుడును ఆధారముగ గొనలేము. అందుచే నీ వ్యాప్తిసాధక సిద్ధాంతమును స్వతస్సిద్ధమగు సిద్ధాంతముగనైన అంగీకరింపవలెను. లేదా భవిష్యత్తు విషయమై మనము చేసికొన్న నిర్ణయముల నన్నిటిని వదలుకొనవలెను.

ఆ సిద్ధాంత మసమంజసమైనచో, సూర్యుడు రేపుదయించునని యనుకొనుటకుగాని, మనము తినెడి రొట్టె రాతికంటె నెక్కువ ప్రాణపోషకమని భావించుటకుగాని. మన మింటి పైకప్పు నుండి కాలు జారినచో క్రిందకుఁ బడిపోవుదుమని యనుకొనుటకు గాని ఉపపత్తి యేమియు మనకు లేనట్లే. మన కుత్తమ స్నేహితుడుగా కన్పించు వ్యక్తి మనను సమీపించునపుడతనిలో వైరభావము గూడు కట్టుకొని యుండుటలేదని చెప్పుటకు ఎట్టి యుపపత్తియునులేదు. మన ప్రవర్తనమంతయు పూర్వము పనిచేసి, మున్ముందు గూడ నట్లె పనిచేయునని యనుకొనుటకు నవకాశము గల కొన్ని సంస్కారములపై నాధారపడి యుండును. ఈ సంభావ్యముయొక్క సామంజస్యము వ్యాప్తి సాధకసిద్ధాంతముపై నాధారపడి యుండును.

నియమనిబంధనములోని విశ్వాసము, ప్రతి సంఘటనము నొక కారణమునుండి తీరవలనను విశ్వాసము వంటి విజ్ఞానశాస్త్రమునకు సంబంధించిన సామాన్య సిద్ధాంతములు, దైనికజీవిత విశ్వాసములవలె, వ్యాప్తిసాధక సిద్ధాంతముపై నాధారపడి యున్నవి. అట్టి సామాన్యసిద్ధాంతములను విశ్వసించుటకుగల ప్రధానహేతువు, మానవసమాజమున, వాని యాథార్థ్యమునకు సంబంధించిన యుదాహరణములు పరశ్శతములుగా లభించుటయే. అంతమాత్రమున, వ్యాప్తిసాధక సిద్ధాంతమును ప్రాతిపదికగా నంగీకరించినగేగాని, మున్ముందు వాని యాథార్థ్యమునకు తగిన నిదర్శనములు లభించునని చెప్పలేము.

కాని అనుభవము నాధారముగా గొని అననుభూతమైన దానినిగూర్చి మనకు దెల్పు సర్వజ్ఞానమును, అనుభవము ఔననుటకుగాని కాదనుటకుగాని వీలులేకపోయినను, మనలో ననుభవసిద్ధ విషయముబుగా జీర్ణించినట్లు కన్పించు ఒక విశ్వాసము నాధారపడియున్నది. అట్టి విశ్వాసములను సమర్థింపజూచునపుడు తత్త్వశాస్త్రమున నతి క్లిష్టములైనవి వాదాస్పదములగు సమస్యలుత్పన్నమగును. అట్టి జ్ఞానము యెంతవరకు నవసరము దాని నెంతవరకు నిశ్చితమని చెప్పవచ్చునను విషయములను గూర్చి తరువాతి యధ్యాయమున పర్యాలోచన సల్పుదము.

మృత్యుముఖంలో తుదిరోజు

విక్టర్ హ్యూగో

అనువాదం : శ్రీ రెంటాల గోపాలకృష్ణ

౬

30

అప్పుడే ఒకవ్యక్తి వచ్చాడు. తలకు 'హేట్' పెట్టుకున్నాడు అతను నన్ను గమనించినట్లేలేదు. అడుగుబద్ద ఒకటి తీసుకున్నాడు ఆ అడుగుబద్దతో క్రిందినుంచి మీదికి గోడలు కొలవడం మొదలుపెట్టాడు. పెద్దగా గొంతు చించుకుని మాట్లాడుతూ మధ్య మధ్య, 'ఆఁ, అది! సరిపోయింది!' అనిఅంటూ మళ్ళీ 'అహాఁ, అలాకాదు.' అనసాగాడు.

అతనెవరని పోలీసువాణ్ణి అడిగాను. అతనొక వాస్తుశాస్త్రజ్ఞుడనీ, జైలు శాఖలో ఉద్యోగం చేస్తున్నాడనీ, వాస్తుశాస్త్రం బాగా తెలిసినవాడనీ రక్షక భటుడు నాతో చెప్పాడు.

తరువాత అతని దృష్టి నామీదికి మళ్ళింది. నావంక అదోలా చూచాడు. తల ఊచాడు, తిరిగీ తన మామూలు ధోరణిలో ఇల్లు ఎగిరిపోయేటట్లు మాట్లాడుతూ కొలతలు తీసుకోసాగాడు.

తనపని ముగిసిన తరువాత నావద్దకు వచ్చి మళ్ళీ బిగ్గరగా, బొంగురు గొంతుతో "మరో ఆరుమాసాలలో ఈజైలు ఇంతకన్నా బాగుపడుతుందయ్యా" అన్నాడు.

కాని అదేంకర్మమో, అతని మాటలు వింటుంటే ఎవరికైనా ఏడుపొస్తుంది!

ఆతరువాత అతను ఒకచిన్న చిరునవ్వు విసిరాడు. అప్పుడు నేను అతని ముఖంలోకి పరీక్షగా చూచాను. పెండ్లికాబోయేముందు పెండ్లికూతురుతో వరస అయినవాళ్లు 'ఎకసక్కా' లాడినట్లుగా అతను నాతో 'ఎకసక్కా' లాడుతున్నాడని నాకు స్పష్టమైంది.

అంతలో వృద్ధుడైన రక్షక భటుడు అందుకుని అతనితో "ఏమండీ! చావుకు సిద్ధమై ఉన్నవాడితో మీరిలా పరాచకాలాడడం ఏం బాగాలేదు. అయినా, అదేమిటండీ! అలా గొంతు చించుకుంటారేం?" అన్నాడు.

తరువాత ఆ వాస్తుశాస్త్రజ్ఞుడు వెళ్ళిపోయాడు.

నేను - నేను ఒక్కణ్ణీ, అతను కొలతవేసుకున్న రాళ్ళలో ఒకరాయిలాగా అక్కడ ఉండిపోయాను!

31

తరువాత చాలా విచిత్రమైన విషయం ఒకటి జరిగింది. ఎవరన్నా వింటే నవ్విపోతారు!

నా వెంటఉన్న రక్షక భటుడు వెళ్ళిపోయాడు. ఆ వృద్ధుని బదులు మరొక క్రొత్త పోలీసు వచ్చాడు. ఆ వృద్ధుడు వెళ్ళిపోయేటప్పుడు నేనతనితో కరస్పర్శ కావించలేదు. పల్లెత్తుమాటైన మాట్లాడలేదు ఎంత అహంకారం నాకు! ఎంత కృతఘ్నుణ్ణి నేను! క్రొత్తగావచ్చిన పోలీసువాడి ముఖం గుంటముఖం, మిడిగ్రుడ్డు మూర్ఖునిలా అగుపిస్తున్నాడు.

అసలా వెధవాయిని నేను గమనించి ఉండేవాణ్ణేకాదు! నేను అటుప్రక్కకు మళ్ళి కూచున్నాను. నొసలు పట్టుకొని నాకష్టాలు తలపోసుకుంటున్నాను. అంతలో ఎవరో నా బుజంమీద మెల్లగా తట్టారు. నేను వెనక్కు తిరిగి చూచాను. చూచేసరికి ఆక్రొత్త పోలీసువాడు కనుపించాడు!

అతను నాతో అన్నమాటలు నాకు బాగా జ్ఞాపకం ఉన్నాయి!

"ఏమయ్యా! నీవు భారీమనస్సు కలవాడవేనా?" అని అడిగాడతను.

"కాదు" అని సమాధానం చెప్పాను నేను

నేనిలా సుత్తసరిగా జవాబు చెప్పడంతో అతను కళవళ పడ్డాడు అయినప్పటికీ నంకోచిస్తూనే మరల సంభాషణ కొనసాగించాడు

"ఎవరైనా ఉదార స్వభావంతో ఉండడం మంచిదయ్యా" అన్నాడతను.

"ఓహో, అలాగా! అవుతే నన్ను కాస్త ఒంటరిగా ఉండనివ్వు అయినా నాతో నీకేం పని?" అన్నాను నేను

"క్షమించవయ్యా బాబూ! నీతో నాకేం పనిలేదు. ఒక్క రెండు ముక్కలు చెప్పాలనుకుంటున్నాను అంతే. మరేంలేదు చూడు బాబూ! ఎవడైనా పేదవాడికింత బాగుపడే మార్గం చూపిస్తే నీకు పొయ్యేదేమీలేదుగా, ఏమంటావ్?"

నేను విస్తుపోయాను. బుజాలెగరవేశాను, "ఏమయ్యా స్వామీ, నీవేమైనా పిచ్చాసుపత్రినుంచి వస్తున్నావా యేం? కాకపోతే ఏమిటయ్యా! అన్నందాలా దౌర్భాగ్యుణ్ణి నేనే దొరికానటయ్యా నీకు-నేను నీకు సుఖపడేమార్గం చూపించేదా? ఎంత బాగున్నదయ్యా!"

అతను అమాయకంగా ఒక చిరునవ్వు నవ్వాడు.

"అవును బాబూ. నాకు సుఖం కావాలి. ఇంతవరకూ నాకు సుఖపడేయోగం రాలేదు. ఆయోగం నీవల్లనే పట్టాలి! నేను చాలా పేదవాణ్ణి ఈ పోలీసు నౌకరిలో నాకువచ్చే జీతపురాళ్ళు బహుస్వల్పం. చాకిరా చచ్చేటంత చాకిరి ఏంచెయ్యను? గుర్రప్పందాలంటే నాకు చచ్చేఇష్టం అవి నా జీవితాన్ని ధ్వంసం చేస్తున్నాయి. ఆనష్టం పూడ్చుకోడానికి లాటరీ టిక్కెట్లు కొంటున్నాను నాలుగురాళ్లు గడించాలంటే మరి, ఏదోఒకటి చెయ్యాలికదండీ కాని అదేంకర్మమో, ఇంత వరకు ఒక్కమాటు అయినా అదృష్టంగల సంఖ్య రాలేదునాకు అదృష్టంగల అంకెల కోసం ఎన్నో తడవలు ప్రయత్నించాను. కాని వాటి తస్సాతియ్యా, ఎప్పుడూ అవి నాకు దూరమవుతూనే వచ్చాయి నేను 76వ సంఖ్య తీసుకుంటే, 77 వస్తుంది 77 కొంటే 78 వస్తుంది. ఇదేవరస! ఎన్ని తడవలో చూచాను. ఎప్పుడూ ఇంతే!... అయినా ఓపిక పట్టి ప్రయత్నిస్తూనే ఉన్నాను. బాబ్బాబూ, నీకాళ్ళు పట్టుకుంటాను. చచ్చి నీ కడుపున పుడతాను ఎలాగూ ఇవాళ నీవు చావనున్నాను చచ్చేవాడికి జోస్యం బాగా తెలుస్తుందిట! అతను పట్టింది బంగారం అవుతుందిట! చెపుతారు. ఇందులో అసత్యంలేదు. కనుక నీవు నాకు ఏవో నీ యిష్టంవచ్చిన సంఖ్యలు - మూడు చెప్పు; మూడు గెలుపు సంఖ్యలు చెపుతావుకదూ? బాబ్బాబూ! నిన్ను గడ్డం పట్టుకుని బ్రతిమాలుకుంటున్నాను. ఈఒక్క ఉపకారం చేసిపెట్టు. దయ్యాలన్నా, భూతాలన్నా నాకు భయంలేదు. కనుక నీవు ఏవిధంగా ఆ మూడు సంఖ్యలు చెప్పినాసరే. ఇదిగో నా 'అడ్రెస్' ఇస్తున్నాను. "పోపిన్ కోర్టు బారెక్సు, మెట్లమీద, ఎ 26 వ నెంబరు. నడవలో చిట్టచివరిగది" ఆట్టేకష్టం లేకుండానే గుర్తు పట్టవచ్చు ఎలాగైనా సరే, ఇవాళ సాయంత్రం నీవు అక్కడికి రావాలి. వస్తావు కదూ?"

అతనీ విధంగా చెప్పేసరికి నా మనస్సులో ఒక్కమాటుగా మెరుపులు అనేకం మెరిసినట్లనిపించింది. అదృష్టవశాత్తూ నా మనస్సులోకి ఎలాంటి పిచ్చి ఆలోచనా రాలేదు. వచ్చిఉంటే అతనికి సమాధానం వేరేవిధంగా చెప్పి ఉండేవాణ్ణి సరే ఏమైనా చావుకు సిద్ధమై ఉన్నవాడి ప్రవృత్తి ఏవిధంగా ఉంటుందో ఆ విధంగానే అతనికి జవాబు చెప్పాను:

"నిన్ను కోటీశ్వరుణ్ణి చేస్తాను. కాని ఒక్క షరతు" అన్నాను.

ఆ మూర్ఖుడు కనులు ఇంతింతచేసి నా వంక చూచాడు· "ఏమిటది? ఏమిటో చెప్పు?" అని ఆతృతతో అడిగాడు.

"లాటరీలో గెలుపు సంఖ్యలు మూడు చెప్పమని కోరావు నువ్వు. మూడు కాదు. నాలుగు చెపుతాను. నా దుస్తులు నీవు వేసుకొని నీ దుస్తులు నాకివ్వు" అన్నాను నేను

"ఒస్, ఇంతేనా!" అన్నాడతను, అప్పుడే తన పోలీసు దుస్తులు విప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు

నేనులేచి నిలుచున్నాను. అతని కదలికలన్నీ కనిపెట్టసాగాను. నా గుండెలు దడదడ కొట్టుకున్నాయి. పోలీసు దుస్తులతో నేను జైలునుంచి పారిపోతున్నట్లనిపించింది.

కాని అంతలో అతను సంధిగ్ధావస్థలో పడ్డాడు. తన విముఖత్వం వెలిబుచ్చాడు.

"అమ్మయ్యో! దుస్తులు మార్చుకోడమే! నీవిక్కడనుంచి తప్పించుకపోదామనా?" అని అడిగాడు,

దాంతో నా ఆశాసౌధాలన్నీ ఒక్క దెబ్బన కూలిపోయాయి. అయినప్పటికీ మరొకమాటు ప్రయత్నం చేశాను. పనికిమాలిన, తెలివితక్కువ ప్రయత్నం.

"అవును నేను తప్పించుకపోతే నీకేమయ్యా! నీకు కావలసింది డబ్బు, ఇంకేం? నిన్ను కుబేరుణ్ని చేస్తున్నానుగా!..."

అతను నా మాటకు అడ్డువచ్చాడు.

"అమ్మో, వద్దువద్దు! నీవు చచ్చినప్పుడే నీవు చెప్పిన సంఖ్యలు గెలుపు సంఖ్య లవుతాయి పైగా నీవు తప్పించుకపోతే నా ప్రాణాలు తీస్తారు!" అన్నాడు.

నేను ఇహ మారుపలకలేదు అన్ని ఆశలూ వదులుకొని ఒక సుదీర్ఘమైన ఆలోచనలో మునిగిపోయాను

32

నేను రెండుచేతులతో గట్టిగా కళ్ళు మూసుకున్నాను ప్రస్తుతాన్ని గతంలో విస్మరించడానికి ప్రయత్నించాను అప్పుడు నాకు జ్ఞాపకాలొచ్చాయి. నాబాల్యం, యౌవనం, అన్నీ ఒకదాని తరువాత ఒకటి, ఒకచక్కని, చల్లని పూలతోటలోని గాలి ముసురుకున్నట్లు, తియ్యని గతస్మృతు లనేకం నా మనస్సులో ముసురుకున్నాయి.

నేను ఆడుతూ. పాడుతూ, కిలకిల నవ్వుతూ. కేరింతలు కొడుతూ, తోటి పిల్లకాయలతో కలిసి పుస్తకాలు చంకన పెట్టుకుని, పచ్చని తోపుల్లోగుండా, తోటల్లోగుండా బడికి వెడుతున్న దృశ్యం కనుల ముందు పొడగట్టింది. 'వాల్-డీ గ్రేస్' లో ఉన్న మా పెంకుటిల్లు అక్కడ నేను గడిపిన నా చిన్నతనపు రోజులు అన్నీ జ్ఞాపకం వచ్చాయి.

ఆ తరువాత నాలుగేండ్ల అనంతరం నేను మళ్ళీ అక్కడికి వచ్చాను అప్పటికి మాంచి యౌవనంలో ఉన్నాను. ఎన్నెన్నో కలల, అలలమధ్య టుంగుటుయ్యాల లూగుతున్నాను అప్పుడు చక్కని, చల్లని దేవదారు చెట్ల తోపులో దేవకన్యలాంటి ఒక చిన్న అమ్మాయి నాకు కనుపించింది

ఆపిల్ల స్పెయిన్ దేశస్థురాలు. చెంపకు చారెడు కళ్ళు, చలిస్తూ, జ్వలిస్తూ ఉన్నాయి. బారెడు జుట్టు తుమ్మెద రెక్కల ధగధగను మరిపిస్తున్నది మేలిమి బంగారంలా నిగనిగలాడే మేనిఛాయ. దొండపండులాంటి పెదవులు. గులాబీ చెక్కిళ్లు, పద్ధాలుగేండ్ల పిల్ల. పేరు పెపిటా

వాళ్ళమ్మా, మాఅమ్మా ఒప్పుకున్నారు. మమ్మల్ని కలిసి ఆడుకోమన్నారు. మేము కలిసి తిరిగాం ఆడుకున్నాం, కబుర్లాడుకున్నాం. మా మనస్సుల్లో ఏ కల్మషాలూ లేవు సమవయస్కులైన పిల్లలు ఎలా ఆడుకుంటారో, అలా మేము అమాయకంగా ఆడుతూ పాడుతూ తిరిగాం

ఇలా ఎంతోకాలం జరగలేదు ఒక్క పడాది. పెపిటా నన్ను వదలి వెళ్ళదు నేను

పెపిటాను విడిచి వెళ్ళను. ఆపిల్ పండ్ల తోటలో, పండ్లకోసం నేనా పిల్లతో తగువులాడేవాణ్ణి, పిచ్చికగూడుకోసం దెబ్బలాట పెట్టుకునేవాణ్ణి. ఆపిల్లను గిచ్చేవాణ్ణి కొరికేవాణ్ణి. ఆపిల్ల ఏడ్చేది "అట్లాగాని నీతిక్క కుదరదు!" అనేవాణ్ణి నేను. తరువాత ఇద్దరం ఇళ్ళకు వెళ్లేవాళ్ళం ఆ అమ్మాయి వాళ్ళమ్మతో నేను కొట్టానని ఫిర్యాదు చేసేది. నేను మా అమ్మతో ఆపిల్ల నన్ను తిట్టిందని చెప్పేవాణ్ణి ఇలా ఇద్దరం ఒకరి నొకరం తిట్టుకునేవాళ్ళం. మాటామాటా రెట్టించుకునేవాళ్ళం. చివరకు ఇరువురం చక్కీపడి మళ్ళీ అడుకునేవాళ్ళం.

ఆపిల్ల నా బుజంమీద తల వాల్చుకుని కూచుంటుంది నేను పెద్దగర్వంతో, నన్ను మించినవాడు ఈ భూమండలంలో లేనట్లు, 'పోజు' పెట్టి కూచుంటాను. తరువాత ఇరువురం చెట్టాపట్టాలు పట్టుకొని చేలగట్లపై నుండి నడిచి వెడుతుంటాం. మెల్లిగా మాట్లాడుకుంటాం ఆపిల్ల కావాలని తన చేరువూలు క్రిందజారవిడుస్తుంది నేను దాన్ని అందుకుని ఆ అమ్మాయి చేతికిస్తాను. అలా మా ఇరువురి చేతులు కలుసుకుంటున్నప్పుడు, అప్రయత్నంగానే అవి వణికిపోతాయి ఆమె పిట్టలను గురించీ, పూలనుగురించీ, నక్షత్రాలనుగురించీ, ఏవేవో కథలు చెపుతుంది ఒక్కొక్కమాటు దూరంగా చెట్లగుంపులో నుంచి అస్తమిస్తున్న సూర్యుణ్ణి గురించీ, మరొకతడవ స్కూల్లో తన స్నేహితురాంద్రను గురించీ, తాను వేసుకునే దుస్తులను గురించీ, రిబ్బన్లను గురించీ రకరకాల కబుర్లు చెపుతుంది ఎప్పుడు బట్టినా సరకంగానూ హానికరంకాని విషయాలపై మాట్లాడుకుంటాం మేము ఇరువురం ముఖాలు కందిపోయేటట్లు సిగ్గుపడుతాం. చూస్తూచూస్తుండగానే ఆపిల్ల పెద్దదవుతుంది!

అది ఒక వేసవినాటి సాయంకాలం మేమిరువురం తోటకు క్రిందితట్టున్న ఒకబాదం చెట్టుక్రింద కూచున్నాం చాలాసేపు ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాం. ఉన్నట్లుండి ఆమె నారెక్క పుచ్చుకున్నది "మనం అలా పరుగెడదాం పద!" అన్నది.

నేనిప్పుడు ఆమెవంక తదేకంగా చూచాను. వలిపెంలాంటి నల్లటి దుస్తులు. వేసుకున్నదామె గభాలున లేచి పరుగెత్త సాగింది నేనూ ఆమె వెనకాలే పరుగెత్తడం మొదలుపెట్టాను. ఆమె గాలిపటంలా ఎగిరిపోతున్నది లేడిపిల్లలా చెంగుచెంగున దూకుతున్నది. రివ్వున గాలిలో తేలిపోయే పిట్టలా తేలిపోతున్నది. ఆపిల్ల నడుం ఎంత సన్నగా ఉన్నది! పట్టుకుంటే పిడికిట్లోకి రాదు. మధ్య మధ్య గాలికి వలిపెంలాంటి ఆమె దుస్తులు తొలిగిపోతుంటే ఆమె పచ్చనిపళ్లు నాకు కనుపిస్తున్నది.

నేను ఆమె వెనకాలే పరుగెత్తాను. చివరకొక పాడుపడ్డ కొలనుగట్టున ఆమెను పట్టుకున్నాను. నా చేతిని ఆమె నడుంచుట్టూ పోనిచ్చాను. గట్టునఉన్న పచ్చని గరికపై కూలవేశాను. ఆమె వద్దనలేదు ఆపిల్ల పరవశురాలై ఉంది. పగలబడి నవ్వుతోంది. నామటుకు నేను గంభీరంగా ఉన్నాను. నల్లగా, తళతళ మెరుస్తున్న ఆమె కళ్ళలో కళ్ళుపెట్టి చూచాను.

"నీవు అక్కడ కూచో. ఇంకా ప్రొద్దు కూకలేదు. కాసేపు ఏదైనా పుస్తకం చదువుకుందాం. పుస్తకం తెచ్చావా?" అన్నదామె.

నాదగ్గర 'స్వాలన్‌జానీ యాత్రల' రెండవ సంపుటం ఉన్నది. నేను తటాలున ఆపుస్తకం తెరిచాను. ఆమెను ఆనుకుని కూచున్నాను. ఆవిడ తన బుజంతో నా బుజాన్ని గట్టిగా నొక్కింది. తరువాత ఇరువురం, ఎవరి మనస్సులో వాళ్ళం నిశ్శబ్దంగా పుస్తకంలో ఒక పేజీ చదవడం మొదలుపెట్టాం. నాకంటె ముందే ఆమె ఆపేజీ చదివేసింది. ఆమె చదివినంత త్వరగా నేను చదవలేకపోయాను. ఎంచేతనో నాబుర్ర పనిచెయ్యడంలేదు.

"నీవింకా చదవడం పూర్తికాలేమా?" అని ఆమె అడిగింది.

ఇరువురం తలకు తల ఆనించుకుని కూచున్నాం. ఆమె జుట్టు చిందరవందరై నా బుజాలమీద, ముఖంమీద పడుతున్నది క్రమ క్రమంగా మా ఇరువురి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఏకమైనాయి. మా ఇరువురి పెదవులూ రెండు ప్రవాహాలు కలుసుకున్నట్లు కలుసుకున్నాయి

మేం అలా చదువుకుంటుండగానే ప్రొద్దు క్రుంకింది నక్షత్రాలు వచ్చాయి. మాకు తెలియనేలేదు.

"అయ్యో, అయ్యో! అమ్మా వాళ్ళు ఏమంటారు?" అన్నదామె, మేం ఇంటికి తిరిగి వెడుతుండగా

మేం ఆఘమేఘాలమీద ఇల్లు చేరాం

నేనుమాత్రం మా అమ్మతో ఏమీ చెప్పలేదు "ఏమిట్రా నాయనా? ఏమీ మాట్లాడవేగాం?" అని అడిగింది మాఅమ్మ.

నా మనస్సుమాత్రం పట్టపగ్గాలు లేకుండా ఉంగి ఏదో స్వర్గధామంలో తేలిపోతున్నట్లుగా ఉంది నాకు లోలోపల నా జీవితంలో ఎన్నడూ మరిచిపోని, మాసిపోని సాయంత్రం అది! నా జీవితం అంతటిలోనూ!

33

గంట కొట్టింది, కాని అది ఏగంటో నాకు తెలీదు అదినాకు బాగా వినిపించలేదు నా చెవుల్లో ఏదో గింగురు మన్నది.

నేనిలా జ్ఞాపకాలలో మునిగి ఉన్నప్పుడే నేను చేసిన నేరం జ్ఞాపకంవచ్చి భయవిచలితుడ నయ్యాను. నాకు ఉరిశిక్ష పడకముందే నయం అప్పుడు, నేనుచేసిన నేరానికి ఎంతగానో పశ్చాత్తపించాను ఇప్పుడూ? ఉహుఁ ఇప్పుడు పశ్చాత్తాపమన్న మాటేలేదు నా మనస్సులోఉన్న ఆలోచనల్లా ఒక్కటే, చావు! అయినప్పటికీ చేసినదానికి పశ్చాత్తాపపడడానికి ప్రయత్నించాను.

గత జీవితమంతా స్ఫురణకు తెచ్చుకొని, ఇంకొక్క క్షణంలో నాకంఠం తెగిపడనున్నదని అనుకునేసరికి అదొక నూతన అనుభవమైనట్లు కంపించిపోయాను హాయిగా గడిపిన బాల్యం, ఆనందంగా గడిపిన యౌవనం, అన్నీ ఇప్పుడు భయంకరంగా ముగియబోతున్నాయి పట్టుదారాలతో అల్లుకున్న వస్త్రం నెత్తురులో తడిసి ముద్దయిపోనున్నది.

అనేక సంవత్సరాలు గడచిన తరువాత ఎవరైనా ఈ నాకథ చదివితే, నేరంతో మొదలై మృత్యువుతో సమాప్తమైన ఈ భయంకరమైన సంఘటనను అంతగా నమ్మకపోవచ్చు. ఇది అసంభవమని కూడా తలపోయవచ్చు

చట్టాలు, న్యాయసూత్రాలు, ఎంతక్రూరమైనవైనప్పటికీ, మానవులు ఎంత దుర్మార్గులైనప్పటికీ నేనుమాత్రం క్రూరుణ్ని కాదు!

అయ్యో, భగవంతుడా! కొద్ది ఘడియలలో నాజీవితాధ్యాయం ముగియ నున్నది. ఆకురాలినట్లుగా నా తనువు రాలిపోనున్నది!

34

ఈ క్షణంలో లోకమంతా నన్ను చుట్టుముట్టి ఉన్నది. పారిస్ నగరంలో ఉన్న చిన్నా - పెద్దా, వ్యాపారస్థులు, ఉద్యోగస్థులు, వర్తకులు, విద్యార్థులు, వార్తాపత్రికలు చదువుకునేవాళ్లు, తమతమ పనులమీద వెళ్ళేవాళ్లు, సాయంత్రంవేళ అలంకారాలు చేసుకుని నాట్యానికి వెళ్ళే యువతులు, పిల్లలతో ఆడుకునే తల్లులు, తల్లులతో ఆడుకునే పిల్లలు అంతా నాచుట్టూ మూగిఉన్నారు!

35

నా చిన్నప్పుడు జరిగిన ఒక సంఘటన ఇంకా నాకు జ్ఞాపకముంది ఒకనాడు నేను 'నాట్రడామ్'లో ఉన్న పెద్దగంటను చూడడానికి వెళ్ళాను. అప్పుడు నేను చాలా చిన్నవాణ్ని.

ఏటవాలుగా ఉన్న మెట్లుఎక్కి పైకి పోయేసరికే నాకు కళ్లు గిర్రున తిరిగాయి. పైగా అత్రోవ చీకటి, గుహ్యారంగాఉంది. రెండు పెద్ద గోపురాలమధ్యన కట్టిన వంతెన లాంటి త్రోవదాటి వెళ్ళాను. క్రిందికిచూస్తే పారిస్ నగరం యావత్తూ కనుపిస్తున్నది. తలతిరిగి పడిపోతానేమోఅని భయంవేసింది తరువాత గంటఉన్న మందిరంలో ప్రవేశించాను ఆగది రాతితోను, ఒకవిధమైన కర్ర తోను కట్టారు. లోపల ఒకపెద్ద గంట - సుమారు అరటన్ను బరువుగల గంట వ్రేలాడుతోంది.

కొంచెం ఎడంగా నిలుచుని, పారిస్ నగరంలో పెద్దలు - పిన్నలుకూడా ప్రసిద్ధంగా చెప్పుకునే ఆ గంటను పరిశీలించి చూచాను అప్పుడు నాకేమీ భయం కలగలేదు. దిగువకుచూస్తే 'నాట్రడామ్' ప్రాంతమంతా కనుపించింది నడిచిపోయే జనమంతా చిన్న చీమల్లా అగుపించారు.

• హఠాత్తుగా బ్రహ్మాండమైన ఆగంట ఊగడం మొదలుపెట్టింది పెద్దధ్వని పుట్టింది. తరంగాలు తరంగాలుగాలేచి అంతటా వ్యాపించింది అధ్వని. నా చెవులు గింగురుమన్నాయి. క్రిందఉన్న చక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి నాకు భయం పుట్టింది. వళ్ళంతా వణికిపోయింది కళ్ళు గిర్రున తిరిగాయి. పట్టు తప్పిపోయింది. కాలుజారింది తూలి పడబోయాను కాని వెంటనే భవంతి పైకప్పు అంచులు గట్టిగా పట్టుకున్నాను. కాని నాకు పైప్రాణం పైననే ఎగిరిపోతున్నట్లనిపించింది. అప్పటి నాస్థితి వర్ణించలేను, నోటమాటలేదు. పెదవులైనా కదపలేదు. ఊపిరి బిగబట్టాను బ్రహ్మాండమైన 'నాట్రడామ్' ఘంటారావం నా చెవులలో మారుమ్రోగుతోంది. అటూఇటూ చూడలేకుండా ఉన్నాను ఒకపెద్ద అగాధపు టంచును పట్టుకుని వ్రేలాడుతున్నాను. క్రింద ఆ అంతులేని అగాధంలో-జనం గుంపులు గుంపులుగా ఏ చీకూ చింతా లేకుండా హాయిగా తమపనుల మీద అటూఇటూ నడిచి వెడుతున్నారు

సరే! ఇప్పుడు నా పరిస్థితి అలాగే ఉంది. ఆనాడు గంటస్తంభం కొసలు పట్టుకుని వ్రేలాడుతున్నప్పుడు ఎట్లాఉందో ఇప్పుడూ అట్లాగేఉంది నాచుట్టూ అంతులేని ధ్వనులు వినవస్తున్నాయి. నాకూ - ప్రశాంతంగా జీవించే తక్కిన మానవకోటికి ఎలాంటి సంబంధమూలేదు నేనేదో అగాధపు టంచులు పట్టుకుని వ్రేలాడుతూ పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాను.

36

ఎంతో పాపం చేసుకున్నవాడికి గాని పురమందిరం (టౌన్‌హాల్) కంటపడదు! అంత దౌర్భాగ్యంగా, అంత అమంగళకరంగా, కనుపిస్తుంది అది

దాని పైకప్పు నిట్రంగా, కోసుగా ఉంటుంది. దానిమీద అష్టవంకర్లతో - వికారంగా కనుపిస్తున్న గడియారం ఒకటి ఈ పురమందిరానికి వేలాది కిటికీలున్నాయి ఇహ పాడుపడిపోయిన చిన్నచిన్న మెట్లు అసంఖ్యాకంగా ఉన్నాయి కుడిప్రక్క ఎడమప్రక్క రెండు పెద్ద ఆర్చిలు - ఆ మధ్యలో ఉన్నదే 'డీ గ్రేవ్'- (ఉరితీసే ప్రదేశం) ఎన్ని శతాబ్దాలనాడు ఏర్పాటు చేశారో ఆచోటు! అక్కడ విషాదం ఒడుస్తూ ఉంటుంది. గ్రీష్మకాలపు మండుటెండలో కూడా ఆ ప్రదేశం నల్లగా-పగలుచూస్తే రాత్రి కలలోకి వచ్చేటట్లు దర్శనమిస్తుంది.

ఎవరినైనా ఉరితీసే రోజులలో ఈ భవనం పోలీసువాళ్ళతో క్రిక్కిరిసి ఉంటుంది. ప్రతి ద్వారంచెంత, ప్రతి కిటికీవద్ద - ఎక్కడ చూచినా పోలీసువాళ్ళే. ఉరితీసే వ్యక్తిని వేయికళ్ళతో కనిపెడుతూ ఉంటారు.

ఇక రాత్రివేళ అంత చీకట్లోకూడా భవనంమీద గడియారం గంటలు కొడుతూ, తళతళ మెరుస్తూ ప్రత్యక్షమవుతుంది.

37

అప్పటికి ఒంటిగంటంపావు అయింది. ఆ నిముషంలో నా పరిస్థితి ఈవిధంగాఉంది: నాకు దుర్భరమైన శిరోవేదన మొదలైంది. కళ్ళు భగ్గున మండుతున్నాయి నడుం చచ్చు తీపు పుడుతున్నది. కణతలు కటకట్లాడిపోతున్నాయి. కొంచెం ఎటుకదిలినా సరే, నరాలు ఎక్కడికక్కడ తెగిపోతున్నట్లనిపిస్తున్నది.

నాకు, వళ్లు వణుకు ప్రారంభించింది. ఏదో 'ఎలెక్ట్రిక్ షాక్' కొట్టినట్లు రెండు మూడు తడవలు చేతిలో కలంజారి క్రింద పడింది పెద్ద నిప్పులకుంపటి దగ్గర కూచున్నప్పుడు కళ్ళలోకి పొగపోతే ఎట్లా ఉంటుందో అట్లాఉన్నాయి నాకళ్లు మోకాళ్ళలో, మోచేతుల్లో కలక పుట్టింది

ఈ బాధలన్నీకూడా మరో రెండుగంటల నలభై అయదు నిముషాల్లో పూర్తిగా నయమైపోతాయి !

38

అంతా అంటున్నారు. ఈ రకమైన మరణం చాలా అనాయాస మరణమనీ, ఏమాత్రం శ్రమలేకుండా,హాయిగా, చులాగ్గా ప్రాణాలు పోతాయనీ చెపుతున్నారు

కాని, ఆరువారాలపాటు అనుక్షణం నేను పొందిన ఆవేదన, అనుభవించిన చిత్రహింస ఎవరికి తెలుస్తుంది? పైగా ఇది అనాయాస మరణమని చెపుతారా వీళ్లు? ఎంత హాస్యాస్పదం ?

అయితా ఉరి తీసేటప్పుడు ఏమాత్రం బాధ ఉండదంటారే! క్షణంలో కన్నుమూసి తెరిచేలోగా ఆకాస్తపనీ అయిపోతుందం దంటారే! అది సత్యమేనా? ఈ చెప్పేవాళ్లు దూరంనుంచి చెప్పేమాటలుగాని అనుభవిస్తేగా వాళ్ళకు తెలిసివచ్చేది.

"ఉరితీసే యంత్రం ఎవడు కనిపెట్టాడో కాని వాడు మహానుభావుడు! ఈయంత్రం వరిషుల్లు వాసిఅయినా తప్పిపోదు!" అంటారు

కాని ఎవడికి తెలుసు? రెప్పపాటు కాలంలో మనిషి కుత్తుకను ఉత్తరించే ఈ యంత్రనిర్మాణం - మానవుణ్ణి ఎంతో క్షోభ పెడుతుందో ఎవ్వరెరుగుదురు. అయ్యో, భగవంతుడా! క్షణక్షణం దుర్మరణం!

39

నన్ను కాసేపు ప్రశాంతంగా పండుకో నివ్వమని వాళ్ళను కోరాను. వెంటనేవెళ్ళి పక్కమీద పడుకున్నాను.

వాస్తవానికి నఖశిఖ పర్యంతం నాకుపుట్టే నొప్పులు, తీపులు నన్ను పడుకునేటట్లు చేశాయి నాకు నిద్రపట్టింది ఇదే నా కడసారి నిద్ర!

ఆ నిద్రలో నాకొక కల వచ్చింది అది రాత్రివేళ నేను మరో ఇరువురు స్నేహితులతో కలిసి, గదిలో కూచుని ఉన్నాను. అది ఏఇల్లో నాకు గుర్తులేదు మా ఆవిడ ఆ ప్రక్కగదిలోనే మా అమ్మాయిని పక్కలో పెట్టుకుని నిద్రపోతున్నది

నేను నా స్నేహితులతో మెల్లగా మాట్లాడుతున్నాను కాని మేం మాట్లాడుతున్న విషయం ఎంచేతనో మాకు భీతి గొలుపుతున్నది.

హఠాత్తుగా మేంఉన్న భాగంలోనే అవతల మరొక గదిలోనుంచి ఏదో చప్పుడు వినిపించింది నాకు ఆధ్వని చాలా వింతగానూ, నూతనంగానూ వినిపించింది నా చెవులకు నా స్నేహితులను కూడా అడిగాను వాళ్లూ అలాగే ఉందన్నారు మేం అలాగే చెవి ఒగ్గి విన్నాము. తాళపు చెవితో తాళం తీస్తున్నట్లున్నూ, తలుపు గడియ లాగుతున్నట్లున్నూ వినిపించింది

మేమంతా వణికిపోయాం. మా అందరికీ చచ్చేభయం పుట్టింది. మా ఇంట్లోకి ఎవరో దొంగలు జొరబడుతున్నా రనుకున్నాం

ఎవరైంది తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాం. నేనులేచి ఒక కొవ్వొత్తి ముట్టించాను. నా వెనకాలే నా స్నేహితులుకూడా వచ్చారు.

మేమంతా ప్రక్కనేఉన్న పడక గదిలోకి వెళ్ళాం. అక్కడ మా ఆవిడ పిల్లను పక్కలో పెట్టుకుని గాఢంగా నిద్రపోతున్నది మేము తిరిగి మధ్యగదిలోనికి వచ్చాం. అక్కడ గోడలకు పటాలు వేసినవి వేసినట్లుగా ఉన్నాయి ఎక్కడా అలికిడి లేదు. కాని మధ్యగదికి వంటగదికి మధ్యఉన్న తలుపు మామూలుగాలేదు. తీసిఉంది.

తరువాత మేము వంట ఇంట్లోకి వెళ్ళాం గదంతా వెదికాం. ముందు నేనే వెళ్ళాను. వంటగదిలోనుంచి మేడమీదికి మెట్లున్నాయి మెట్లదగ్గర ద్వారంఉంది. అది మామూలుగానే వేసిఉంది అట్లాగే కిటికీలు కూడా యథావిధిగా మూసిఉన్నాయి తరువాత మేము పొయ్యిదగ్గరికి వెళ్ళాం అక్కడున్న అల్మరా తలుపుతీసి ఉంది.

నేను నిర్ఘాంతపోయాను. ఆ తలుపు వెనకాల మూలకు ఒదిగి ఎవరో మనిషి నిలుచున్నాడు నాగుండె గుభిల్లు మన్నది భూమిమీద కాలు ఆనలేదు ఎట్లాగైతేనేం ధైర్యం తెచ్చుకుని, మనస్సు చిక్కపట్టుకుని అల్మరా తలుపుమీద చెయ్యి వేశాను మెల్లిగా ఇవతలికి లాగాను. అక్కడొక వృద్ధురాలు నిశ్చలంగా నిలవబడి ఉంది. కళ్లు మూసుకున్నది. ఏదో భూతాన్ని చూచినట్లు భయకంపితుడనయ్యాను

"ఎవరు నీవు?" అని అడిగాను

ఆమె మాట్లాడలేదు.

"మాట్లాడవేం? ఎవరు నీవు?" అని మళ్ళీ అడిగాను.

అప్పటికీ ఆమె బదులు చెప్పలేదు. అసలు కదలనేలేదు, కళ్లుకూడా తెరవలేదు.

అంతలో నా స్నేహితులు "అబ్బాయ్, ఇది ఎవతో దొంగముండ! సందేహంలేదు. ఇదీ మరికొందరూ కలిసి దొంగతనానికి వచ్చి ఉంటారు. మనం లేచిన అలికిడివిని వాళ్ళంతా ఎక్కడివాళ్ళక్కడ దూసుకుని ఉంటారు. ఈ ముసిలిముండ పారిపోలేక ఇక్కడ నక్కింది!" అన్నారు.

మళ్ళీ నేను ఆమెను పిలిచాను. కాని ఎన్నితడవలు పిలిచినా ఆమె నోటినుంచి మాట రాలేదు అప్పుడు నా స్నేహితుల్లో ఒకడు ఆ వృద్ధురాలిని చేత్తో నెట్టాడు. ఆమె దభీలున క్రిందపడింది, ఒక అచేతనమైన పదార్థం ఒక చచ్చిన శవం పడ్డట్టు పడింది మేమంతా కలిసి ఆమెను మళ్ళీ లేవదీసి నిలుచోబెట్టాం మాలో ఇరువురు అప్రక్క ఒకరు ఈప్రక్క ఒకరు పట్టుకున్నారు. గోడకు చేరవేసి నిలుచోబెట్టారు. అప్పటికీ ఆమెలో ప్రాణమున్నట్లు తోచలేదు మాకు. ఒకడు ఆమె చెవిదగ్గర నోరుపెట్టి పెద్దగా అరిచాడు. ఉహుం. ఎంతమొత్తుకున్నా ఆమె కదల్లేదు.

ఇహ మాకు విసుగు పుట్టింది భయం పోయి పట్టరానికోపం వచ్చింది. నా స్నేహితుల్లో ఒకడు నాతో "ఇలా కాదురా నాయనా, ఆ కొవ్వొత్తి తీసుకొచ్చి ఈమె వంటికి ముట్టించు. తిక్క కుదురుతుంది!" అన్నాడు. నేను అలాగే చేశాను ఆమెకు వళ్ళు చుర్రుమన్నదో ఏమో, కళ్లు తెరిచింది కాని సగమే తెరిచింది గుంటలుపడిన ఆకళ్లు బొరలుకమ్మి అసలు మాకు కనిపించనేలేదు.

"ముసిలిముండా! ఇప్పుడైనా సమాధానం చెపుతావా లేదా? ఎవరు నీవు?" అని గద్దించి అడిగాను.

అంతలోనే ఆ వృద్ధురాలి అరవిచ్చిన కళ్లు వాటంతటి అవే మూసుకపోయినాయి.

"అలాకాదురా, ఈమాటు చర్మం లేచేటట్లు ఆ కొవ్వొత్తి ముట్టించు" అన్నాడు మరల నా స్నేహితుడు. ఈమాటు కొవ్వొత్తి ఆమె గడ్డాని తాకించాను. అప్పుడా ముసల్ది మెల్లగా కళ్ళు తెరిచింది. ఈసారి బాగా తెరిచింది. మాఅందర్ని-ఒకరి తరువాత ఒక

రిని పరీక్షగా చూచింది అంతలోనే చల్లని నిశ్వాసం వదలి తల ప్రక్కకు వాల్చేసింది. నా చేతిలో కొవ్వొత్తి ఆరిపోయింది. అప్పుడా చీకట్లో ఎవరో తన పండ్లతో నా చేతిని కొరికినట్లనిపించింది.

నేను భయంతో వణికిపోతూ నిద్ర లేచాను. వళ్ళంతా చెమటలు పోశాయి. నా ప్రక్కమీద కాళ్ళకట్ట దిక్కున జైలు తాలూకు మతగురువు కూర్చుని ఉన్నాడు. ప్రార్థనగ్రంథం పఠిస్తున్నాడు.

"నేను చాలా సేపు నిద్రపోయానా స్వామీ ?" అని ఆయన్ను అడిగాను.

"నాయనా! నీవు గంటసేపటిబట్టీ నిద్ర పోతున్నావు. వాళ్ళు మీ అమ్మాయిని ఇక్కడికి తీసుకొచ్చారు. నిన్ను నిద్రలేపవద్దని చెప్పాను. అందుకని ఆ ప్రక్కగదిలో నీకోసం కనిపెట్టుకొని ఉన్నారు." అన్నాడాయన.

"మా అమ్మాయి - మా అమ్మాయి మేరీ వచ్చిందా! నా చిట్టితల్లిని వాళ్లు నాకు చూపించడానికి తీసుకొచ్చారా ?" అని నివ్వెరపోతూ అడిగాను.

40

మేరీ-నా బంగారం తల్లి! ఎంత బావుంటుందని, ఎంత ముద్దుగా, ముచ్చటగా ఉంటుందని! ఎంతోచక్కగా ముస్తాబుగూడా చేసుకుంది.

మేరీని తీసుకుని ఎత్తుకున్నాను. తొడ మీద కూచోబెట్టుకున్నాను. తనివితీర ముద్దాడాను

వాళ్ళమ్మకూడా వచ్చినట్లయితే ఎంత బావుండేది! నా భ్రమకాని - ఆవిడ ఎలా వస్తుంది ? ఆవిడ జబ్బుతో మంచంపట్టి ఉంటుంది. వృద్ధురాలైన మాఅమ్మ అసలే లేవలేని స్థితిలో ఉంటుంది-వాళ్ళు రాకపోవడమే ఒకవిధంగా మంచిదిలే.

మేరీ నావంక అదోలా - నివ్వెరపోతూ చూచింది నాదగ్గర ఏమాత్రం కొత్త చెయ్యలేదు. నేను తల నిమురుతున్నా, పదేపదే ముద్దాడుతున్నా,- ఏంచేస్తున్నా నాచిట్టి తల్లి ఏడ్వలేదు. కాని అవతల - కొంచెం ఎడంగా, మూలన నిలుచుని కంటతడి పెడుతున్న దాదివంక మధ్యమధ్య బిక్కముఖం పెట్టి చూడసాగింది. చివరకు నా చిట్టితల్లిని పలకరించాను.

"మేరీ!, నా చిట్టితల్లీ !"

ఇలాఅంటూ బాధాపరితప్తమైన నా హృదయానికి హత్తుకున్నాను.

మేరీ ఎవరో కొట్టినట్లు ఏడ్చింది.

"ఊ, ఊఁ! ఎందుకండీ నన్ను కొడతారు? నాకు నొప్పి అవుతున్నది!" అన్నది.

'అండీ' అట! నన్ను 'అండీ' అని పిలుస్తున్నది! అవును. మేరీ నన్నుచూచి దాదాపు సంవత్సరమైంది నన్నాపిల్లి గుర్తుపట్టలేదు. నాముఖం, నారూపం, నా కంఠస్వరం; అన్నీ మరిచిపోయింది. అయినా ఇంత పొడుగున గడ్డం పెంచుకుని, ఈజైలు దుస్తుల్లో మారురూపు పడిఉన్న నన్ను ఆ చంటిపిల్ల ఎలా గుర్తిస్తుంది? ఏమిటీ! ఎవరైతే నన్ను కలకాలం జ్ఞాపకం ఉంచుకోవాలనుకున్నానో ఆమేరీ అప్పుడే నన్ను మరిచిపోయిందా! కన్న తండ్రినే గుర్తించలేకపోయిందా? ఇహామీదట నేనా పిల్లకు తండ్రిని కానన్నేనా? నన్నామె 'నాన్నా!' అని పిలవన్లేనా ?

అయ్యో, భగవంతుడా! నలభై పండ్లు బ్రతికి, సంసారంచేసి, మమకారం పెట్టుకొని, కన్నకుమార్తెచేత 'నాన్నా!' అని పిలిపించుకునే యోగం లేకపోవడం - ఇంతకంటె దురదృష్టకరమైన విషయం ఏముంటుంది ?

"అమ్మాయీ, మేరీ! నా కొక్కమాట చెప్పమ్మా-నీవు నిజంగా నన్ను ఎరగవా ?" మేరీ రెండుచేతులూ నా చేతుల్లోకి తీసుకొని అడిగాను.

మేరీ తన సుందర నయనాలతో నావంక చూచింది.

"ఉహుఁ, ఎరగను" అని జవాబు చెప్పింది.

"మళ్ళీ చూడమ్మా, నన్ను బాగా చూచి చెప్పు. నన్ను ఎరుగుదువా లేదా?"

"ఉహుఁ. ఎరగనంటే. మీరెవరో కొత్త మనుషులు."

అయ్యో, భగవంతుడా! నేను ప్రపంచంలో ప్రేమించిన ప్రాణి అల్లా ఒక్కటే - మేరీ. అట్లాంటి మేరీ నేనెవరో తెలియకుండానే నా ఒడిలో కూచుని, నన్ను చూస్తూ, నాతో మాట్లాడుతున్నది! చావుకు సిద్ధమై ఉన్న నన్ను ఓదార్చగలిగింది ఆ అమ్మాయి మాటఒక్కటే- నేనెవరోచెప్పడం!

"అమ్మాయీ, మేరీ! నీకు నాన్న ఉన్నాడా అమ్మా?" అని అడిగాను.

"ఆఁ, ఉన్నాడండీ." అన్నది మేరీ.

"సరే, ఎక్కడున్నాడమ్మా?"

మేరీ పుచ్చపూలలా కళ్ళు తెరిచి, నివ్వెరపోతూ చూచింది.

"అయ్యో, మీకు తెలియదూ? మానాన్న చచ్చిపొయ్యాడు." అన్నది.

ఇలా అని వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"చచ్చిపోయాడా! ... మేరీ! చావడమంటే ఏమిటో నీకు తెలుసునా తల్లీ?" అని అడిగాను.

"తెలుసునండీ చచ్చినవాళ్ళను పూడ్చిపెడతారు. వాళ్ళటా - పైకి ఎక్కడికో పోతారట!" అన్నది మేరీ. ఇలా అని మళ్ళీ నేను అడగకుండానే చెప్పసాగింది. "నేను రోజూ, రేపూ మాపూ, మా అమ్మ ఒడిలో కూచుని మానాన్నకు పుణ్యం కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తుంటాను."

నేను మేరీ ముఖాన్ని ముద్దు పెట్టుకున్నాను.

"మేరీ! నీవు దేవుణ్ణి ఏమని ప్రార్థిస్తావో చెప్పు తల్లీ"

"ఉహుఁ, నేను చెప్పను. ఎప్పుడుబడితే అప్పుడు ప్రార్థన చదవకూడదండీ. మా అమ్మ చెప్పింది. కావాలంటే ఇవాళ మాపటికి మా ఇంటికి రండి. చదివి వినిపిస్తాను."

"సరే, సరే, చెప్పొద్దులే" అని ఒక క్షణం ఊరుకున్నాను.

తరువాత "అమ్మాయీ, మేరీ! నేనేనమ్మా మీ నాన్నను." అన్నాను.

"ఆఁ, నిజంగా!"

"అవునమ్మా. నన్ను 'నాన్నా' అని పిలవడం నీ కిష్టంలేదా?"

మేరీ ముఖం ప్రక్కకు తిప్పుకున్నది. "కాదు. మా నాన్న మీలాగా ఉండడు. మీ కంటె బాగా ఉంటాడు." అన్నది.

నేను మళ్ళీ మేరీని పిచ్చిగా ముద్దులాడాను. ఆ పిల్ల ఏడుస్తూ, నా చేతుల్లోనుంచి తప్పించుకపోవడానికి ప్రయత్నించింది.

"నీ గడ్డం గుచ్చుకుంటున్నది. నాకు నొప్పి పుడుతున్నదయ్యా" అన్నది.

తరువాత నేను మేరీని మోకాళ్ళపైన కూచోపెట్టుకున్నాను

"మేరీ! నీకు చదువువచ్చునా అమ్మా?" అని అడిగాను.

"ఆఁ, వచ్చు మా అమ్మ చెప్పగా నేర్చుకున్నాను."

"సరే,ఏదీ, చదువూచూద్దాం" అన్నాను, ఆ పిల్ల తన చేతిలో నలిపి పట్టుకున్న ఒక కాగితాన్ని చూపిస్తూ మేరీ చదవనన్నట్లు తల తిప్పింది

"ఉహుఁ. చిన్న చిన్న, పిట్టకథలైతేనే నేను చదవగలను." అన్నది.

"అయినా ప్రయత్నించు, చదువుతావేమో, ఏదీ, చూచి చదువు"

మేరీ తన చేతిలోఉన్న కాగితాన్ని విప్పి తీసి పట్టుకున్నది. వ్రేలితో ఒక్కొక్క అక్షరం చూపుతూ - మెల్లిగా చదవసాగింది.

"ఉ...ఉ...రి...శి...క్షి...క్ష."

ఒక్కొక్క అక్షరం చదివింది.

మేరీ చేతుల్లోనుంచి ఆ కాగితం తీసుకున్నాను. అది నా ఉరిశిక్షకు సంబంధించిన కాగితం. దాది ఒక అరపెన్నీ ఇచ్చి ఆ కాగితం కొనుక్కొచ్చిందట! నా శిరస్సు సహస్ర వక్కలైనట్లనిపించింది. తీవ్రమైన నా ముఖ కవళికలు, నా ఉద్వేగం, ఆ పసిపిల్లకు భయం కలిగించాయి. ఏడ్వడం మొదలుపెట్టింది.

"నా కాగితం నాకు తిరిగి యిచ్చెయ్యి. నేను దాంతో ఆడుకోవాలి!" అన్నది మేరీ. ఆ కాగితాన్ని నేను దాది చేతికిచ్చాను

"ఇక అమ్మాయిని తీసుకెళ్లు" అని చెప్పాను.

తిరిగి కుర్చీలో వాలిపోయాను. శోకం. దైన్యం, అసహాయత, అధైర్యం, అన్నీ నన్ను ఆవరించాయి. నా హృదయంలోని ఆఖరు తంతువులుకూడా తెగిపోయాయి. ఇహ ఏం సంభవించినా, స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను.

41

మతగురువు దయార్ద్ర హృదయుడు. నా ప్రక్కన ఉన్న కాపలావాడు కూడా అలాంటివాడే. మా అమ్మాయి మేరీని తీసుకపోయారని నేను చెప్పినప్పుడు వారిరువురి నేత్రాలూ అశ్రుపూరితాలైనాయి.

అయిపోయింది. అంతా అయిపోయింది! ఇహ ఇప్పుడు నేను మనస్సును రాయి చేసుకోవాలి. ఉరి తీసేవాడు,బండీ, రక్షకభటులు వంతెనమీద, బాట కిరుపైపుల,ద్వారాలలో, కిటికీలలో మూగిఉండే జనసమూహం, 'డీ గ్రేవ్'లో నాకు ఏం జరుగనున్నదీ-వీటిని గురించి మాత్రమే ఇహ నేను తలపోయవలసి ఉంది. వీటన్నిటిని గురించి ఆలోచించడానికీ, అలవాటు పడడానికి నా కింకా ఒక గంట వ్యవధి ఉంది.

42

అంతా నవ్వుతారు. కేకలు పెడతారు. చప్పట్లు కొడతారు. ఉరితీయడం చూడడమంటే అందరికీ అంత ఉత్సాహం, అంత ఉద్వేగం, అంత ఆనందం! గాని ఆ గుంపులో కనీసం ఒకరిద్దరికైనా ఎప్పుడో ఒకప్పుడు ఇదే దుర్గతి పడుతుంది! నాతలకు మల్లేనే వాళ్ళ తలా అక్కడ తెగి పడుతుంది. కాని వాళ్ళకా విషయం తెలియదు పాపం.

నన్ను చూడడానికి వచ్చేవారిలో కనీసం ఒకరిద్దరికైనా ఏనాడో ఒకనాడు ఉరిశిక్ష పడకతప్పదు. అదీ ఈదేశ దౌర్భాగ్యం.ఎక్కడెక్కడి నదులూ సముద్రంలో కలిసినట్లు ఎక్కడెక్కడి అదృష్టహీనులూ ఈ 'డీ గ్రేవ్' లో కలుస్తారు ఇదొక వల. పురుగు దీపం చుట్టూ తిరిగి తిరిగి చివరికా దీపానికే ఆహుతి ఆయిపోయినట్లు, వీరంతా తిరిగి తిరిగి చివరికీ వలలోనే పడతారు!

43

నా చిట్టితల్లి, మేరీ!

మేరీని తిరిగి తీసుకపోయారు. బండిలో వెడుతూ వెడుతూ ఆ అమ్మాయి కిటికీలో నుంచి ఈ జనసమూహాన్ని చూస్తుంటుంది. తాను 'ఏమండీ' అని పిలిచిన ఈ క్రొత్తవ్యక్తినిగురించి ఇహ ఆ పిల్ల అనుకోనే అనుకోదు.

ఆ అమ్మాయికోసం మరికొన్ని పేజీలు వ్రాయడానికి నాకింకా కొద్ది వ్యవధి ఉంది. ఆమె పెరిగి పెద్దదైన తరువాత, ఏదో ఒక నాడు, నేను వ్రాసిన ఈ పేజీలు చదవవచ్చు

అవును. నేను నాకథను ఆమెకు చెప్పడం ఎంతో అవసరం.

44

నా కథ

సంపాదకుని సూచన : పై శీర్షిక క్రింద వ్రాసిన పొరటలు మాకు దొరకలేదు. బహుశా అది వ్రాసేటందుకు నేరస్థుడికి తగినంత వ్యవధి లేకపోయిందేమో. అది వ్రాయాలన్న ఆలోచన అతనికి వచ్చేసరికే వ్యవధి మించిపోయి ఉంటుంది.

45

పురమందిరంలో...

పురమందిరం...చివరకు నేనందులో ప్రవేశించాను, భయంకరమైన ప్రయాణం ముగిసింది. ఆ "ప్రదేశం" అదిగో - అగుపిస్తూనే ఉంది. కిటికీక్రింద అంతులేని జన సమూహం పోగయి, కేకలూ పెడబొబ్బలూ పెడుతూ నాకోసం కనిపెట్టుకొని ఉంది.

నేను ఎంత నిబ్బరంగా ఉండాలనుకున్నా ఉండలేక పోతున్నాను ధైర్యం చెడుతున్నది. ఉరికంబాన్ని - దానిమీద రెపరెపలాడుతున్న నల్లటి గుడ్డలను చూచేసరికి నా గుండెలు జారిపోయినాయి. నేను నా కడసారి విజ్ఞప్తిచేయాలనుకున్నాను. వాళ్లునన్నిక్కడ వదిలి 'పబ్లిక్ ప్రాసిక్యూటర్' కోసంవెళ్ళారు. నేనాయనకోసం వేచి ఉన్నాను.

తరువాత జరిగింది ఇది· మూడు గంటలు కొట్టారు. సమయం ఆసన్నమైందని చెప్పశానికి వాళ్ళు నాదగ్గరికి వచ్చారు. నేను గడిచిన ఆరుగంటలబట్టీ, ఆరు వారాలబట్టీ, ఆరు మాసాలబట్టీ- ఈ విషయాన్ని గురించి ఆలోచిస్తున్నప్పటికీ - ఎంచేతనో అప్పుడు నాకీ విషయం అనుకోని విషయంగా అనిపించింది.

వాళ్ళు నన్ను నడవలలోనుంచి, మెట్ల వరుసలమీదినుంచి నడిపించుకుని తీసుకెళ్లారు. క్రింద అగాధంలా ఉన్న ఒక చిన్న గదిలోకి నెట్టారు. ఆగది చీకటికోన. అంతా తడీ, దుర్గంధమూను. ఒక చిన్నదీపం మినుకు మినుకుమంటున్నది మధ్యలో ఒక కుర్చీ ఉంది. వాళ్ళు నన్నక్కడ కూచోమన్నారు. నేను కూచున్నాను

తలుపుదగ్గర, గోడప్రక్కన కొందరు వ్యక్తులు నిలవబడి • ఉన్నారు. మతగురువు, రక్షకభటులు కాక, మరో ముగ్గురు వ్యక్తులు. ఆ ముగ్గురిలో మొదటివాడు పొడుగ్గా, ప్రభల్లే ఉన్నాడు వృద్ధుడు. బలిష్టుడు.ముఖం ఎర్రగా ఉంది. ఉన్నికోటు వేసుకున్నాడు. ముక్కోణాకృతిగల 'హేటు' పెట్టుకున్నాడు. అతనే ఉరితీసేవాడు - గంభ్రడగోడ్డలి ధరించిన తలారివాడు! తక్కిన ఇరువురూ అతనికి సహాయులు.

ఆ ఇరువురూ ఎప్పుడు నా వెనకాలకు వచ్చారో వచ్చారు పిల్లుల్లాగ వచ్చి అటొకరు ఇటొకరు నన్ను పట్టుకొని చెవులదాకా ఉన్న నా జుట్టును కత్తిరించడం మొదలు పెట్టారు. చెరిపగపడ కత్తిరించిన తరువాత గాని నాకు తెలియలేదు.

నా జుట్టు కత్తిరిస్తుంటే అది కుప్పలు కుప్పలు నా బుజాలమీద వచ్చిపడింది. తలారివాడు తన కర్కశ హస్తంతో మెల్లిగా ఆ వెంట్రుకలన్నీ తుడిచివేశాడు

బయట కోలాహలంగా ఉంది. చెలరేగిన జనసమ్మర్దం సముద్ర ఘోషలా ఉన్నదా ధ్వని. ఒకటే నవ్వులు, అరుపులు, కేకలు.

ఒక కిటికీచెంత ఒక యువకుడు పెన్సలు తీసుకొని 'నోట్‌బుక్'లో ఏదో వ్రాసుకుంటున్నాడు. నన్ను చూపిస్తూ అక్కడున్న కాపలావానితో "ఏమిటి వాళ్లుచేసేది?" అని అడిగాడు. అప్పుడు కాపలావాడు "ఉరితీయబడే మనిషికి ముస్తాబు చేస్తున్నారయ్యా, కనిపించడం లేదూ?" అని సమాధానం చెప్పాడు.

ఈ విషయాలన్నీ అమరుసటిరోజు వార్తాపత్రికలలో ప్రచురింపబడతాయని నాకు తెలుసు.

హఠాత్తుగా ఒకతను నాకోటు తీసివేశాడు. మరొకతను నా రెండురెక్కలు పుచ్చుకొని వెనక్కు విరిచి పట్టుకున్నాడు. సన్నటి మోకుతో కట్టేశాడు. తరువాత నా మెడకుగల 'టై' తీసివేశాడు. ఇహ ఇప్పుడు నా ఒంటిమీద ఒకచొక్కామాత్రమే ఉన్నది. ఎంతో కాలంబట్టీ నేను తొడుక్కుంటూ వచ్చిన పాత 'పాప్లిన్'చొక్కా. తరువాత అతను నా 'కాలరు' కత్తిరించడం మొదలు

పెట్టాడు ఆ కత్తెర నాగొంతును ఎక్కడ కత్తిరిస్తుందో అని నేను వణికిపోతున్నాను కత్తెర నా మెడకు తగలనే తగిలింది. చర్మం లేచివచ్చినట్టనిపించింది 'అబ్బా' అన్నాను. అంతలో తలారివాడు "మిస్టర్! మన్నించు. నొప్పి అయిందా?" అని ఒడ్డుకున్నాడు.

బయట జనంచేసే గోల మరింత ఎక్కువైంది తలారివాడు 'ద్రాక్షాసారాయం'లో ముంచిన చేరుమాలు నా కందించి వాసన చూడమన్నాడు,

"క్షమించండి, వద్దు. అంత అవసరంలేదు నేను బాగానే ఉన్నాను" అని చెప్పాను.

పిమ్మట ఒక తలారివాడు వంగి ఒక నులకత్రాడుతో నా రెండు కాళ్లూ దగ్గరగా పెట్టి కట్టివేశాడు. నేను మెల్లిగా, అడుగులో అడుగు వేసుకుంటూ నడవడానికి వీలుగా చేశాడు. ఆ తరువాత కోటు నా వంటిమీద కప్పి, చొక్కా అంచులు దగ్గరిగా ముడి వేశాడు

అప్పుడు 'శిలువగుర్తు' పట్టుకొని మతగురువు వచ్చాడు

"ఇహ మనం వెడదాం నాయనా!" అన్నాడు.

ఇరువురు తలవరులు నన్ను పట్టుకుని లేవతీశారు నేను మెల్లిగా నడవసాగాను. కాని కాళ్లు తడబడుతున్నాయి. వళ్ళంతా వణికిపోతున్నది.

ఈ సమయంలో బయటితలుపులు రెండు తెరచుకున్నాయి. సుడిగాలిలోనికి దూసుకుని వచ్చినట్లుగా, ఒక్కపెట్టున జనసమూహం లోని ధ్వనులన్నీ లోన ప్రవేశించాయి. వెలుగుకూడా వచ్చింది. అక్కడ కుడితట్టు కొందరు సైనికులు గుర్రాలు ఎక్కి వరుసగా నిలుచుని ఉన్నారు.ఎడమతట్టు యూనిఫారాలతో పోలీసులు బందోబస్తులో నిలుచున్నారు, అక్కడ ఒక శకటంకూడా ఉన్నది. శకటానికి ఒక నిచ్చెన అనించి నిలుచోబెట్టారు. అబ్బ! ఈ దృశ్యాలన్నీ ఎంత భయంకరంగా ఉన్నాయి!

ఎంత నిభాయించుకుందా మన్నా ధైర్యం నిలిచేటట్లులేదు రెండడుగులు వేశాను. వాకిట్లో నిలుచున్నాను.

'అదుగో, అదుగో! ఎల్లాగైతేనేం వచ్చాడురా చివరకు!' అని జనంలోనుంచి అరుపులు వినిపించాయి. నాకు చేరువగా కొందరు చప్పట్లు కొట్టడం మొదలుపెట్టారు. ఒక ప్రసిద్ధుడైన రాకుమారుడు దర్శనమిస్తే ఎంత ఉత్సాహంగా ఉంటారో అంత ఉత్సాహంగా ఉన్నారు జనం!

శకటం మామూలుగానే ఉంది. దానికి రెండు గుర్రాలు ముందు బండితోలేవాడు కూచున్నాడు. నీలిరంగు చొక్కా వేసుకున్నాడు.

మొట్టమొదట పొడుగ్గా ఉన్న తలారివాడు బండ్లో ఎక్కాడు

"గుడ్‌మార్నింగ్ మిస్టర్, శామ్సన్!" అంటూ పిల్లలు కేకలుపెట్టారు. తరువాత అతని అనుచరుడు ఎక్కాడు

"హో, హో, హూ, హూ, హోయి.హోయి. నేడే మంగళవారం - నేరస్థుల సంహారం!" అని మళ్ళీ పిల్లలు పాటపాడారు

తరువాత నావంతు వచ్చింది. నిబ్బరంగా అడుగుపెట్టి బండ్లో ఎక్కాను.

"గట్టివాడే ఫరవాలేదు,తట్టుకుంటాడు!" అన్నది, పోలీసుల ప్రక్కనిలుచున్న ఒక స్త్రీ.

వారంతా ఇలా నన్ను మెచ్చుకుంటోంటే నాకూ కొంత ధైర్యం వచ్చింది. తరువాత మతగురువు వచ్చి నాప్రక్కన కూచున్నాడు. నేను బండికి వెనకవైపున, వెనకతట్టు మళ్ళీ కూచున్నాను.

ఒకమాటు చుట్టూ కలయచూచాను. ముందూ - వెనకా పోలీసువాళ్ళు తరువాత జనసమూహం, మళ్ళీ జనం, ఆపైనకూడా జనం, - ఈ విధంగా ఆ ప్రాంతమంతా జన

సమూహం ఒక అంతులేని మహా ప్రవాహంలా అగుపిస్తున్నది.

అశ్వారోహకులైన సైనికుల జట్టు ఒకటి నాకోసం భవనం గేటువద్ద వేచిఉన్నది.

ఒక ఉద్యోగి ఉత్తర్వు ఇచ్చాడు సపరివారంగా శకటం కదిలింది. జనంలోనుంచి అరుపులు, కేకలు మిన్నుముట్టాయి.

మేము గేటుదాటాం. శకటం, పాంట్ - అవ్ - ఛాంజ్' వైపుకు మళ్ళింది. అప్పుడా ప్రాంతమంతా, కాలిబాటలపైన, వంతెనల మీద, ఇండ్లముందు, ఇండ్ల పైకప్పులపైన. అంతటా జనం, నేల ఈనినట్లు కనుపిస్తున్నారు. ఆ కోలాహలానికి భూమి నెఱియలు విచ్చుతుందా అనిపించింది!

ధరణి కంపించిపోతున్నట్లుంది. అశ్వారోహకులైన సైనికదళం అక్కడే మమ్ములను కలుసుకున్నది.

"టోపీలు తీయండి, టోపీలు తీయండి!" అని వేలాదిజనం అరిచారు, ఒక మహారాజ కుమారుడు దర్శన మిచ్చినట్లుగా.

ఇదంతా చూచి నాలో నేను ఒక వికారపునవ్వు నవ్వుకున్నాను.

"వాళ్లేమో టోపీలు తీస్తారు, నాకేమో తలతీస్తారు!" అన్నాను, మతగురువుతో.

మేము మరల సాగిపోయాం. పూల మార్కెట్టువద్దకు వచ్చాం. అక్కడ రకరకాల పూలవాసనలు విరజిమ్ముతున్నాయి. పూలు అమ్మేవారంతా తమ దుకాణాలు వదలి నన్ను చూడడానికి పరుగెత్తుకుంటూ వచ్చారు.

భవనానికి మూలగా నున్న నచ్చదరపు గోపురంవద్దకు వచ్చేముందు - దానికి కొంచెం ఎదురుమళ్ళగా కొన్ని పూరిండ్లున్నాయి అక్కడివారు, కుర్చీలు, బల్లలు, స్టాండ్లు - ఇవన్నీ అద్దెలకిస్తూ ఉంటారు. మేం అక్కడికి వచ్చేసరికి ఆ ఇండ్లలోనుంచి - ముఖ్యంగా స్త్రీలు తండోపతండాలుగా - వచ్చి వాకిళ్ళలో నలుచున్నారు.

మానవరక్తంతో కూడా వ్యాపారంచేసే యీ నికృష్టులు "ఏమయ్యోయ్, ఎవరికైనా కుర్చీలు కావాలా?" అని బిగ్గరగా కేకలు పెట్టారు.

వాళ్ళ ప్రవర్తనకు నావళ్లు భగ్గున మండింది, "నన్నెవరైనా అద్దెకు పుచ్చుకుంటారా?" అని అనాలనిపించింది.

మా శకటం ముందుకు సాగిపోయింది. అడుగడుగునా ఒక సర్పగండంలా ఉంది. అంతులేని జనసమూహాన్ని చీల్చుకుంటూ మేం సాగిపోతున్నాం.

'పాంట్ - అవ్ - ఛాంజ్'ను చేరబోతుండగా నేను తలవనితలంపుగా కుడితట్టు వెనక్కి తిరిగి చూచాను. కొండకు ఆవలివైపు ఒక పెద్ద నల్లటి గోపురం కనుపించింది. దానిపైన నల్లటి, భూతాలవంటి రెండు విగ్రహాలున్నాయి. అదేమిటని మతగురువును అడిగాను

"సెయింట్ జాక్విస్ - లా - బౌషిరీ -" అని చెప్పాడు తలవరి.

అప్పటికి వాన ప్రారంభమైంది. పెద్ద జల్లు 'పాంట్ - అవ్ - ఛాంజ్' దరిదాపుల్లోకి వెళ్ళేసరికి మేము ముందుకు సాగిపోవడమే కష్టమనిపించింది. అక్కడ అంత ఎక్కువగా ఉంది జనసమ్మర్దం. మాశకటాన్ని కదలనివ్వడమేలేదు. నాకు తగని భయం పుట్టింది. అదే తరుణంలో - వాళ్ళందర్నీ తన్ని అవతలకి పంపించాలని - పట్టరాని కోపంకూడా వచ్చింది చావనున్న వాడికోపం బక్కకోపం! తరువాత నేను నా చుట్టూ ఏం జరుగుతున్నా, నాకంట ఏది పడుతున్నా - సమస్తం మరిచిపోయి ఒక సమాధిలో ఉన్నట్లుండిపోయాను.

'శిలువగుర్తు' తీసుకుని ముద్దాడాను.

"ఈశ్వరా! ప్రభూ! నన్ను కరుణించు!" అని ప్రార్థించుకున్నాను.

మధ్య మధ్య బండీ ఎత్తెత్తి వేస్తున్నది. ఆ కుదుపు నాకెంతో బాధ కలిగిస్తున్నది.

దానికితోడు వాన, ఈదురుగాలి, నా బట్టలు కూడా తడిసిపోయాయి. "నాయనా! చలికి వణుకుతున్నట్లున్నావే?" అని అడిగాడు మతగురువు "అవును బాబుగారూ! ఒక్క చలేకాదు" అన్నాను

వంతెన దాటుతుండగా కొందరు స్త్రీలు నన్ను చూచి "అయ్యో, పాపం! చాలా చిన్నవాడే!" అని నొచ్చుకున్నారు ఇప్పుడు మేమూ భయంకరమైన ప్రదేశానికి చేరబోతున్నాం. నేనుకంటితో చూడడంలేదు. చెవితో వినడంలేదు ఏదో మైకంలో మునిగిపోయాను

మతగురువు పట్టుకునిఉన్న శిలువగుర్తుపై దృష్టి నిగుడ్చడానికి ప్రయత్నించాను. కాని మధ్య మధ్య అప్రయత్నంగా అటూ ఇటూ తలత్రిప్పి సాగాను, తలతిరుగుడు రోగం పుట్టినట్లు. కాని పక్షవాతం వచ్చినవాడిలా నేనెటూ కదలలేక పోతున్నాను శకటంకదిలిపోతున్నది. నేనేదో కలలో ఉన్నట్లున్నాను. అకస్మాత్తుగా మరింత ఎక్కువ జనసందడి వినిపించింది ఒకటే అరుపులు కేకలు,-గోల! ఉరికంబం నాకంట పడింది "ధైర్యంగా ఉండు నాయనా!" అన్నాడు మతగురువు, నాతో మెల్లగా. శకటం ఆగింది. ఒకనిచ్చెన తెచ్చిపెట్టారు మతగురువు నా రెక్కపుచ్చుకున్నాడు. నేను బండిదిగాను. ఒకఅడుగువేశాను. రెండో అడుగు వెయ్యబోయాను. ఉహుఁ - నావల్లకాలేదు. రెండు ఎత్తయిన స్తంభాలమధ్య ఉరికొయ్య నాకు దృగ్గోచరమైంది.

నాకు తల గిర్రున తిరిగిపోయింది. నిలవద్రొక్కుకున్నాను "నేనొక వాఙ్మూలం ఇవ్వాలి." అన్నాను, సన్నని గొంతుతో.

వాళ్లు నన్నిక్కడికి తీసుకొచ్చారు. నా అంతిమ సందేశం వ్రాస్తానన్నాను. వాళ్ళు నాచేతి బంధాలను ఊడదీశారు.

46

ఆయన జడ్జీయో, పోలీసు సూపర్నెంటో, లేక మేజిస్ట్రేటో-నాకు తెలీదు కాని, ఎవరో ఒకాయన వచ్చాడు. నేను గభాలున ఆయన కాళ్ళమీదపడి నా శిక్ష నిలుపుచెయ్యవలసిందని ప్రార్థించాను. "అంతేనా నీవు చెప్పవలసినది?" అని అడిగాడాయన, ఒక విషపునవ్వు నవ్వి

"అవును. నాశిక్ష నిలుపుచెయ్యండి, మీకు పుణ్యముంటుంది ఒక్క అయిదు నిముషాలైనాఆపండి!" అంటూ పదేపదే వేడుకొన్నాను.

ఏమో, ఎవరికి తెలుసు? ఆపుచెయ్యమని ఉత్తర్వువస్తే రావచ్చు. అసలలాంటి ఉత్తర్వులు ఎప్పుడూ ఆఖరు క్షణంలోనే వస్తాయి. అవును, అప్పుడే, ఇంత చిన్నవయస్సులో ఎలా చనిపోను? అయినా శిక్ష ఆపుచెయ్యమని అడగడానికి నాకంటె అర్హులు ఎవరున్నారు కనుక?

అయ్యో, భగవంతుడా! భయంకరమైన ఆ తలారివాడు రానేవచ్చాడు! 'ఫలానా' నిముషంలో ఉరిశిక్ష అమలు జరగవలసిఉందని మేజిస్ట్రేట్‌తో చెప్పడానికి వచ్చాడతను. ఇంకేం? ఆక్షణం రానేవచ్చింది. ఇహ ఆ కార్యం సక్రమంగా నెరవేర్చవలసిన బాధ్యత అతనిదే పైగా వాన కురుస్తున్నది. ఉరి తీసేటప్పుడు తప్పిపోయే ప్రమాదం ఉన్నది.

అయ్యో, నన్ను కరుణించండి! ఇంకాఒక్క నిముషం ఉన్నది. నాశిక్ష నిలుపు చెయ్యమని తాఖీదు వస్తుందేమో కాసేపు చూడండి. లేదా నా తరఫున ప్లీడర్ను పెట్టుకొని కేసు విచారణ జరిపించుకుంటాను కేసు కొట్టేస్తారేమో శాయశక్తులా పోరాడతానయ్యా!

అయ్యో, భగవంతుడా! ఎక్కడి జనం ఇది! చెవులు చిల్లులు పడేటట్లు ఏమి అరుస్తున్నారా దేవుడా!

నాశిక్ష తప్పిపోతుందేమో, నేను తప్పించుకుంటానేమో ఎవ్వరెరుగుదురు? మరి నా శిక్ష ఆపుచేసే విషయం...? అది ఇలలో.. కలలోకూడా జరగదు.

అయ్యో, పరమేశ్వరా! క్రూరులు, దుర్మార్గులు, పుండాకోర్లు!... నేను ఉరికంబం ఎక్కుతున్నాను...

నాలుగు గంటలవేళ...

సమాప్తం

మన దేశంలోని విశిష్ట చిత్రకారులు

శ్రీ వేలూరి రాధాకృష్ణ

౨

మన ఆంధ్రులలో పరిణత నందినవారు శ్రీ అంట్యాకుల పైడిరాజుగారు. మొదటినుంచీ నియమబద్ధమైన 'శాస్త్రీయ' చిత్రకళాశాలలో చెప్పేరీతిన చిత్రరచన చేస్తూ ఒక్కమాటుగా జానపద శైలిని ఉద్ధరించినవారిలో ప్రముఖులయ్యారు. ఆంధ్రదేశానికి చెందిన జానపద శైలిలో అనేక అమూల్యములైన చిత్రాలను రచించారు, అందులోనూ ఎక్కువ పేరెన్నిక గన్నవి తెలుగింట జరిగే 'పేరంటం' ను ప్రదర్శించే చిత్రం, 'భగ్నవీణ', 'చెమ్మచెక్క' 'బజారుకి' 'తిలకం'అనే చిత్రాలు. వీటిలోని రూపురేఖల వన్నెచిన్నెలూ, ఆంధ్రవనిత ప్రత్యేకతా కానవస్తవి. వీరి చిత్రాలు దేశదేశాలలోనూ మంచిపేరును గడించి పెట్టినవి. వీరితో పాటు స్వతంత్ర పోకడలను కనబర్చిన శ్రీ హోతా వెంకటరామ గోపాల్‌గారి విషయం చెప్పకతప్పదు. మొట్టమొదటిసారిగా 'లేపాక్షి' ని సందర్శించి అక్కడి చిత్రాల నకళ్ళను ప్రకటించిన విశిష్టత ఈయనకే దక్కుతుంది. కేవలం జానపద శైలినే అంటిపెట్టకొనకుండా మరనేక రీతులలో సాధనచేస్తూ, అనేక స్వతంత్రరచనలు చేశారీయన, వీరి 'పున్నమినాటి చందమామ' 'తెలుగునాడు' మొదలైనవి వ్యక్తిగత విశేషత్వాన్ని కనబరుస్తవి. శ్రీ కె. శ్రీనివాసులు మరియొక ప్రముఖ ఆంధ్రచిత్రకారుడు. ఇతడుకూడా ఆంధ్రజానపద శైలిలో, సాంకేతికంగా అనేక రచనలుచేసి పేరుపొందాడు. ఇతడి 'కీలుబొమ్మలు' 'గోపాలుడు' మొదలైన చిత్రాలు ప్రశంసాపాత్రమైనవి.

శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తి శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తిగార్లూ ఆంధ్ర చిత్రకళకి అసమాన సేవచేసిన విశిష్ట వ్యక్తులు. వీరు రచించిన చిత్రాలలోని రూపాలు, తెలియని సామీప్యతని కనబరుస్తవి. కొంతకాలంవరకూ ప్రాచ్య, ఆధ్యాత్మిక శైలిలో రచించిన శ్రీ నరసింహమూర్తి. ఆంధ్రజానపద శైలిలోకి తమ రచనలను మార్చి, కొన్ని ప్రశంసా పాత్రమైన చిత్రాలను రచించారు.

తెలంగాణా చిత్రకారులలో శ్రీ కొండపల్లి శేషగిరిరావు, శ్రీ కె. రాజయ్య ముఖ్యులు. వీరిద్దరూ వ్యక్తిగత విశేషాలతో అనేక ప్రశంసాపూర్వక చిత్రాలను రచించారు. శ్రీ రాజయ్య చిత్రాలు జానపద శైలిలో వేసినవి. ఇతని 'గృహోన్ముఖులు' మంచి ప్రశంసా పాత్రమైన చిత్రం, శ్రీ శేషగిరిరావు చిత్రాలలో ఒక తెలియని వేగం ఆయా రేఖారీతుల్లోనే కాక రంగులలోకూడా కనిపిస్తుంది. చంగుచంగున గంతు వేసే లేడి వేగాన్ని ఒక్కమాటే విస్తరింపజేసిన రంగులోనే కనబరుస్తాడీయన. ఎక్కువ అలంకరణ విధానం ఇందులో కనిపించదు. చైనాచిత్రాలలోని రీతిని ఇతడు అవలంబించినప్పటికీ అనుకరణమాత్రం లేదు.

ఉత్తర ప్రదేశ్‌కి చెందిన మరియొక విశిష్ట చిత్రకారుడు శ్రీ కృపాల్‌సింగ్ సెఖావల్‌ను గురించి రెండుమాటలు చెప్పక తప్పదు. ఇతడు మొగల్ రాజపుత్రి చిత్రశైలులను మేళవించి, తన స్వకీయమైన శైలిని ఏర్పాటు చేసుకున్నాడు, అతిసూక్ష్మమైన అలంకరణా విధానం ఇతని చిత్రాలలో కానవస్తుంది. ఆకాశంలోని మేఘంనుంచి, క్రింద భూమిమీద మొలచిన గడ్డిపోచ, దానికి పూసిన గడ్డిపూవు వరకూ ఇతడు ఒకే ప్రత్యేకతతో రచిస్తాడు.

ఇక చివరిసారిగా పంజాబు రాష్ట్రానికి చెందిన చిత్రకారుడు శ్రీ సతీశ్ గుజరాల్‌ని గురించి చెప్పిముగిస్తాను. ఇతడు రచించిన చిత్రాలన్నీ ఏదోఒక ప్రత్యేకసందేశాన్ని తెలియజేస్తున్నట్లు కనిపిస్తవి. ఇతడు విదేశాలలో చిత్రవిద్య నభ్యసించి అక్కడి రచనా శైలులలోని విశిష్ట లక్షణాలన్నిటినీ చాలా బాగుగా అలవర్చుకున్నదిట్ట. ఇతని రచనల్లో అనుకరణ

విధానం కానరాదు. నేను ఈ మధ్య ఢిల్లీలో జరిగిన చిత్రకళా ప్రదర్శనంలో ఇతని చిత్రాలను చూడటం సంభవించింది. ఆరంగులలోని తేజస్సు నన్ను అరికట్టింది. ఆ రంగుకు సంబంధించిన వెలుగుకాక, ఏదో ఒక లోకాతీత మైన వింతవెలుగును తెచ్చుకొని కంటి నరికట్టినది. ఇతని ఎరుపురంగు, వంగపండురంగు, నీలం, ఆకుపచ్చ రంగూ, అన్నీ తమ సహజత్వాన్ని వీడి ఒక వింత తేజస్సును తెచ్చుకొని మనకు కనిపిస్తవి. ఇతని శైలి భిత్తి శైలివలె ఉంటుంది. ఎక్కువ తైలవర్ణాలలోనే చిత్రాలను రచిస్తాడు. ఇతడిచ్చే సందేశం చాలా గంభీరమైనదీ, ఆధ్యాత్మికమైనదీను ఈవిధంగా మన చిత్రకారులంతా కలిసి చిత్రకళలో మంచి యన్నది పెంచి, విజాతీయమైనదానిని మినహాయించి కలకాలం చెప్పుకొనేటట్లుగా, భారతీయకళకు క్రొత్త సరిక్రొత్త రీతులను జోడించి స్వచ్ఛందశైలిని పెంపొందించవలసిందిగా హెచ్చరించటానికి సాహసిస్తున్నాను.

★

శ్రీమదాంధ్ర వేదాంత పంచదశి

[మహాభూత వివేక ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

దేహములును దేహులును జాతియును వ్యక్తి
గుణములును ద్రవ్యములు వేఱులు నయినట్లు
ఆకసము సత్పదార్థము సన్యముఁగు
ఇందు నాశ్చర్య మనునది యేమిలేదు.

ఆ సదాకాశములు వేఱు లగును గాక
మనసునకు నిశ్చయము కల్గదనెదు వేని
ఇందు సందియమును దీరదందు వొక్కొ-
చిత్త మేకాగ్రభావముఁ జెందలేద?

ధ్యానమువలన వేద ప్రమాణమునను
సద్వియద్భేదమించు నిశ్చయముగాగ
ఆకసం బెప్పటికిని సత్యంబుగాదు
సత్పదార్థ మెప్పటి కాకసంబు కాదు.

చిత్తమేమి యేకాగ్రతఁ జెందదేని
మనన మొనరించి యేకాగ్రతను వహింపు
అనుభవంబున వేదవాక్యములచేత
సంశయము తీరి, భేద నిశ్చయము కల్గు.

జ్ఞాని యజ్ఞానివలె నాకసంబు గనిన
అదియు శూన్యంబుగనె తోచు ననవరతము
అల్లై సత్పదార్థంబును ననవరతము
జ్ఞానికిని నఖిల వ్యాపకముగఁ దోచు.

పూర్వపున్ వాసనలు వృద్ధి పొందుచుండ
ఆకసమె సత్యమనువాని నఖిలముఁ బర
మాత్మగఁ దెలియకుండిన యట్టి వాని
గాంచి బుధులు విస్మయమును గాంచుచుంద్రు.

అట్లు లాకాశ మిథ్యాత్వ మట్లు సత్ప
దార్థ సత్యత్వమును దృఢత్వమ్ము నొంద
ఇట్టి యుక్తులచేతను ఎల్ల భూత
ములకు సద్వస్తు వన్యమై పొలుచుగాత.

సత్పదార్థ మందేక దేశంబునందు
మాయయుండును, అల్లై ఆ మాయయందు
ఆకసమునుండు, నల్లై యా యాకసమున
నేక దేశాన వాయువు నెసగుచుండు.

స్పర్శనమును వేగమును శోషణము గతియు
వాయుధర్మంబులుగ వచింపంగఁ బడియె
సత్తునకు మాయకును నాకసంబునకును
నుండు తద్గుణత్రయము వాయువునకుండు

వాయు వుండెననగ సత్స్వభావ మగును
అనిలమును సత్స్వభావమునందు వేఱు
సేయ నేర్పడు శూన్యమే మాయయగును
అనిలమునఁగల శబ్దమే యాకసమగు

అఖిలముల సత్పదార్థము నావరించు
అఖిలముల నాకసంబు లేదంటి వీవు
ఆకసం బిప్పు డనిలము నావరించు
నందు నియ్యది వైరుధ్య మగునుగాదె?

ఆకసముకుండు నవకాశ మన్యభూత
ములకు లేదంటి, నాకాశమునకు గల్గు
ధ్వనియె యితర భూతంబుల నెనయునంటి
నిందులో వచోవ్యాఘాత మేమొచెపుమ,

వ్యోమపు స్వరూప మది యన్యభూతములను
అనుసరింపదటంటిమి గుణము ననుస
రింప దంచును మేము వచింపలేదు
భేదము గుణరూపములకు లేదె చెపుమ.

అట్టి సద్వస్తువున కన్యమైన కతన
వాయువున కసద్రూపము వచ్చునేని
అనిల మవ్యక్తమగు మాయ కన్యమైన
వ్యక్తమైన వాయువును మాయయన వలదె?

ఏది వాస్తవంబునకును లేదొ, యదియ
మాయ యనియును వ్యవహరింపఁగ బడెడు
వ్యక్తమనియును నవ్యక్తమనియుఁ జెప్ప
నైన కార్యశక్తులును నిరాత్మకములె.

సత్పదార్థ మెయ్యదియొ యసత్పదార్థ
మెయ్యదియొ ప్రకృతమునందు నెంచబడెడు
అయ్యసత్పదార్థంబున యందు నున్న
వ్యక్త మవ్యక్తములతోడ వలయు నెద్ది.

కలదనుచుఁ జెప్పఁబడెడు భాగంబె బ్రహ్మ
మగును, మిగులు నంశంబులె యనిలమగును
ఆకసముగ వాయువును మిథ్యయగు, నట్టి
వాయు మిథ్యాత్వము నెఱింగి వదలు దాని.

అనిలమున కంటెఁ దక్కువయగుచున్న
వహ్నిగూర్చి విచారింప వలయునిట్లె
ఎక్కువల దక్కువ లరయు నీ విచార
మయ్యజాండాల నుండు భూతాళియందె.

అగ్నివాయువునందు దశాంశమందు
మాయచేతనె కల్పితమగుచునుండు,
అట్లె భూతపంచకము నన్యోన్యముగ ద
శాంశముల కల్పనము పురాణాళినుండె.

అగ్నిహోత్ర ముష్ణము ప్రకాశాత్మకంబు
వహ్నిపుట్టుటకంటె పూర్వమున నందు
మాయ సద్వ్యోమ వాయు ధర్మమ్ములుండు
వహ్ని కలదన సత్స్వభావంబు నగును
సత్తునుండి భేదింప నసత్తు నగును
దానగల శబ్ద మాకాశ ధర్మమగును
దానగల స్పర్శన మనిల ధర్మమగును

సత్పదార్థ మాయాది కాంశములు గల్గు
వహ్ని సహజ గుణమ్ము రూపమ్ము సుమ్ము
అగ్నిలో సత్పదార్థము కన్యమైన
గుణములను బుద్ధిచే గనుగొనగ వలయు.

వహ్ని సత్తునుండి విభజింపఁగఁ బడగ
అగ్ని సద్భిన్నము నసత్యమగుట తెలియు
జలము కూడననలు దశాంశముగ నగ్ని
యందె మాయ కల్పితముగ నరయవలయు.

జలము సత్తునుండియు విభజన మొనర్ప
నదియు శూన్యము శబ్ద స్పర్శాదికంబు
కలిగి వియదాది ధర్మముల్ కలిగియుండు
జలమునై జగుణమ్ము రసమ్ము సుమ్ము.

జలము సత్తునుండియు విభజన మొనర్చి
అదియు వాస్తవంబుగ లేనిదనుచు దెలిసి
ఆ జలమునందు భూమి దశాంశముగను
మాయ కల్పితమని తలంపంగవలయు
ఎల్లసృష్టి కల్పన మనియే తలంపు.

భూమి సత్తునుండి విభాగమును బొనర్ప
దాన శూన్యంబు స్పర్శ శబ్దములు, రూప
మును రసంబును దద్గంధమును గలుగును
ధాత్రి సహజగుణమ్ము గంధమ్ము సుమ్ము.

సత్పదార్థమునున్ విభజన మొనర్ప
మేదినియు నసద్రూపమై మిగిలిపోవు
అవనిమధ్య మందున్న బ్రహ్మాండ, మవని
యందునను దశాంశంబయి నదిగ నుండు.

అట్టి బ్రహ్మాండ మధ్యమునందుఁ బదియు
నాలుగైన లోకంబులు గ్రాలుచుండు
అట్టి పదునాల్గు లోకములందు దేహి
దేహములు యథేష్టంబుగ దిరుగుచుండు.

అట్టి బ్రహ్మాండ లోకదేహములనుండి
సత్పదార్థమునున్ విభజన మొనర్ప
అయ్యవియు నసద్రూపములై ప్రకాశ
మందు, నవి ప్రకాశంబంద హాని యేమి?

భూత భౌతిక మాయ సంజాతముల య
సత్యతయుఁ జిత్తమందు నిశ్చయముగాగ
సత్పదార్థ మద్వైత నిశ్చయము కల్గు
బుద్ధి యెప్పుడేని విపర్యమును బొరయదు.

సత్పదార్థ మద్వయముకా సకలభూత
భౌతికములు వేర్వేఱుకా భూతలమున
ఎట్టి వ్యవహార లోపంబు నేమివలదు
సకల వ్యవహారములు సజ్జై జరుగదగును
అజ్ఞునకు జ్ఞానికిని నిశ్చయంబునందె
భేదమగు వ్యవహారాన లేదదేమి

సాంఖ్యకాణాద తార్కిక జైన బౌద్ధు
లెట్లు తమతమ యుక్తుల నీ ప్రపంచ
భేదముల నూహించి రవ్విధముగానె
ఈజగంబు తద్భేదాల నెసగుగాక.

తార్కికాదులచేత నద్వైతమతము
పలు విధముల నిరాకరింపంగఁ బడియె
అట్టి ద్వైత తిరస్కార మాచరించు
అస్మదాదుల కియ్యెడ హానియేమి?

ద్వైత నిరసన స్థిరముగాఁ దవిలెనేని
అద్వయపు బుద్ధి స్థిరమైన యట్టిదగును
అట్టి ద్వైత తిరస్కారమంది యుండు
నట్టి వాడె జీవన్ముక్తి నందువాడు

అట్టునుండ, బ్రాహ్మస్థితి యనగ నిదియ
దీనిఁజెందిన మోహంబుఁబూన డెందు
అంత్యకాలాన నీ స్థితియందునుండు
నట్టి వాడె మోక్షము బొందునట్టివాడు.

సత్యమగు బ్రహ్మమందు నసత్పదార్థ
మైన జగమందు సముమగునట్టి భ్రాంతి
యంత మొందుటయే యంతమగుసుగాని
తనువు నంత మొందుటయు నంతంబుగాదు

అట్లుగాక ప్రాణము వోవునట్టి కాల
మంత్యకాల మగుననగ నగునుగాక
అట్టి కాలమందునఁ బోయినట్టి భ్రాంతి
మరల నెన్నాళ్ళ కేనియు దిరిగిరాదు.

రోగహీనుడై కాని, కూర్చుండికాని
రోగియైకాని, భువిని దొర్లుచునుగాని
స్మారకము లేక విజ్ఞుండు చచ్చుగాక
జ్ఞానికేమి ద్వైతభ్రాంతి కలుగబోదు.

అనుదినము నధ్యయనము చేయబడు శ్రుతియు
స్వప్నమున సుషుప్తిని మరవంగఁబడిన
పరదినంబున జ్ఞప్తికి వచ్చునట్లు
జ్ఞాన మెన్నటికేని నాశంబుకాదు.

బ్రహ్మ విద్య వేదములచే ప్రభవమొందె
అది ప్రబల ప్రమాణములేక యంతరింప
దుపనిషత్ప్రమాణముకంటె నుర్వియందు
ప్రబలమైన ప్రమాణముం బడయబోము.

అందుచే వేద సంసిద్ధమైన యట్టి
ఆ సద ద్వైత మంతయు నందునేని
ఏయవాంతరమున నశియింపదదియు
భూత పంచవివేకంబె మోక్షమొసఁగు.

మహాభూత వివేక ప్రకరణము

స మా ప్త ము

ము ఖ్యా గ మ ని క

కొన్ని అనివార్యమైన కారణాలవల్ల మే నెలలో వెలువడవలసిన ఈ సంచిక, జూన్ నెల సంచికగా వెలువరిస్తున్నాం ఈ విధంగా అసౌకర్యం కలిగినందులకు నవభారతి పాఠకులు, చందాదారులు, ఏజంట్లను మన్నించవలసినదిగా కోరుతున్నాం.

ఈ సంచిక 30 వ పేజీలో ప్రకటించిన విజ్ఞప్తి ప్రకారం నవభారతి ద్వితీయసంవత్సరపు ప్రారంభసంచిక జూన్‌నుంచి కాక, జులై సంచికగా వెలువరించనున్నాం ఈ ముఖ్య వివరణను గమనించి, రచయితలు, చిత్రకారులు తమతమ అమూల్యరచనలను చిత్రములను జూన్ 20 వ తేదీలోగానే పంపి మాతో సహకరించ కోరుతున్నాం.

సం పా ద కు లు

వృద్ధగ్రీష్మము

శ్రీ శనగన నరసింహస్వామి ఎం ఏ.

ప్రళయశంకర ఫాలపావకీ శిఖలు
చెలరేగెనని జనమ్ములు కంప మంద
పులుకు పులుకున నిప్పులు గ్రక్కుకొనుచు
వచ్చె నైదాఘమ్ము వదనమ్ము తెఱచి.

పల్వలహ్రద సరోవరజలమ్మెల్ల
తనువెల్ల ముఖములై ధాత్రి కర్షింప
ఝషకూర్మ కర్కట జలచరోత్కరము
కైవర్తజఠరాంధు గర్భమ్ము జేరె

అరుణకర్కశ కరశరపాతభీతి
చాపమార్గణములు జాఱంగపఱచి
మల్లీమతల్లికావల్లీ గృహముల
దాగి మన్మథుడు శీతల సౌఖ్యమొందె.

నోరెండి తలమండి నురుగులు కార
ప్రజలు దాహార్తిసంభ్రమముతో జేర
పాంథార్థసిద్ధ ప్రపాతక్రధార
త్రావెనీరము నితాంతము దప్పితీర.

పవలెండమావులు ప్రవహించి యింకె
వేడిగాలులు వీచె విడువక రేల
నుదయాస్తగిరిధావనోత్థిత శ్రాంతి
బశ్చిమాంబుధిలోన బడె గర్మసాక్షి.

ఆంధ్రతర్కసంగ్రహము

అనుమానపరిచ్ఛేదము

శ్రీ కుప్పా బైరాగిశాస్త్రి

౬

మూ॥ అనుమితి కరణమనుమానం

నాలుగు ప్రమాణములలో మొదటి ప్రమాణమైన ప్రత్యక్షమును నిరూపించి రెండవ ప్రమాణమైన అనుమానమును చెప్పుచున్నారు. నీళ్ళుకాగు ప్రదేశమందు వంట యింటియందు యితర ప్రదేశములయందు నిప్పును పొగను చూచి పొగ, నిప్పుల సాహచర్యజ్ఞానమువలన (ఒకచోట ఉన్నవి అనుజ్ఞానమువలన) పొగ ఉన్నచోట నిప్పుఉండును అను (యత్రధూమః తత్రాగ్నిః) వ్యాప్తిజ్ఞానము కలవాడగును. తరువాత ఒకానొకప్పుడు పర్వతమువద్దకు పోయి ముందుగా పొగనుచూచి పొగఉన్న అన్ని ప్రదేశములయందు నిప్పుఉండును అను వ్యాప్తిస్మృతి కలుగగా అటువంటి వహ్నివ్యాప్యమైన ధూమము (పొగ) గలది పర్వతము అను పరామర్శజ్ఞానము కలుగును. తరువాత పర్వతము నిప్పుగలది అను అనుమితి కలుగును. పర్వతమందు నిప్పును చూడలేదు గాన ప్రత్యక్షము అని చెప్పగూడదు. పర్వతమందు నిప్పు ఉన్నదని తెలిసికొనెను. ఆ జ్ఞానమును అనుమితి యని అందురు. దానికి కారణము వహ్నివ్యాప్యధూమము కలది పర్వతము అను పరామర్శ ఆ పరామర్శకు పొగ ఉన్నచోట్ల యందు నియమముగా నిప్పుఉండును అను వహ్నివ్యాప్యోధూమః అను వ్యాప్తిజ్ఞానము కారణము. దీనినే అనుమానమనియందురు. పర్వతము నిప్పుగలది అను అనుమితిలో అనుమానము కరణము. పరామర్శ వ్యాపారము. అనుమితికరణ మనుమానం అను మూలములో అనుమితేః కరణం అని షష్ఠీ తత్పురుష సమాసము చెప్పుకొనవలయును. షష్ఠికినిరూపితత్వము అర్థము కరణపదమునకు అర్థమైన కరణతాశ్రయము అనుదానిలో ఒక భాగమైన కరణతయందు నిరూపితత్వము అన్వయించును, అనుమితి నిరూపితకరణతాశ్రయమైనది అనుమానము అను శాబ్దబోధవచ్చును. కరణత్వము వ్యాపారజనకమై అనుమితిత్వావచ్ఛిన్న కార్యతానిరూపిత కారణతాశ్రయమగుట. వహ్నివ్యాప్యోధూమః అను అనుమానమందు లక్షణసమన్వయము చేయవలయును. వహ్నివ్యాప్యమైన ధూమముకలది పర్వతము అను పరామర్శ అనుమానజన్యమై అనుమాన జన్యమైన అనుమితికి జనకమైనందున వ్యాపారము. ఆ పరామర్శకు జనకము అనుమానము అనుమితిత్వావచ్ఛిన్నమైన కార్యత అనగా పర్వతము నిప్పుగలది అను అనుమితియందు ఉన్నకార్యత తన్నిరూపితమైనకారణత అనుమానమందు ఉన్న కారణత తదాశ్రయత్వమున్నూ "వహ్నివ్యాప్యోధూమః" అనుఅనుమానమందుగలదు గనుక లక్షణసమన్వయము అయినది. వ్యాపారజనకమగుటయే లక్షణముగా చెప్పిన కాల, ఈశ్వర, అదృష్టాదులు కార్య సామాన్యమును గురించి కారణములుగాన అతివ్యాప్తివచ్చును. అనుమితిత్వావచ్ఛిన్న కార్యతానిరూపిత కారణతాశ్రయత్వము అని మాత్రమే చెప్పిన పరామర్శయందునను అతివ్యాప్తి వచ్చును అందుకు రెండుదళములు ఆవశ్యకములు

మూ॥ పరామర్శజన్యం జ్ఞాన మనుమితిః.

పరామర్శజన్యమై జ్ఞానమగుట అనుమితికి లక్షణము. పరామర్శ జన్యమగుటయే లక్షణముగా చెప్పిన పరామర్శధ్వంసగూడా పరామర్శ జన్యమేగాన అందు అతివ్యాప్తి కేవలజ్ఞానత్వమే లక్షణముగా చెప్పిన ప్రత్యక్షాదులయందు అతివ్యాప్తి. అందుకొరకు రెండుదళములు అవసరములు.

మూ॥ వ్యాప్తివిశిష్ట పక్షధర్మతాజ్ఞానం పరామర్శః వహ్నివ్యాప్యధూమవా నయం పర్వతః ఇతి పరామర్శః తజ్జన్యం పర్వతో వహ్నిమానితి జ్ఞానం అనుమితిః.

అనుమితి లక్షణములో ఘటితమైన పరామర్శనుగురించి చెప్పుచున్నాడు. వ్యాప్తవిశిష్టమని. వ్యాప్త్యావిశిష్టం వ్యాప్తివిశిష్టం, పక్షధర్మతాయాః జ్ఞానంపక్షి ధర్మతాజ్ఞానంవ్యాప్తివిశిష్టం తత్ పక్షధర్మతాజ్ఞానంచ వ్యాప్తి విశిష్టపక్షధర్మతాజ్ఞానం అని సంస్కృత సమాసము, వ్యాప్త్యా విశిష్టం అను సమాసములో తృతీయకు ప్రకారతా నిరూపకత్వము అర్ధము. పక్షధర్మతాయాః జ్ఞానం అనుసమాసములో షష్ఠికి విషయత్వము అర్ధము. పక్షధర్మత అనగా పక్షసంబంధము. కర్మధారయ సమాసముచే సమసించు పదార్ధములకు అభేదము సంబంధము అందుచేత వ్యాప్తినిష్ఠ ప్రకారతా నిరూపకము పక్షసంబంధి నిష్ఠ విషయతా నిరూపకము అయిన జ్ఞానము పరామర్శ - వహ్నివ్యాప్య ధూమవాన్ వర్వతః అను జ్ఞానములో, పరవీతాంశలో, ధూమము ప్రకారము అనగా విశేషణము. ధూమాంశలో వ్యాప్తి విశేషణము. గాన వ్యాప్తి యందలి ప్రకారతచే నిరూపకము జ్ఞానము. పక్షమైన పర్వతములకు ధూమమునకు గల సంబంధము పక్షసంబంధము, అ సంబంధమందలి విషయతా నిరూపకమున్ను జ్ఞానమే. గాన వ్యాప్తియందలి ప్రకారతా నిరూపకమున్ను పక్షసంబంధమందలి విషయతా నిరూవకము అయి జ్ఞానమగుట పరామర్శకు లక్షణము. జ్ఞానత్వముమాత్రమేలక్షణముగాచెప్పిన యితర జ్ఞానాదులందుననూ, జ్ఞానత్వములేనిచో పరామర్శ సంస్కారమందుననూ, వ్యాప్తినిష్ఠప్రకారతా నిరూపకమగుట అను విశేషణము లేనిచో పర్వతోధూమవాన్ అను పక్షధర్మతా జ్ఞానమందుననూ, పక్షసంబంధ నిష్ఠవిషయతా నిరూపకమగుట అను విశేషణము లేనిచో వహ్నివ్యాప్యోధూమఃఅనుజ్ఞానమందునను అతి వ్యాప్తి వచ్చును. గనుక అన్ని విశేషణములు అవసరమే—

మూ॥ యత్ర యత్రధూమః తత్రాగ్ని రితిసాహచర్య నియమో వ్యాప్తిః—

పరామర్శ లక్షణఘటకమైన వ్యాప్తిని నిరూపించుచున్నారు. యత్రయత్రధూమః తత్ర అగ్నిః అనునది వ్యాప్తికి అభిలాపక శబ్దము. సాహచర్య నియమః అనునది వ్యాప్తికి లక్షణము. సాహచర్యనియమమనగా నియతసాహచర్యమని అర్ధము, నియతత్వం వ్యాపకత్వం సాహచర్యయన సామానాధి కరణ్యము- దేని వ్యాపకత్వము దేని సాహచర్యమనగా హేతు వ్యాపకసాధ్య సామానాధికరణ్యముఅనితేలును. వ్యాప్తము (అనగా వ్యాప్తి గలది) హేతువు గాన యీ లక్షణము వ్యాప్తమైన హేతువు యందు చూపవలయును. (పర్వతోవహ్నిమాన్ ధూమాత్) పర్వతము నిప్పుగలది పొగవలన అనుచోట పొగ అను కారణము (హేతువు) నందు లక్షణ సమన్వయము చేయవలయును, హేతువ్యాపక సాధ్యసామానాధికరణ్యమనగా, హేతువు ఉన్నదానియందు ఉన్న అభావమునకు ప్రతియోగి కానటువంటి సాధ్యాధికరణమందు ఉండుట. కారణము ఉన్న చోటు పర్వతము అచ్చట నిప్పు ఉన్నది. గాన నిప్పు లేకపోవుట అను నిప్పుయొక్క అభావము లేదు కుండలేదు అను అభావముఉన్నది. దానికి ప్రతియోగికుండ అప్రతియోగి యయిన సాధ్యము నిప్పు దానికి అధికరణము. పర్వతము అచ్చట ఉండుట ధూమమందు కలదు గాన సమన్వయమైనది ధూమము సద్ధేతువు గనుక దానియందు సమన్వయము కావలయును (పర్వతో దూమవాన్ వహ్నేః) పర్వతము పొగగలదు నిప్పువలన అనుచోట నిప్పు అను హేతువు అసద్ధేతువు దానియందు యీ చెప్పిన లక్షణము ఉండగూడదు. ఎటుల ఉండదో చూపించవలయును. కారణము నిప్పు. అది ఉన్నచోటు (అయోగోళకము) బాగుగా కాలినయినుముముక్క అచ్చట ఉన్న అభావము పొగయొక్క అభావము కాలినయినపముద్ద యందు పొగఉండదు. ఆ అభావమునకు ప్రగయోగి పొగ అప్రతియోగి సాధ్యమనగా పొగ

కాలేదు పర్వతోధూమవాన్ వహ్నేః అను చోట నిప్పు రూపహేతువునందు అతివ్యాప్తి రాదు. గాన హేతువు (కారణము) ఉన్నచోట ఉన్న అభావమునకు ప్రతియోగి కానటువంటి సాధ్యముయొక్క అధికరణమందు ఉండుట అని వ్యాప్తికి లక్షణము అని తేలుచున్నది.

మూ॥ వ్యాప్యస్య పర్వతాదివృత్తిత్వం పక్ష ధర్మతా.

వ్యాప్యము అనగా వ్యాప్తి గలది అని. అటు వంటిది హేతువు. ఆ హేతువు పర్వతాదుల యందు ఉండుట పక్షధర్మతయని చెప్పబడును.

మూ॥ అనుమానం ద్వివిధం స్వార్థం పరార్థంచేతి స్వార్థం స్వానుమితి హేతుః తథాహిస్వ యమేవ భూయోదర్శనేన యత్రధూమః తత్ర అగ్నిరితి మహానసాదౌ ధూమే వహ్నివ్యాప్తిం గృహీత్వాపర్వత సమీపంగతః తద్గతేచాగ్నే సందిహానః పర్వతే ధూమం పశ్యన్ వ్యాప్తిం స్మరతియత్ర ధూమస్త త్రాగ్నిరితి తదనన్త రం వహ్ని వ్యాప్యధూమవానయం పర్వతః ఇతిజ్ఞాన ముత్పద్యతే అయమేవ లింగపరా మర్శ ఇత్యుచ్యతే, తస్మాత్ పర్వతోవహ్ని మానిత్యనుమితి రుత్పద్యతే తదేతత్ స్వార్థా నుమానం.

అనుమానము స్వార్థానుమానము పరార్థాను మానమని రెండు విధములు. తనకు కలుగు అనుమతికి హేతువైనది స్వార్థానుమానము - అది ఎటులననగా- తను వంట ఇంటిలో అనేక పర్యాయములు పొగను నిప్పునుచూచుచు (ధూమమువహ్నివ్యాప్తము)పొగనిప్పుచేవ్యాప్త మయినది నిప్పుపొగఉన్నచోటవిధిగాఉండును, అను వ్యాప్తిని గ్రహించి ఒకానొకప్పుడు పర్వ తము వద్దకు వెళ్ళి యీ పర్వతమందు నిప్పు ఉన్నదా అను సందేహము కలిగి పర్వతమందు పొగను చూచి లోగడ తనకు కలిగిన వ్యాప్తిని (పొగ ఉన్నచోట్ల నిప్పు ఉండును) స్మరించి తరువాత నిప్పుచే వ్యాప్తమయిన ధూమము కలది యీ పర్వతము అను జ్ఞానము కలవా డగును. యీ జ్ఞానమే లింగపరామర్శ యని చెప్పబడుచున్నది. తరువాత పర్వతము నిప్పు గలది అను అనుమితి కలుగును. యీ అను మితికి హేతువైనది స్వార్థానుమానము అని చెప్పబడును.

మూ॥ యత్తు స్వయమేవ ధూమాదగ్నిమను మాయపరప్రతి పత్యర్థం పంచావయవవాక్యం ప్రయుక్తే తత్పరార్థానుమానం యథాపర్వతో వహ్నిమాన్, ధూమాత్ యోయో ధూమ వాన్ సోసో అగ్నిమాన్ యథామహానసః తథాచాయం తస్మాత్తథా ఇతి అనేన వాక్యేన ప్రతిపాదితాత్ లింగాత్ పరోప్యగ్నిం ప్రతి పద్యతే- ప్రతిజ్ఞాహే తూదాహరణోపనయని గమనాని పంచావయవాని పర్వతోవహ్నిమా నితి ప్రతిజ్ఞా, ధూమాదితి హేతుః యోయో ధూమవాన్ సోసోఅగ్నిరితి ఉదాహరణం తథాచాయం మితి ఉపనయః తస్మాత్తథేతిని గమనం స్వార్థానుమితి పరార్థానుమిత్యోః లింగ పరామర్శ ఏవకరణం తస్మాల్లింగ పరా మర్శో అనుమానం

ఒకానొకడు న్యయముగా పొగనుచూచి వహ్ని ఉన్నది అని అనుమితి గలవాడై యిత రుల జ్ఞానముకొరకు అయిదు అవయవములు గల న్యాయమును ప్రయోగించ పరార్థానుమాన మగును ఉదాహరణకు పర్వతము వహ్ని కలది. పొగవలన ఎచ్చట ఎచ్చట పొగ ఉండునో అచ్చటల్లా నిప్పు ఉండును. యిది గూడ అటువంటిదే. అందువలన నిప్పుకలది. ఈ అయిదు వాక్యములచేత ప్రతిపాదించబడిన హేతువువలన పరుడుగూడా పర్వతమందు నిప్పు ఉన్నది అని జ్ఞానము కలవాడగును. ప్రతిజ్ఞా, హేతువు, ఉదాహరణము,ఉపనయము నిగమనము అని అయిదు అవయవములు. పర్వతము నిప్పుగలది అని ప్రతిజ్ఞా, పొగ వలన అనినది హేతువు. ఎచ్చట ఎచ్చట పొగ ఉండునో అచ్చట నిప్పుఉండును అను నది ఉదాహరణము. ఇది అటువంటి నిప్పుతో వ్యాప్తమైన పొగగలది, అనునది ఉపనయము. ఆ కారణమువలన పర్వతము నిప్పుగలది అనునది నిగమనము స్వార్థానుమితి పరార్థాను మితులలో లింగ పరామర్శయే కరణము. ఆ కారణవలన లింగ పరామర్శయే అనుమానము.

మూ॥ లింగం త్రివిధం అన్వయ వ్యతిరేకి కేవ లాన్వయ కేవల వ్యతిరేకి చేతి, అన్వయేన

వ్యతిరేకేనచ వ్యాప్తిమదన్వయ వ్యతిరేకి. యథావహ్నౌసాధ్యే ధూమవత్వంయత్రతధూమః తత్రాగ్నిః యథామహానసః ఇతి అన్వయ వ్యాప్తి యత్రవహ్నిః నాస్తితత్ర ధూమోపి నాస్తి యథామహాహ్రదః ఇతివ్యతిరేక వ్యాప్తిః.

లింగము అన్వయ వ్యతిరేకి, కేవలాన్వయ కేవల వ్యతిరేకియని మూడువిధములు. లింగము అనగా హేతువు. పర్వతము నిప్పుగలది, పొగ వలన అనుచోట పొగఅను హేతువు అన్వయ వ్యతిరేకి. అన్వయవ్యాప్తి వ్యతిరేకవ్యాప్తి గలది అన్వయ వ్యతిరేకి అన్వయవ్యాప్తి అనగా అన్వయములు హేతుసాధ్యములు. వాట్లవాట్ల వ్యాప్తి హేతువు ఉన్నచోట ఉన్న అభావమునకు అప్రతియోగి యయిన సాధ్యముయొక్క అధికరణ మందు ఉండుట. ఎచట ఎచట పొగ ఉండునో అచట నిప్పు ఉండునుగాన పైచెప్పిన అన్వయ వ్యాప్తి పొగయందు ఉన్నది. ఎచట నిప్పు ఉండదో అచ్చట పొగగూడా ఉండదు. వ్యతిరేకములయినసాధ్యాభావ హేత్వాభావముల వ్యాప్తి వ్యతిరేకవ్యాప్తి సాధ్యాభావాధికరణమందున్న అభావమునకు అప్రతియోగి యయిన అభావమునకు ప్రతియోగి అగుట ప్రకృత స్థలములో నిప్పుయొక్క అభావమునకు అధికరణమైన నీటి మడుగుయందుఉన్న అభావము ఘటపటాదుల అభావము అప్రతియోగి యయిన అభావము పొగయొక్క అభావము.దానికి ప్రతియోగి పొగ. ప్రతియోగి అగుట పొగయందు ఉన్నందున వ్యతిరేక వ్యాప్తి కలుగుటయు వచ్చినది.

మూ॥ అన్వయమాత్ర వ్యాప్తికం కేవలాన్వయి యథాఘటోభిధేయః ప్రమేయత్వాత్ పటవత్ ఇత్యత్ర అభిధేయత్వ ప్రమేయత్వయోః వ్యతిరేకవ్యాప్తిః నాస్తిసర్వస్యాపి అభిధేయత్వాత్ ప్రమేయత్వాచ్చ

అన్వయవ్యాప్తి గలది వ్యతిరేక వ్యాప్తి లేనిది కేవలాన్వయి. కుండ అభిధేయము ప్రమేయమగుట వలన అను స్థలములో అభిధేయత్వము సాధ్యము ప్రమేయత్వము హేతువు. అభిధేయత్వ మనగా అభిధా విషయత్వము. అభిధా అనగా ఈశ్వరేచ్ఛ. ప్రతివస్తువు ఈశ్వరుని ఇచ్ఛలో విషయమే.అభిధేయత్వము అన్ని వస్తువులయందు ఉండును. ప్రమేయత్వ మనగా ప్రమా విషయత్వము. ప్రమా అనగా యథార్థ జ్ఞానము. సర్వము ఆ జ్ఞానములో విషయమే గాన అభిధేయత్వ ప్రమేయత్వ అభావములు అప్రసిద్ధములుగాన వాట్ల వ్యాప్తిరూప వ్యతిరేక వ్యాప్తి అప్రసిద్ధ మగుటచే వ్యతిరేక వ్యాప్తి లేదు. ఎచ్చట హేతురూప ప్రమేయత్వ మున్నదో అచ్చట సాధ్యరూప అభిధేయత్వ ముండుటచే హేతువయిన ప్రమేయత్వము యొక్క అధికరణమందు ఉన్న అభావమునకు అప్రతియోగియయినఅభిధేయత్వ రూపసాధ్యాధికరణమందు ఉండుట ప్రమేయత్వ రూప హేతువుయందు ఉండుటచేత కేవలాన్వయిత్వము. కుండ అభిధేయము ప్రమేయ మగుట వల్ల అనుచోట ప్రమేయ మగుటయందు ఉండుటచేత లక్షణ సమన్వయ మయినది.

మూ॥ వ్యతిరేక మాత్రవ్యాప్తికం కేవల వ్యతిరేకి యథాపృథివీ ఇతరేభ్యః భిద్యతే గంధవత్వాత్ యత్ఇతరేభ్యో భిద్యతే నతత్ గంధవత్ యథాజలంనచేయం తథా తస్మాన్న తథా. అత్రయత్ గంధవత్ తదితర భిన్నం ఇత్యన్వయ దృష్టాంతో నాస్తి సర్వస్యాపి పక్షత్వాత్.

వ్యతిరేకము లయిన సాధ్యాభావ హేత్వాభావముల వ్యాప్తికలిగి అన్వయములయిన హేతుసాధ్యముల వ్యాప్తిలేనిది కేవల వ్యతిరేకి.భూమి ఇతరములకంటె వేరయినది, గంధము కలవగుటవలన అనుచోట గంధము కలదగుట అను హేతువునందు అన్వయవ్యాప్తి లేదు, పక్షము భూమిగాన పక్షమందు సాధ్యసంశయము ఉండుటచేత ఎచ్చటహేతువో అచ్చట సాధ్యము అని దృష్టాంతము చెప్పుటకు వీలులేదు. దృష్టాంత మనగా సాధ్యనిశ్చయముఉన్నచోటు. అందుచే సాధ్యహేతువులయొక్క వ్యతిరేకముల వ్యాప్తిమాత్రమే వచ్చును. ఎచట సాధ్యమైన ఇతర భేదముయొక్క అభావము భూమ్యేతరముల అభావము అచట గంధాభావము. దృష్టాంతము జలము.

యే జలము పృథివీతరభేదము యొక్క అభావము కలదో అది గంధము కలదిగాదు. అనగా గంధాభావము కలది. ఈ భూమి అటు వంటిది గాదు. గంధాభావముకలదిగాదు అనగా గంధాభావా భావముకలది. గంధాభావాభావము గంధస్వరూపము గాన గంధము కలది. అందు చేత అనగా గంధాభావా భావము కలదగుట చేత గంధము కలదగుటచే అటువంటిదిగాదు. భూమ్యేతరముయొక్క అభావము యొక్క అభావము గలదిగాదు. భూమ్యేతరముయొక్క అభావము గలది.అని తేలుచున్నది సాధ్యా భావముయొక్క అధికరణము భూమ్యేతర భేదాభావముయొక్క అధికరణము జలము. అచ్చట ఉన్న అభావము గంధాభావముయొక్క అభావముగాదు. యితర అభావము దానికి అప్రతి యోగి. గంధాభావము దాని ప్రతియోగి అగుట గంధమందు ఉండుటచేత సాధ్యాభావాధికరణ మందు ఉన్న అభావమునకు అప్రతియోగి యయిన అభావప్రతియోగిత్వ రూపవ్యతిరేక వ్యాప్తి గంధరూపహేతువు యందు వచ్చుటచేత లక్షణసమన్వయమయినదని తాత్పర్యము.

మూ॥ సందిగ్ధసాధ్యవాన్ పక్షః యథాధూమ వత్త్వే హేతౌపర్వతః

పక్షధర్మతా జ్ఞానమనుచోట పక్షపదమునకు అర్థమును చెప్పుచున్నారు. ఎచట సాధ్యసంశ యము కలదో అది సపక్షము. పర్వతము వహ్నికలది అది సాధించు సమయములో పర్వతమందు నిప్పు ఉన్నది అను నిశ్చయము లేదు సంశయమే ఉన్నది. ఆ సంశయములో విశేష్యమగుట పర్వతమందు గలదు గాన సాధ్యసంశయములో విశేష్యమగుట పక్షము నకు లక్షణము సాధ్య సంశయమనగా పర్వ తము నిప్పుగలదా లేదా అనునది. ఆ సంశయ ములో విశేష్యము పర్వతముగాన సమన్వయ మయినది.

మూ॥ నిశ్చిత సాధ్యవాన్ సపక్షః యథా అత్రైవ మహానసః.

సాధ్యము విషయముగా గల నిశ్చయమందు విశేష్యమగుట సపక్షలక్షణము సాధ్యము విష యముగా గల నిశ్చయమనగా వంటయిల్లు నిప్పుగలది అను నిశ్చయము. అందులో విశే ష్యము వంటయిల్లు గాన సాధ్యవిషయక నిశ్చ య విశేష్యత్వము వంటియింటిలో వచ్చుటచే సమన్వయమయినది.

మూ॥ నిశ్చిత సాధ్యాభావవాన్ విపక్షః యథా అత్రైవ మహాహ్రదః

సాధ్యాభావమువిషయముగాగల నిశ్చయంలో విశేష్యమగుట విపక్షమునకు లక్షణము .పర్వ తము నిప్పుగలది. పొగవలన అనుచోట సాధ్యా భావము విషయముగా గల నిశ్చయమనగా నీరు నిప్పులేనిది అను నిశ్చయము అందులో విశే ష్యము నీరు. విశేష్యమగుట నీటియందుగలదు గాన విపక్షమైన నీటియందు సమన్వయమైనది.

ఇంతటితో మంచి హేతువుల నిరూపణ అయినది.

గోవిందరామాయణము

అహల్యా శాప విమోచనము

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు

ఏమిది సద్గురూ యెచటి కిప్పుడు వచ్చితిమయ్యో? తెల్పు మీ
యే మహనీయు నాశ్రమమి దిట్టులు శూన్యము రమ్యమయ్యెము
న్నే మునిసత్తముండు వసియించెఁ బురాతన దృశ్యముండె నీ
ధామము నిర్జనమ్మయి ప్రధానముగా శిలలున్న వేలొకో

అనునృపసూతి కాముని మహాత్ముఁడు వాక్యవిశారదుండనున్
విను రఘురామచంద్ర వినిపింతు వినందగు దివౌకండ, వీ
వని మును గౌతమాశ్రమము బ్రహ్మఋషీంద్రుఁడు గౌతముండె యిం
దునఁ దపముండి పూనె బహుదుస్తర దుర్భర బ్రహ్మచర్యమున్.

సరసిజ సంభవుండు కడుఁజక్కని చుక్క నహల్య భామినిన్
సురల కపూర్వమైన బహుసుందరినిన్ సృజియించి ముందుగా
ధరణినిఁజుట్టి రాఁగలుగు ధన్యున కిచ్చెదనంచుఁ బల్కనా
సురపతిగూడ నీపుడమిఁ జుట్టఁగఁ బూనె నహల్యఁ బొందఁగన్.

సురపతి, రాకమున్నె కడుచోద్యముగా బహుశాస్త్ర వేదియౌ
ధరణిసురుండు గౌతముఁడు తన్విని బొందెను గోప్రదక్షిణం
బరయఁగ భూప్రదక్షిణమె యౌటను దానొనరించి యట్లు సుం
దరిఁ గవఁగూడి యాతఁడిటఁ దాపసియై చరియించుచుండఁగా.

వేయి కన్నులవాఁడు విరహంబు లోఁబడి గౌతముండు లేని కాలమరసి
యతని వేషమూని యాశ్రమంబునజొచ్చి పల్కెనిట్లహల్య ప్రమదమొంద.

తరుణీ! సుందరి! మోహనాంగి! వలపున్ దాఁచంగ శక్యంబె యె
వ్వరికైనన్, నినుఁగోరి వచ్చితిని నెవ్వారిందు లేరిప్పుడే
సురతిన్ దన్పఁగదే యథేచ్ఛగ, మనస్సున్ దాతురే కాముకుల్
వెరపేలా? ఋతుకాలమేల? రమణీ ప్రేమింతుఁ బ్రేమింపవే.

లలిత ప్రేమను చిందులాడ మనముల్లాసాబ్ధిలోఁ దూగనా
చెలి యీనాఁటికి వాంఛితార్థము లభించెన్గాదె యంచున్వెసన్
గలిసెన్ గామకళా మహావిభవు నాకస్త్రీవిలోలాత్ము పూ
విలుకానిన్ భజియించు సంభ్రమణ ముద్వేగించి రాపాడఁగన్.

గౌతము వేషధారి యిఁక గౌతముఁ డింటికి రాఁగలండు
ఖ్యాతుఁడ వీవు నేనో మునికాంతను రక్షణసేయు మిద్దరన్
జేతము నీ నిమిత్తమయి చేడ్పడు నెప్పుడు వీడిపోవఁగాఁ
జేతులురావు కాని యిఁకఁ జెల్లదు నీవిటనుండ శక్రుడా.

ఎంతతపంబు సేసితినొ యింతిరొ నీకయి పెక్కునాళ్లుగా
నింతకునింతె ప్రాప్తియొకొ యిద్దరకున్ విడుచుట్లు నిన్ను నీ
కాంతుఁడు వచ్చినన్ జెడుగు గల్గెడి నీనుడి నిశ్చయంబె యే
కాంతమునందుఁగన్ మొఱగఁగాఁగల వాఁడనుగాను ప్రేయసీ.

పోనీపోయెద, గౌతముండు, మునియున్ బూతాత్ముడున్, జూచినన్
నానీ మోహములన్ని యొక్కత్రుటిలో నాశమ్ము గావించు, నే
నే, నాకమ్మును వీడి యప్పుడపు డిక్లేవత్తు లోలాక్షి ని
న్నేనాడున్ మరపొందఁజాల, హృదిలో నేయుందు నీ వెప్పుడున్.

అనుచుం గౌఁగిలివీడి వేచుచును నేరైనం గనన్ వచ్చిరో
యని ముందున్ గనమోమునెత్తి యటులా యా మూలలన్ జూచుచున్
జనుచున్ వేగఁబరావృతాస్యుఁ డగుచున్ జంద్రాననన్ జూచుచున్
ధ్వని లేకుండగ మెల్లమెల్ల నడుచున్ వజ్రాయుధుం డత్తఱిన్.

గౌతముఁ డంత స్నాతుఁడయి కర్మలదీర్చి నదీతటంబునన్,
జేతుల దర్భలూని కడుశీఘ్రగతిన్ జ్వలితాగ్నిహోత్రుఁడో
యాతఁడనంగ వచ్చి వనినెట్టులొ దాఁటఁగఁ జూచునింద్రునిన్
గౌతమవేష మూనిన యకర్ముని జారునిగాంచె నుగ్రుఁడై.

ఏమిది వాసవా! సురల నేలెడివాఁడవ! ఆతతాయివా!
కామముచేత నాకె యపకారము సేసితివా త్వదండముల్
భూమికిఁ ద్రెళ్లుగాకయనఁ భూమిబడెన్ సురనాధు నండముల్
కాముకులైనవారి కడగండ్లిటు లుండవె యెంతవారికిన్.

అతని శపించి గౌతముఁ డహల్య కనున్, వనితా యిటుల్ దురా
గతమొనరించి నా, కెట్టులొ కన్నుల గంతలుగట్టఁ జూచితే
సతివని నిర్మలాత్మవని సాత్త్వికతత్త్వముగాంచి తంచునే
యతినయితిన్ శరీర సుఖమూరసి దుర్గతి నేఁడు పొందితే.

ఈవ్యభిచార దోషము సహింపఁగరానిది పూతచిత్తవై
సవ్యముగాఁ జరిపఁగల సాధ్వులు లేరొకొ వీలు చిక్కుచో
ద్రవ్యమొ తుచ్ఛమౌ సుఖమొ రాగమొ యెంచి చరింతు రొక్కొ నీ
కవ్వియ సౌఖ్యమీయఁ దగునంచుఁ దలంచితి దుష్టవైతివే.

కులమపకీర్తి పాల్పడఁగఁ గోమలి యన్యుని బొందినావె, వ్యా
కులత ఘటించె, నాకుఁ బ్రతికూలము జేసినదాన, శాపమే
ఫలితము, పూర్వమైత్రి ననుఁబాయదు., చేయఁగలట్టిదేమి! నీ
విలదురితంబు వీడితరియింపఁ దలంతును దుష్టచారిణీ.

పొరబడితీ వటంచుఁ దలపోసితి, దుష్కర బ్రహ్మచర్యమున్
జరుపఁగలేక, నేరమిదె సల్పుటచేఁ బరితాప మొందినన్
గరుణమునన్ క్షమింపనగు, గాని, త్రుటిన్ బరితప్తచిత్తఁగా
మరలుట సాధ్యమా! యిటులమాన మొసంగిన నీకుఁ గామినీ.

ఏ రూపంబునఁ జేసి, నిన్ను సురలోకేశుండు కామించెనో
యారూపంబు దొలంగుఁగాక; యిఁక నేయాహారముం గొంటనీ
వారీతిన్ జెడినావొ కామమున, నయ్యాహార శూన్యంబుగా
నీరాయిన్ సరిపోలి, రేల్పవలు నట్లే యుండుమా, దుర్మతీ

ఆతపశీత వాయువు లహర్నిశలున్ మెయిసోఁక నిద్రయున్
భీతియు భూతియున్ విడిచి పెద్దయుఁగాలము తప్తచిత్తవై
చేతులుమోడ్చి ప్రార్థనము సేయుదుగాక రమేశుఁగూర్చి నీ
చేతము వీతరాగమగు సిద్ధిని బొందెడి దాఁక దుర్మతీ.

ఈవని నా మహాశ్రమమిదే చెడు, శూన్యము నిర్జనమ్మునై
నీవొకదానవే జగతి నెవ్వరి కండ్లకు గానరాకయే
త్రోవయు లేక బూడిద పరుండియె పాపము త్రోసివేయఁగా
దేవునిగూర్చి నిశ్చలమతిన్ దసియించెదుగాక దుర్మతీ

స్థిరమగు రాయివోలె నిటఁ దేజము రూపముమాపి నీవు దు
స్తర దురితంబు వాపుకొని తారణ మొందఁదపించుచుండఁగా
వరగుణ రామమూర్తి రఘువర్యుఁడు వచ్చెడు పాదచారియై
ధరణి సుతన్ బతివ్రతను, దాఁకగనఁబోయెడిమార్గమందునన్.

శ్రీమత్పాదరజమ్ము పేర్మినఘముల్ జెండాడు పద్మాక్షుఁడా
రాముం డెప్పుడువచ్చి యీ భయకరారామమ్మునం జొచ్చునో
రామా! యాక్షణమందె నీవు మరలన్ రమ్యాకృతిందాల్చి యా
రామాతిథ్యమునన్ బునీతవయి, చేరంగల్గు దంతన్ ననున్.

ఈవని నీదుపాపమున, దాసుకృతాకృతి వీడి, శూన్యమై
పోవునుగాదె యిద్దియును బూతమగున్ రఘురాము రాక, నే
నో, వసియింతు శీతగిరి సుగ్రతపంబున, నంతదాఁక వా
పోవుట చెల్లునా సుదతి బుద్ధియుఁ గర్మనుబట్టి పుట్టుగా.

నాసహ ధర్మచారిణివి, నాకిటు గోపము దెచ్చియుంట, నే
బాసితి శుద్ధవర్తనము వర్షసహస్రములెన్నొ దీక్షతోఁ
జేసిన నాతపమ్మిటులఁ జందరవందరయయ్యె నేఁడునిన్
గాసిలి దిట్టితిన్, జెడితిఁ గర్మకు జిక్కఁడె యెవ్వఁడేనియున్.

అని యా మౌని హిమాద్రికేఁగె సురలోకాధీశు నండద్వయం
బును డుల్లెన్ భువి, నంతనాతఁడు మహామోదమ్ము క్లేశమ్ములన్
గనుచున్ బోయిసురావళిన్ గలిసి స్వర్గంబింక శాంతంబునన్
మనఁ జెల్లున్ మునిశాప మిచ్చుటఁ దపోమాలిన్యముం బొందెఁగా

మీపని నెరవేర్చితిఁగాఁ
దాపసి కోపమ్ముకతన దగ్ధమొనర్చెన్
శాపము నిడి తన తపమును
నాపయి కరుణించి మీర లండము లిడరే.

అన శక్రుంగని దేవతల్ మురిసి బ్రహ్మానందముంజెంది వెం
టనె దోడ్తెచ్చి రజాండముల్, గొనుచు దోడన్‌వాని ఆతండు స
న్మని వాక్యంబున నల్లై నేఁడు మనెడిన్ బూతాత్మ దుష్టాత్మయై
వనిలో నున్నది శాపమోచన మొనర్పన్ నీకె గాఁజెల్లురా.

అని గాధేయుడు వల్క గౌతముని శాపార్ధమ్ము, రాముండు త
మ్ముని తోడన్ మునిఁగూడి యేఁగు వనికిన్, మోదమ్మొయాశ్చర్యమో,
కను దో యిన్వెలి బుచ్చకుండఁ దన విఖ్యాతిన్న మాలోకనం
బొనరింపం దలపోయకుండ, ద్రుటియేన్ మోమోటమిన్ జూపకే.

జానగు మోముతో విపులసారస నేత్రుఁడు శూన్యదుర్గమో
ద్యానవనిన్ బదమ్ము లిడెనంతఁ ద దంఘ్రిరజమ్ము రేగ రా
రా! నలినాక్ష! యోయఘ విరామ, పునీత పదాబ్జరామ! యన్
ధ్యానమునన్ శిలాప్రతిమ తారసిలెన్ భువిదొర్లి వచ్చుచున్

అంతంతన్, శిల రాము పాదయుగళం బంటున్, గనున్ గంప మిం
తింతన్, వీడుచు రూక్షమున్, వనితయై, యెంతో సురూపాంగియై
చింతన్ ద్రోయుచుఁ బద్మనేత్ర యగుచున్ సేవించుచున్ రామునిన్
గాంతారత్నము తప్తచిత్త గనియెన్ గాకుత్స్థు సాన్నిధ్యమున్.

రామజపామృతాబ్ధిఁబడి రాయిగ క్షాళిత పాపచిత్తయై
కోమలియై సురాసురులకున్ వశగాని ప్రచండ దీప్తయై
సోమనిభాంగయై వెలుగుమన్ బరిబూతగ బద్ధహస్తయై
భామ తదేక దృష్టిగనెఁ బావనరాము కృపేక్షణంబులన్.

శాపవిముక్తయై విమలశాశ్వత సౌఖ్యపరీత దేహయై
భూప తనూజ దర్శనవిభూతి నిరంతరలోక దృశ్యయై
తాపసి భార్య "పాహి" యని దాసివలెన్ నిలువన్ గృపాత్ములై
యా పరకార్యరక్తులు,నృపాత్మజులిద్దఱు మ్రొక్కిరామెకున్.

నీరామనామమే నిర్మలాహారమై
బ్రతికితి నిన్నేండ్లు భక్తవరద
నీరామనామమే నిరతపానీయమై
జీవమ్ముతోనుంటి దేవదేవ
నీరామనామమే నిరుపమ నిద్రయై
మనియుంటినే వేళ వనజనేత్ర
నీరామనామమే నిఖిల సౌఖ్యమ్మునై
గడపితినిన్నేండ్లు కమలనాథ

ఇనకులేశ్వర నీరాక కింతదనుక
భక్తనై వేచియుంటి నీభవ్యమందు
ప్రకృతిజిక్కివిరూపనై పరమపురుష
పడసియుంటిని స్వస్వరూపంబు నిపుడె.

చేయగరానితప్పిదముచేసితి భర్తకడున్ క్షమించి న
న్నీయపరాధగావ శపి యించెనినున్ గన, నీదురాకకై
యీయవతారమూర్తి తపముంటిని, నేఁబరితాపమొందితిన్,
గాయవిశుద్ధినొందనను గానవెగై కొనవే సపర్యలన్.

అర్ఘ్యంబొసంగనా యఘవిదూరకరామ
భక్తసంరక్షకా పాహిపాహి
పాద్యమర్పింతునా పరమాత్మరఘురామ
బ్రహ్మాదిసంస్తుత్య పాహిపాహి
ఆతిథ్యమిత్తునా యనుపమగుణరామ
వరదాత పరిపూర్ణ పాహిపాహి
హారతిబట్టనాయసు రారిజయరామ
వాసుదేవాహరీ పాహిపాహి

ఎంతదూరమునడిచితో యిటకురాఁగ
పరమపావన కమనీయ పాదయుగము
మెత్తగా హస్తములతోడి నొత్తనిమ్ము
పార్థివేయ కృపామూర్తి పాహిపాహి.

మాయామానుష విగ్రహా దశరథ క్ష్మానాథ పుత్రాగ్రణీ
ధ్యేయంబైనత్వదీయ విగ్రహమిటుల్ దీపించెనాముందు,నే
నోయీ ధన్యనుగాదె, నాబ్రదుకు యెంతో పూతమౌఁగాదె, నీ
కీయాకారముసార్థకం బగునె నన్నే బ్రోవలేకున్నచో

కోసలరాజపుత్రినినుఁ గూరిమిఁగాంచి తరించెబూజ్యయై
నాసరి గూడలేరు భువి నాయన దాశరథీనినున్ గనన్
వేసరి రెందఱోమునులు విశ్రుతయోగులు జ్ఞానవంతులున్
దాసికి నాకుఁజూపిన యుదారత యెవ్వరి కబ్బెనున్నిటుల్.

కల్యాత్మకమై మునుకు జనమార్గప్రాప్యపాథేయమై
కల్యంబై కవిరాడ్విరాషమయి, లోకత్రాణమై కర్మసా
ఫల్యంబై కలినాశహేతువయి, దేవా'రామనామంబెత
త్తుల్యంబేమియు లేకనిత్యమగుతన్ దృష్టిన్ ప్రసాదించుచున్

మంగళదాయక మాసతినాథా
సంగర వీర విశాంపతిపుత్రా
రంగదభంగ పరాక్రమధర్మా
మంగళ మయ్యెడి మానితకర్మా.

అని యహల్యభక్తి నారాచకొమరుల
మ్రొక్కిమ్రొక్కి గాంచిపూజసల్ప
మంగళమని పల్కమాఱుమ్రోఁగెనుదివి
మంగళమని నిత్యమంగళమని.

గౌతమపత్నియిట్లు పలుకన్ గడుమ్రోగెను దేవదుందుభుల్
శీతనగాశ్రితుండయినసిద్ధుఁడు గౌతముఁడంతయున్ గనెన్
బూత యహల్య యయ్యెనని పొందిమహాసుఖము న్వెసన్ వనిన్
బ్రీతిని జేరిరాఘవుల ప్రేముడిఁ బొంది తరించెనాతఁడున్.

*

డాక్టర్, కట్టమంచి రామలింగారెడ్డి ప్రణీత

కవిత్వతత్త్వవిచారము

శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి

[కీ. శే. డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగారు సుప్రసిద్ధులైన సాహితీవేత్తలు. ఆంధ్ర ఆంగ్లభాషాకోవిదులు. ఆంధ్ర విశ్వవిద్యాలయోపాధ్యక్షులుగాను, మైసూరు విశ్వవిద్యాలయోపాధ్యక్షులుగాను బహుకాలము పనిచేసి, సహృదయులుగను, సారస్వతజ్ఞులుగను విఖ్యాతికెక్కి, సాహితీ విద్యారంగములందు బహుముఖసేవ కావించినారు. వారు ఆంధ్రమున ఉత్తమ విమర్శన గ్రంథము లనేకము రచించినారు. వారు ప్రప్రథమముగా ప్రచురించిన 'ఆంధ్రకవిత్వ తత్త్వవిచారము' అను గ్రంథము తెలుగునాట బహుళ ప్రచారమును పొందుటయేగాక, పండితుల, విద్యాధికుల మన్నన లందుకొనినది. ఆ గ్రంథము డాక్టర్ రెడ్డిగారి సాహిత్య విమర్శన తత్త్వ విజ్ఞానమునకు, సర్వతోముఖ పాండిత్యమునకు నికషోపలము. అట్టి విమర్శనగ్రంథము యింతవరకు ఆంధ్రమున వెలువడలేదనుటయు యతిశయోక్తి కానేరదు. వారి గ్రంథములు, వ్యాసములు పలుమారు లాంధ్ర విశ్వవిద్యాలయమువారిచే ప్రచురితమై విద్యార్థులకు పాఠ్యగ్రంథము లవుతూ వచ్చినవి.

కాని అదేమి కర్మమో ప్రస్తుతము మన దేశములోని పెద్దల నిర్వచనములు, సూక్తులు వినినచో, అవి విడ్డూరముగా వికారముగా నుండుటయేకాక, వీరందరూ 'నేలవిడిచి సాము చేస్తున్నారా' యనిపిస్తుంది.

ఇటీవల శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారి సన్మాన సందర్భములో విజయవాడ పట్టణమందు జరిగిన సభావేదికనుండి మన ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నీలం సంజీవరెడ్డిగారు ఉపన్యసిస్తూ "డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగారు విజ్ఞానవంతులే కాని, వారు కలకాలము నిలిచే విజ్ఞానాన్ని ప్రచురించలేకపోయినారు. కాని శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు శాశ్వతముగా నిలిచే గ్రంథములను ప్రచురించినారు" అని వాక్రుచ్చినారు. ఈ యభిప్రాయ ప్రకటనను ఆనాటి సభలో వినినవారు అటుపిమ్మట పత్రికలలో చదువుకొనినవారు యేమనుకొనవలెను? ఇది సత్యమా లేక అసత్యమా? తెలిసి వెలిబుచ్చిన యభిప్రాయమా లేక తెలియక చేసిన ప్రకటనయా? కాక దీని వెనుక ఎవ్వరికీ ఎరుకపడని వ్యంగ్యమో, లేక అంతరార్థమో దాగి యున్నదా?

ఏమైనప్పటికీ - డాక్టర్ రెడ్డిగారి 'కవిత్వ తత్త్వ విచారము'నకు-అఖండ సాహితీపరులు ఆంధ్ర విశ్వకళా పరిషత్కళాశాలలో బహుకాలము సంస్కృత పండితులుగా పనిచేసినవారు అయిన శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు వ్రాసిన పీఠికను మా పత్రికాముఖమున ప్రచురిస్తున్నాము ఇయ్యది డాక్టర్ రెడ్డిగారి పాండిత్యమును, విమర్శన తత్త్వజ్ఞానమును తెలుసుకొనుటకుపయుక్తమగునని భావిస్తున్నాము. సం॥]

ఈకవిత్వతత్త్వ విచారమాంధ్రలోకమునకుఁ జిరపరిచితముగాని క్రొత్తదికాదు. ఆంగ్లవాఙ్మయ కోవిదులును సుప్రసిద్ధులనగు శ్రీయుత కట్టమంచి రామలింగారెడ్డిగారి యాంధ్రసాహిత్య సారజ్ఞతకు ఫలముగా, క్రీ. 1899 లో, వ్యాసరూపమున నవతరించి సభల మెప్పువడసి 1914 లో, వికసించి ప్రకాశించిన యీ కళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్న విమర్శనమందలి విషయ మింతకుమున్నె భాషాభిమానులు చక్కఁగా నెఱిఁగి యున్నను, శ్రీరెడ్డిగా రుపాధ్యక్షులుగా నున్న తఱి దీని నాంధ్ర విశ్వకళాపరిషత్తు

నకు సమర్పించియుండుటచేఁ బరిషద్వాశ మున నీ చిన్నపీఠిక వ్రాయవలసి వచ్చి నదికాని, నిజముగా నిది సిద్ధకథనమే.

పట్టుపట్టి చదువుకొని పండితుఁడైనఁ గావచ్చునుగాని కవియగుట కష్టము. ఎట్లో శ్రమపడి భాషాంతరీకరించియో, యనుకరించియో కవియైనఁ గావచ్చును గాని విమర్శకుఁడగుట యంతకంటెఁ గష్టము లోకజ్ఞుడై మృదుమధుర భాష లో నొక చక్కని భావ మిముడ్చునట్టి కవిదృష్టి యేకాగ్రమైనచో నతని కవిత్వము సరసమై పండిత పామరరంజక మగునుగాని లోకజ్ఞుడును బహు కవిభావజ్ఞుఁడునై యా కవిత్వమందలి మంచినో చెడ్డనో తెలుపఁబూను విమర్శకుని దృష్టి సర్వతోముఖమైనఁగాని యతని విమర్శనము సహృదయరంజకము కానేరదు. కావుననే కవిత్వముకంటె విమర్శనము కష్టతరమనుట.ఇట్లే శాస్త్రరచనముకంటె శాస్త్ర విమర్శనమును గష్టతరమగును.

సంస్కృతమందు శబరస్వామి శంకరాచార్యాది భాష్యకర్తలు స్వమత స్థాపన మునకై వివిధ శాస్త్రమతము లాకర్షించి కావించిన వివిధ విమర్శనములును, ఔచిత్య విచార చర్చా కావ్యప్రకాశ రసగంగాధరాది లక్షణగ్రంథములందు క్షేమేంద్ర మమ్మటభట్ట జగన్నాథ పండితరాజాదులు బహుగతులఁ గావించిన కథారస పాత్రాది విమర్శనములును, విద్వజ్జనరంజకములై వెలయుచున్నను, వారి వారి మతాభిమాన పాండిత్య విశేషాదులను బట్టి వాని త్రోవలు వేఱుగాఁ గనఁబడుటచే విమర్శనమున నొక నిర్దిష్టమైన పద్ధతి లేదనియు, అట్లుండుట సాధ్యముకూడఁ గాదనియుఁ దెలియవచ్చును. కావున విమర్శనము విమర్శకుని చిత్తవృత్తి నను సరించి యుండుననుట స్పష్టము. అయినను గుణము గుణముగాను, దోషము దోషముగాను వర్ణించుట యుత్తమ పద్ధతియనియు, గుణముమాత్రము ప్రకటించి దోషము గప్పిపుచ్చుట మధ్యమ పద్ధతియనియు, దోషముమాత్రము విశదీకరించి గుణము మఱుగుపఱుచుట యధమపద్ధతి యనియు, గుణమును దోషముగానో, దోషమును గుణముఁగానో వేల్లడించుట యధమాధమ పద్ధతియనియు లోకజ్ఞులు చెప్పుదురు. కొంత కాలము నుండి, తెలుఁగులో విమర్శనము లేదను లోపము తీర్చుటకోయన పోఁకకు పుట్టెఁడన్నట్లు వెడలుచున్న విమర్శనములలోఁ గొన్ని కడపటి మూఁడుపద్ధతుల కుదాహరణగా నున్నవని ప్రాజ్ఞలోకము తలంచుచున్నది. విమర్శకుడు సహృదయుడు గానిచో భాషకిట్టి యనర్థము లుత్పత్తిల్లును గదా! ఇందుకుఁ గొన్ని పత్రికలుగూడ సహకారులగుచున్నవని చెప్పవలసివచ్చుట, విచారకరమగు చున్నది.

రజోఽనన్తర వివాహము విమర్శనీయమైనపుడు స్మృతి సూత్రములందలి విధినిషేధవాక్యములనుఁ బరిశీలించి, సమ్మతమనియో, అసమ్మతమనియో, ఆపత్కాల విహితమనియో, యేదో యొకటి విస్పష్టముగా నిర్ణయింపవలసి యుండునుగాని, అది సర్వథా సమ్మతమని సప్రమాణముగా నిరూపించి యేకారణముననో యసమ్మతమని మరల విమర్శించినచో నట్టి విమర్శనము లెందయిన గణనీయములగునా? అట్లే యొక భాషా

విషయమును విమర్శించునపు డిదిసంప్ర దాయ విహితమని యొకమాఱును, ఇది సంప్రదాయ విరుద్ధమని యింకొక సారియుఁ జెప్పినచో నట్టి యభిప్రాయ ముల కెందయిన విలువ యుండునా? విమర్శకుఁడు కొంత కాలమునకుఁబూర్వా భిప్రాయము మార్చుకొనవచ్చునుగాని, ఆ మార్పు సప్రమాణమైనపుడే యుచిత మగును గాని యస్థిరచిత్తతతో నసూ యతోఁ గావించినదైనచో విద్వల్లోకము సమ్మతి గాంచఁజాలదు. కావున నేదేని యొక విషయము విమర్శించుటకు ముం దుగా నర్హత సంపాదింపవలెను అది లేక విమర్శింపఁబూనుట యందని ప్రూని పండ్ల కఱ్ఱుచాచుటయే కాని—

మొదటి యుత్తమపద్ధతి నవలంబించిన సద్విమర్శనములు గూడఁ గొన్ని యాం ధ్రమున లేకపోలేదు అందు శ్రీ రామ లింగారెడ్డిగారి కళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్న విమర్శనమొకటి. భారతము, ఉత్తరహరివంశము, మనుచరిత్ర, ఆముక్త మాల్యద మొదలగు గ్రంధములను, నన్నయ తిక్కన శ్రీనాథాది కవులను గొందరు కొన్ని విధముల విమర్శించిరి. కాని వారి పద్ధతులకును రెడ్డిగారి పద్ధతి కిని సూక్ష్మదృష్టితో పరిశీలించినవారికి భేదము గోచరింపకపోదు. ఇది యాంగ్ల పద్ధతి ననుసరించినదైనను, ఆంధ్రమున నవీనము స్వతంత్రము. ఎంతటి విమర్శన మైనను పునర్విమర్శనార్హమగు చున్న దనుట యనుభవ సిద్ధమగుటచే లోకో భిన్నరుచి యన్నట్లు కొందరీ విమర్శన ములోని కొన్ని విషయములందు భిన్నాభి ప్రాయముల చూపుచున్నారని చెప్పవలసి వచ్చినను ఇంతమాత్రమున విమర్శనపద్ధతి కాక్షేపము రాజాలదు.

ఆంధ్రభారత నిరంతర పరనాయత్త చిత్తులును, విమర్శన విజ్ఞానసంపన్నులు నగు శ్రీ రెడ్డిగారు పింగళిసూరనార్యుని కవిత్వమందలి యాదరాతిశయమునఁగళా పూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్నములు పెక్కుసార్లు చదివి, యతని కథాకల్పనా కవిత్వచాతుర్యములకు మెచ్చి యందలి విశేషము లాంధ్రలోకమున కెఱింగింప బూని ముందుగా నుపోద్ఘాతముగా నాం ధ్రకవితా స్వరూపమును మొదటి ప్రకర ణమున వర్ణించియున్నారు. స్వతంత్ర కవుల పద్ధతులవలెనే స్వతంత్ర విమర్శకుల పోకడలును, అపూర్వములుగా నుండు ననుట కుదాహరణముగా నిందు విశదీక రింపబడిన భావనాశక్తి, భావము, పాత్ర ములు, జీవకళ మొదలగు విశేష విషయ ములతో భారతకవుల ప్రతిభను, అందును విశేషించి తిక్కనార్యుని మహత్వమును గన్నులకుఁ గట్టినట్లు ప్రత్యక్షము గావిం చిన శ్రీ రెడ్డిగారి యాంధ్రాంగ్ల సాహి త్య విమర్శన విజ్ఞానమునకీ ప్రకరణమా కరముగా నున్నది. రెండవ ప్రకరణమం తయు ప్రబంధలక్షణాది విమర్శనముతో నిండినది ఈ రెండు ప్రకరణములలోని భావనాశక్తి వర్ణనాలంకార ప్రబంధకథాది విషయవిమర్శనము లందలి కొన్ని భావములును, కొన్ని వాక్యములును, ప్రాచ్యపాశ్చాత్యసాహిత్యవాసనాభేదము లను బట్టి వారివారికి వేఱువేఱుగాఁ గనబడుటయు, ఆ విషయములను మఱి కొందఱు వేఱుగా, విమర్శించి సమర్థింప గల్గుటయు, సత్యమేకాని, శ్రీ రెడ్డిగా

గా శ్రయించిన ప్రధానోద్దేశముతోడి విమర్శనపద్ధతికవియందుసరిపడుచునేయున్నవి

ఈ గ్రంథమునకు జీవనప్రాయములైె పరిమాణమందును గుణమందును నుత్కృష్టములైనవి. తరవాతి రెండు ప్రకరణములు. ప్రభావతీ ప్రద్యుమ్న కథా సంవిధానమందును, మూడుమార్లు చదివినఁ గాని యర్థముగాక మిక్కిలి గజిబిజిగా నున్న కళాపూర్ణోదయ కథానిర్మాణమందును గల యెల్ల మర్మములను సూరనార్యుని నిజజీవితముతో నివి కరతలామలకము గావించుచున్నవి, అందుచే రెడ్డిగారి విమర్శన స్వరూపమంతయు నీ ప్రకరణ ద్వయదర్పణమున జక్కఁగా బ్రతిఫలించుచున్నదని చెప్పవచ్చును.

రసములలోనెల్ల శృంగారము మిన్నమై సంస్కృత లక్షణగ్రంథములం దెక్కువ భాగ మాక్రమించియున్నది. అట్టి ప్రధానరసమును సూరనార్యుఁ డైదు విధములుగా వర్ణించుటను జూపి, యందు నాలుగు విధముల శృంగార మతిమనోహరముగాఁ గళాపూర్ణోదయమున నెట్లు కనవచ్చుచున్నదో యీ విమర్శనము తెల్పుచున్నది. స్త్రీపాత్రపోషణౌచిత్యమునకు లక్ష్యముగా నిది కలభాషిణీ పాత్రమును, బహుభంగుల వివరించుచున్నది; సుగాత్రీశాలీనుల కథయందలి చమత్కృతి నిది యరటిపండొలిచి చేత బెట్టునట్లు చూపుచున్నది. పెక్కేల? సూరనార్యుని రెండు ప్రబంధములంగల ము ఖ్యాం శ ము ల నె ల్ల నిది యుక్తియుక్తముగా ననుభవసిద్ధముగా విమర్శించి నిష్పక్షపాత విమర్శనమునకు దారి చూపుచున్నదనుటకంతె దీనినిగూర్చియిం దధికముగా వ్రాయుట యనావశ్యకము.

కడపటిప్రకరణ మందసహ్యా శృంగారము, కళాపూర్ణోదయము కడపటికథ, అందలి యనౌచిత్యాము మొదలగు విషయములు పరిశీలింపబడినవి. సుగాత్రీ కలభాషిణీపాత్ర పోషణమునకును మధుర లాలసాపాత్ర పోషణమునకును గల భేదమును జూపి యందలి యౌచితిని, ఇందలి యనౌచిత్యమును విశదీకరించుటయెవిమర్శకులు సూరనార్యు నెంత గౌరవ బుద్ధితో జూచినను, అతని రచనయందలిగుణ దోషములను నిష్పక్షపాతముగా జూపిరనుటకుఁ దార్కాణమగుచున్నది మఱియు-

అసహ్యాతుచ్ఛ శృంగారముల స్వరూపమెట్టిదియనిచూపుచు, ఉత్తమశృంగారమునకుఁ గవిత్రయమువారిపద్యములనుదాహరించిన రెడ్డిగారు, ప్రబంధకవులుకొందఱు గతాను గతికముగా శృంగారరసమర్యాదనతిక్రమించి పోవుటను సూచించుటయే కాక, ఉత్తమకవుల వర్ణనలనుబట్టియు లోకానుభవమును బట్టియుశృంగార వర్ణనమిట్లున్న హృదయంగమముగా నుండునన్న కవితాధర్మము గూడనుపదేశించినవారైరి

రెడ్డిగారు విమర్శన తత్వవిజ్ఞానమం దారి తేరిన వారగుటచే నీ విమర్శనము నతి సమర్థతతో నిర్వహించిరని నాయాశయము. ఆంధ్ర దేశమున జక్కఁగ వ్యాపించియున్నయట్టి ఈ గ్రంథమందలి విషయమును విద్వల్లోకమును విద్యార్థి బృందమును మరల మరల జదివి యానందింపవలసినదే కాని యిది యిట్టిదన యిందలి యొక్కొక్క యంశమును వర్ణించుచుఁ బీరికగా నాలుగుమాటలతో జెప్పవలసినదిగాదు.

ఆంధ్ర విశ్వకళాపరిషత్ప్రధమోపాధ్యాయులగు శ్రీ రామలింగారెడ్డిగారు పరిషదుపాయనముగా సమర్పించిన యీ విమర్శనగ్రంథమాంధ్ర విశ్వకలా పరిషత్ప్రకటితమై చిరకాల మాంధ్రలోకమును రంజింపజేయుఁగాక.

సంస్కృత బాలశిక్ష

శ్రీ గరికిపాటి సత్యనారాయణ, ఎం. ఏ

జూన్ సంచికలో, తిఙన్త శబ్దములను గూర్చి కొన్ని విషయములను తెలిసికొంటిమి. సంగ్రహముగానవి యివి. తిఙన్త శబ్దము లనగా క్రియాబోధక శబ్దములు. వానిని వైయాకరణులు పది వర్గములుగ విభాగించిరి. అవి భ్వాదులు, అదాదులు, జుహోత్యాదులు, దివాదులు, స్వాదులు, తుదాదులు, రుదాదులు, తనాదులు, క్ర్యాదులు, చురాదులు. ప్రతివర్గమునందును పది లకారము లుండును. అవి లట్, లేట్, లుఙ్, లఙ్, లిట్, విధిలిఙ్, ఆశీర్లిఙ్, లుట్, లృఙ్, లోట్. ప్రతి లకారమునందును ప్రథమ, ఉత్తమ, మధ్యమ పురుషలును, ప్రతి పురుషకును మూడు వచనములును (ఏక, ద్వి, బహువచన నములు) ఉండును. ఒక క్రియాపద మేపురుషలో నున్నది, ఏవచనములో నున్నది. తెలుపుటకు ప్రత్యేకముఃగా వానిని సూచించు ప్రత్యయము లుండును. కొన్ని క్రియాపదములలో, ధాతువునకు ప్రత్యయము కలియుటకు పూర్వము కొన్ని మార్పులను పొందును. కొన్ని క్రియాపదములలో ధాతువునకు అవ్యవహితముగా ప్రత్యయము కలియుట గూడ గలదు. ఈపది లకారములలో కొన్ని కాలవాచకములు. మరికొన్ని. వక్తృప్రవృత్తి సూచకములు.

ప్రస్తుత మీ లకారములను గురించి విశదముగా దెలిసికొన యత్నింతము. ఆ పది లకారములలో లేట్ అనునది వేదమున ప్రసిద్ధముగాని లౌకికమైన సాహిత్యమున దానికి స్థానములేదు. లట్ అనునది వర్తమానకాలమును సూచించును. అనగా క్రియ జరుగుచున్నప్పుడా క్రియాపదము వర్తమానకాలసూచకమగు 'లట్' లో ప్రయోగింపబడును. సఃగచ్ఛతి అతడు వెళ్ళుచున్నాడు ఈ గమనమను క్రియ (వెళ్ళుట అనుపని) వర్తమాన కాలమున ప్రస్తుతము జరుగుచున్నది.

ఇక భూతకాలమునకు సంబంధించిన లకారములు మూడుగలవు. అవి లుఙ్, లఙ్, లిట్ అనునవి. గతకాలమున జరిగిన పనిని సూచించునపుడా క్రియాపదము లుఙ్‌లో ప్రయోగింపబడును. 'అహం సత్యం అవాదిషం' నేను నిజమును పలికితిని. ఇచ్చట అవాదిషం అను క్రియాపదము లుఙ్‌లో ప్రయోగింపబడినది. ఆ క్రియాపదము - అనద్యతనభూతకాలమున జరిగిన పనిని సూచించునపుడు - లఙ్‌లో ప్రయోగింపబడును. – అద్యతన మను పదమునకు-గడచిన రాత్రి చివరి యామము మొదలుకొని రేపు ప్రథమ యామమువరకు నడుమనుండు కాలము అని యర్థము. అనగా నేటిరోజు అని యర్థము. తదితర కాలమంతయు ననద్యతనభూతకాలమే. అనగా నిన్న మొదలు కల్పమువరకును వెనుకకు బోయినను అది అనద్యతన భూతమే యగును. రామః వనం అగచ్ఛత్. రాముడు వనమును గూర్చి వెళ్ళెను. ఇచ్చట రాముని యరణ్యాగమనము నేడు జరిగినదిగాదు. అది త్రేతాయుగమున జరిగినది. ఇట్టి యర్థ

మున లజ్ వాడవలెను. ఒకపని గతకాలమున జరిగినపుడు, ఆ జరిగిన పని చెప్పుచున్న వ్యక్తికి అనుభవ విషయము గాక పోయినపుడు, ఆ జరిగిన పని నేటికి సంబంధించినదికాక, నిన్నటిదిగాని తత్పూర్వము నందలిదిగాని అయినప్పు డట్టి క్రియను సూచించుపదము లిట్‌లో నుండును.

రామః వనంజగామ. ఇచ్చట జగామ అన్న భూతకాలిక క్రియ లిట్‌లో గలదు. ఇచ్చట రామునికి సంబంధించిన గమన మనుభూతకాలిక క్రియ అది జరిగినట్లు చెప్పువానికి ప్రత్యక్షగోచరము గాదు. ఇట్టి పరిస్థితిలోను క్రియాపదము లిట్‌లో ప్రయోగింపబడును. కావున సామాన్య ముగా భూతకాలమున జరిగిన క్రియను సూచించునపుడు లుజ్‌ను, అనద్యతన భూతకాలమున జరిగిన క్రియను సూచించునపుడు లజ్‌ను, అనద్యతన భూతకాలమున జరిగినపని చెప్పువానికి ప్రత్యక్ష గోచరము కానప్పుడు - లిట్ నుపయోగింపవలయును. కాని సాహిత్యములో నీవ్యవస్థ పాటింపబడలేదు, ఇక ల్రృట్, లుట్ అనురెండు లకారములు భవిష్యత్కాలమును సూచించును. సామాన్య ముగా ముందు జరుగబోవు పనిని సూచించునపుడు ఆ క్రియాపదము ల్రృట్‌లో ప్రయోగింపబడును. 'అహంతుభ్యం మమ కన్యాందాస్యామి' నేను నీ కొఱకు నా కన్యను దానముగా నీయగలను. ఇచ్చట దాస్యామిఅన్నపదముముందుజరుగనున్న పనిని సూచించును. అట్లు కాక ముమ్ముందెప్పుడో పని జరుగునని చెప్పునపుడు ఆ పనికి సంబంధించిన ఫలము నేడు జరుగునది కానప్పు డా క్రియాపదము లుట్‌లో నుండును. "అర్జునః త్రిషులోకేషు విశ్వతః ధానుష్కః భవితా" అర్జునుడు ముల్లోకములలో ప్రసిద్ధుడైన ధానుష్కుడగును.

ఇచ్చట 'భవితా' అన్న క్రియలో పని నేడు జరుగుటలేదు ముందెప్పుడో జరుగునన్నమాట.

ఇక ల్రృజ్ అను లకారము హేతు హేతుమద్భావమును సూచించును. 'సువృష్టిశ్చేదభవిష్యత్, సుభిక్షమభవిష్యత్' మంచివర్షము పడినచో సుభిక్షమేర్పడును. ఇచ్చట వాక్యములోని అభవిష్యత్ అనురెండు క్రియలును పరస్పరము హేతుహేతుమద్భావమును సూచించును. ఇచ్చట మొదటి క్రియకు ఫలము రెండవ క్రియలో కాన్పించును.

క్రియాపదము లిజ్ అను లకారమున ఈక్రింది యర్థములలో ప్రయోగింపబడును.

(1) యజమానియైనవాడు తనక్రింద పనిచేయువాని నీ పనిని చేయుమని యాదేశించునపుడు.

భృత్యంస్వామీ వదతి-

యజమాని భవిష్యత్తును గూర్చి చెప్పుచున్నాడు.

'భవాన్ వస్త్రంక్షాలయేత్' ఇతి

'నీవు వస్త్రము నుదుకవలయును'అని. ఇచ్చట 'క్షాలయేత్' అను క్రియాపదము విధిని సూచించును.

(2) భోజనమునకు రమ్మనినపుడు ప్రధానముగా పితృశ్రాద్ధాదులకు బిలుచునపుడు:

భవాన్ ఇహశ్రాద్ధే భుఞ్జీత.

నీవిచట పితృకార్యమునన్దుండి భుజింపవలయును అని ఇతరుల నిమంత్రించున

పుడు లిఙ్ ప్రయోగింపబడును. ఇచ్చట 'భుఞ్జీత' అనునది లిఙ్. ఒకపనిని చేయుటకు అభ్యనుజ్ఞ ఇచ్చినపుడు:

'యథేష్టం క్రియతాం'

ఇచ్చవచ్చినట్లు చేయవచ్చును. ఇచట క్రియతాం అను క్రియాపదము లిఙ్‌లోనే ప్రయోగింపబడినది.

ఒక సత్కారపూర్వకమైన వ్యాపారమును సూచించునపుడు:

'మాణవకం భవానధ్యాపయేత్'

ఈ కుఱ్ఱవానిని (బ్రహ్మచారిని) అనుగ్రహించి తమరధ్యయనము చేయింపవలయును. ఇచట 'అధ్యాపయేత్' లిఙ్‌లో ప్రయుక్తమైనది. ఇది చేయదగిన దగునా కాదాయని విచారించి ఒక సంగతిని నిశ్చయము చేసినపుడును,

'కింభోః భవాన్వ్యాకరణ మధీయీత'

అయ్యా, తమరు వ్యాకరణం చదివెదరా? అనగా నిచ్చట వ్యాకరణము చదువవలసినదని అడిగినవారి యుద్దేశ్యము, ఒకరి నొకదాని కర్థించినపుడు.

'భవానన్నం మేదద్యాత్'

'తమరు నాకు అన్నము పెట్టండి'

ఇచ్చట దద్యాత్ లిఙ్‌లోనే ప్రయోగింపబడినది. కావున విధి విషయముననుు, నిమన్త్రణ విషయముననుు, ఆమన్త్రణ విషయముననుు, అధీష్టము విషయముననుు, సంప్రశ్నము విషయముననుు, ప్రార్థన విషయముననుు, లిఙ్ ప్రయోగింపబడును.

ఆశీర్లిఙ్ అను లకారము ఆశీస్సు నొసగునపుడు ప్రయోగింపబడును.

'దేవః త్వాం పాయాత్'

దేవుడు నిన్ను రక్షించుగాక.

ఇచ్చట పాయాత్ అనునది ఆశీర్లిఙ్‌లో ప్రయోగింపబడినది.

విధి లిఙ్ ఏ యర్థములలో నుపయోగింపబడినదో అదే యర్థములో లోట్ గూడా ప్రయోగింపవచ్చును.

ఇవిగాక ప్రతిగణము నందును ఆయా క్రియాపదములు కొన్ని పరస్మై పదము నందును, కొన్ని యాత్మనే పదమునందును, మరికొన్ని క్రియాపదములు రెండింటియందు నుండును. ఒక క్రియాపదము ఆత్మనేపదములో నున్నదో, పరస్మై పదములో నున్నదోయని తెలిసికొనుట కాయా క్రియాపదము లేయే ప్రత్యయములలో నంతమగుచున్నవో గమనింపవలయును. ఈ క్రిందిపట్టిక ననుసరించి యాయా లకారములు ఆత్మనే పదములో నున్నవో, పరస్మైపదిలో నున్నవో తెలుపును. అంతేకాక ఒక క్రియాపదమే లకారమున నున్నదో తెలిసికొనుటకుగూడ నాయా లకారములకు సంబంధించిన వేర్వేరు పురుషల యొక్కయు, వచనముల యొక్కయు ప్రత్యయముల నెఱుగవలయును.

పరస్మై పదమునందు

లట్

	ఏ	ద్వి	బ
ప్ర:	తి	తః	అన్తి
మ:	సి	థః	థ
ఉ:	మి	వః	మః॥

లఙ్

	ఏ	ద్వి	బ
ప్ర:	త్	తామ్	అన్
మ:	స్ (ః)	తమ్	త
ఉ:	అమ్	వ	మ॥

లోట్

ఏ - ద్వి - బ
ప్ర: - తు - తామ్ - అన్తు
మ: - (-) - తమ్ - త
ఉ: - ఆని - ఆవ - ఆమ॥

ఆత్మనే పదమునందు

లట్

ఏ - ద్వి - బ
ప్ర: - తే - ఇతే - అన్తే
మ: - సే - ఇథే - ధ్వే
ఉ: - ఇ - వహే - మహే॥

లఙ్

ఏ - ద్వి - బ
ప్ర: - త - ఇతామ్ - అన్త
మ: - థాః - ఇథామ్ - ధ్వమ్
ఉ: - ఇ - వహి - మహి

లోట్

ఏ - ద్వి - బ
ప్ర: - తామ్ - ఇతామ్ - అన్తామ్
మ: - స్వ - ఇథామ్ - ధ్వమ్
ఉ: - ఐ - ఆవహై - ఆమహై

లోట్‌లో పరస్మైపది ప్రథమ పురుషకు సంబంధించిన ఏకవచన ప్రత్యయము తాత్ అనిగూడ ఉండును మధ్యమ పురుషైక వచనమున కలుపవలసిన ప్రత్యయమేదియును లేదు.

పరస్మైపదము నందు

విధిలిఙ్

ఏ - ద్వి - బ
ప్ర: - ఈత్ - ఈతామ్ - ఈయుః
మ: - ఈః - ఈతమ్ - ఈత
ఉ - ఈయ - ఈవ - ఈమ॥

లిట్

ఏ - ద్వి - బ
ప్ర: - అ - అతుః - ఉః
మ: - థ - అథుః - అ
ఉ: - అ - వ - మ

ఆత్మనే పదమునందు

విధిలిఙ్

ఏ - ద్వి - బ
ప్ర: - ఈత - ఈయాతామ్ - ఈరన్
మ: - ఈథాః - ఈయాథామ్ - ఈధ్వమ్
ఉ: - ఈయ - ఈవహి - ఈమహి

లిట్

ఏ - ద్వి - బ
ప్ర - ఏ - ఆతే - ఇరే
మ: - సే - ఆథే - ధ్వే
ఉ: - ఏ - వహే - మహే॥

పరస్మైపదమునందు

ఆశీర్లిఙ్

ఏ - ద్వి - బ
ప్ర: - యాత్ - యాస్తామ్ - యాసుః
మ: - యాః - యాస్తమ్ - యాస్త
ఉ: - యాసమ్ - యాస్వ - యాస్మ॥

లుట్

ఏ - ద్వి - బ
ప్ర: - తా - తారౌ - తారః
మ: - తాసి - తాస్థః - తాస్థ
ఉ: - తాస్మి - తాస్వః - తాస్మః॥

ల్బట్

ఏ - ద్వి - బ
ప్ర: - స్యతి - స్యతః - స్యన్తి
మ: - స్యసి - స్యథః - స్యథ
ఉ: - స్యామి - స్యావః - స్యామః॥

ల్బఙ్

ఏ - ద్వి - బ
ప్ర: - స్యత్ - స్యతామ్ - స్యన్
మ: - స్యః - స్యతమ్ - స్యత
ఉ - స్యమ్ - స్యావ - స్యామ

లుఙ్

ఏ - ద్వి - బ
ప్ర: - త్ - తామ్ - ఉః

మ : - స్ - తమ్ - త
ఉ ; - అమ్ - వ - మ॥

ఆత్మనే పదమునందు

ఆశీర్లిఙ్

ఏ - ద్వి - బ
ప్ర : - సీష్ట - సీయాస్తామ్ - సీరన్
మ - సీష్ఠాః - సీయాస్థామ్ - సీధ్వమ్
ఉ : - సీయ - సీవహి - సీమహి॥

లుట్

ఏ - ద్వి - బ
ప్ర : - తా - తారౌ - తారః
మ : - తాసే - తాసాథే - తాధ్వే
ఉ . తాహే - తాస్వహే - తాస్మహే

ల్రుట్

ఏ - ద్వి - బ
ప్ర : - స్యతే - స్యేతే - స్యన్తే
మ : - స్యసే - స్యేథే - స్యధ్వే
ఉ : - స్యే - స్యావహే - స్యామహే॥

ల్రుఙ్

ఏ - ద్వి - బ
ప్ర : - స్యత - స్యేతామ్ - స్యన్త
మ : - స్యథాః - స్యేథామ్ - స్యధ్వమ్
ఉ : - స్యే - స్యావహి - స్యామహి॥

మాసఫలములు

మే 22 — జూన్ 21

శ్రీ 'బుధ'

మేషము

(అశ్వ, భర, కృత్తి 1 పా)

ఈ నెలలో బృహస్పతి తప్ప, మిగిలిన గ్రహస్థితి అనుకూలం. ఆత్మవికాసం, సుస్థిరమైన సంకల్పములు వివేకమగు ఆలోచనలు. వ్యాపారనిపుణత, వ్యవహారదక్షత, కార్యసాధనకు తోడ్పడి, నిర్మాణాత్మకంగా, యత్నకార్యములు ఫలప్రదమగును. పదవియం దాధిక్యత సాంఘిక జీవనంలో పలుకుబడి, గౌరవము హెచ్చును. బంధు మిత్రాదులవలన మేలు, విజ్ఞానాత్మకమగు కృషియందు విజయం చతుర్థములో నున్న, కుజ, శుక్రులకు గురువీక్షణవలన నూతనగృహ. వస్తువాహనములకు శుభకార్యములకు ధనవ్యయమగును - బంధుమిత్రాదులతో సుఖజీవనము. ఉద్యోగ, వ్యాపార ధర్మములు లాభదాయకంగా యుండును. నూతన వ్యాపారాది కృషులలో పాల్గొందురు. జూన్ 7-10 తేదీలలో కుజ, వరుణ కేంద్రస్థితి వలన ఆప్తబంధువులకు హాని, స్థానచలనము.

వృషభము

(కృత్తి 2,3,4. రోహి, మృగ 1, 2 పా)

మీ విజ్ఞానకేంద్రమునుండి వెలువడు ఆలోచనలు బహుముఖంగా వ్యాప్తిజెంది వ్యాకుల పరచుచూ యుండును. చిత్తశాంతత, విశ్రాంతి యుండదు. బుద్ధికుశలతతో కాగల కార్యకలాపములందే కాలం గడుపుచుందురు. స్వతంత్రమైన భావనాశక్తి, చతురత - నిష్పాక్షికమగు విమర్శ, సులభంగా ప్రజలను రంజింపచేయును రచయితల ప్రతిభ పొగడ్తల నందుకొనును. ఇట్టి గ్రహస్థితియే, అహంభావమును - నిర్లక్ష్యమును - సోమరితనమునుకూడా యిచ్చును- ఈలోపమును సవరించుకొనుట మంచిది. జూన్ మొదటి వారంనుండీ వ్యవహారికంగా రాచకీయంగా కొన్ని చిక్కులు రాగలవు. జ్ఞాతి వైరము. ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో జయం చేకూరును - షష్ఠాష్టమములలో గురు శని వక్రము సంచిదికాదు-ఉద్యోగ - వ్యాపార ధర్మములలో శ్రమ అధికం - ఫలితం సామాన్యం. మిత్రులతో పరస్పర భేదాభిప్రాయాలు జన్మరాశియందు రవి స్థితివలన, ఉష్ణాధిక్యత. అనారోగ్యం

మిథునము

(మృగ 3, 4 ఆరుద్ర, పున 1, 2, 3 పా;)

గృహస్థ జీవితమందు శ్రద్ధాసక్తులు, బాధ్యతలు ఎక్కువగును. అభివృద్ధి, క్రమబద్ధమును గూర్చి ఆలోచించెదరు. కాని అట్టిది మీ వలన కానిపని. బంధుమిత్రాదుల ఇబ్బందులలో ఆదుకొనవలసిన అవసరం ఏర్పడుతుంది. పరోపకారమునకే ఎక్కువకాలము వినియోగింతురు. ప్రయాణాలతో విశ్రాంతి యుండదు. బుద్ధికుశలతతో కొన్ని పనులు సమకూరును. ఇరుగుపొరుగువారితో కలహములు. చుట్టుకొని తిరుగువారిలో ఎక్కువమంది మీ హితవు కోరువారుకారు. ఇది మరువకండి - సర్వజనానుమోదం, పొందదగు ప్రయత్నములలో విజయం. ఉద్యోగ, వ్యాపార ధర్మములలో స్వల్ప లాభం. తమ భాగస్థులు కలసి రాకపోవుటచే వ్యాపారస్తులు కష్టనష్టములకు గురియగుదురు. ఆదాయమునకు మించిన ఖర్చు.పరుల వ్యవహారములుపైన వేసుకొని బాధపడుట.ఇతరప్రదేశములలో చిక్కువడుట. అనారోగ్యం మొదలగు స్వల్ప ఇబ్బందులు.

కర్కాటకము

(పున 4 పుష్య, ఆశ్రే,)

బుద్ధికి, కర్మకు కారకుడైన గ్రహం నీచస్థితిని బొంది జన్మరాశియందు సంచరించుట మంచిదికాదు గృహస్థ, సాంఘిక విషయములలో బంధుమిత్రాదుల పరస్పర భేదాభిప్రాయములతో మీ స్వాభావికము గొప్ప మార్పు జెందుతుంది, నిర్ణయశక్తి లోపించును. ఇట్టి అం

గారకునికి, శుక్రుడుకూడా తోడైనందున మీ ఇచ్ఛాబుద్ధులు కామక్రోధములకు వశమగును. ఇతరులను తమ చెప్పుచేతలలో నడిపించవలయుననియెడి అధికారతృష్ణ, అట్లు జరుగకున్న క్రోధము - నిస్పృహ కలుగుచుండును. ఇట్టి పరిస్థితియందు చిత్తస్థైర్యము లేకున్ననూ, మార్గదర్శకత్వము లోపించిననూ, కొన్ని ప్రమాదములకు గురిగాకతప్పదు. ఇది అంతయు, మీ స్వాభావిక మార్పుదప్ప కార్యకలాపములలో లేదు. ఇదేకాలంలో ఏకాదశ రవి, బుధ స్థితివలన ప్రయత్నం లేకుండగనే పనులు సమకూరి ఆర్థికలాభం, చేకూరుతుంది. శుభవార్త, వాహనాది సుఖములు, రాజాదరణ, ఉత్తమస్నేహితులు, వ్యవహారవిజయం, శత్రుపరాజయం, బాధ్యతగల అధికార, లాభకరమగు ప్రయాణములు,

సింహము

(మఖ, పూఫ, ఉఫ 1 పా)

మధ్యవర్తుల అధర్మ ప్రవర్తనవలన అన్యాయం జరుగుతుంది. ప్రేమహృదయం భగ్నమవుతుంది. విచారాన్ని కలిగిస్తుంది, మీసత్ప్రవర్తన - పరోపకారము. అట్టివారికి పశ్చాత్తాపాన్ని కలిగిస్తుంది. ప్రయోజనమేమి? తృతీయ పంచమభావములలో శని గురు వక్రమువలన యత్నకార్యములందు అశ్రద్ధ, సోమరితనము వలన ఆలస్యముగా పనులు సమకూరుచుండును. పరుల కార్యముల నెగ్గించుటలో మీ ప్రభావము వెల్లడి అవుతుంది. దశమస్థితి బొందిన రవివలన. వృత్తిలో అగ్రస్థానము. ఉత్తమ పురుషుల సాంగత్యము కలుగును. మరికొందఱికి అధికారులతో వివాదము, వ్యవహారచిక్కులు కలుగును. మాతాపితరులకు మంచిరోజులుకావు. వర్తక వ్యాపారాదికృషులలో లాభం. శుభకర్మలకు, నూతన వస్తువాహనములకు ధనవ్రయం. ఆరోగ్యసూత్రములలోగల సూక్ష్మధర్మముల కొన్నిటిని తెలుసుకొందురు. శిల్పము, సంగీతము నాట్యపరిశ్రమ జేయువారి ప్రయత్నములు ఫలప్రదమగును.

కన్యా

(ఉఫ 2, 3, 4, హస్త, చిత్త 1, 2 పా)

రవి బుధుల కోణస్థితి. కుజశుక్రుల లాభస్థితి ఏకమై కొన్ని సత్ఫలితాల నిచ్చును. సానుభూతితోకూడిన మీ చిత్తశుద్ధి, ప్రతిభ వికసించి వ్యాప్తిజెందును. దూరదృష్టి, సూక్ష్మబుద్ధి, గ్రహణశక్తులతో అనేక సూక్ష్మధర్మముల దెలసికొనుటయేగాక సామాజిక సుఖజీవితముకై కృషిజేయుదురు. ప్రబోధము, రచనలు జేయుదురు. మీ విజ్ఞానాత్మకమైన కృషి కళారూపంలో స్ఫుటబడును. ఉత్తమ జీవితం. సంతతివలన సుఖము. లాభకరమగు వివాహము. మిత్రులవలన,ప్రయాణములవలన ధనలాభము. వ్యయాధిపతికి భాగ్యస్థితివల్ల స్థిరధన స్థిరవసతుల నష్టము - ఆదాయమునకు మించిన వ్రయం. నూతన వస్తువాహనసిద్ధి - నూతన వ్యాపారాది కృషులలో ఆలస్యము. మొత్తము మీద కార్యదీక్షతో ఆశయసాధన.

తుల

(చిత్త 3, 4 స్వాతి, విశాఖ 1, 2, 3 పా;)

పరిస్థితులన్నియు సందిగ్ధావస్థలో పడును. క్రోధ ద్వేషములు పునరాలోచనకు తావీయవు. అహంభావమువలన కార్యహాని. ఇతరులను హేళనజేయుట విమర్శించుట పనికిరాదు. తృతీయ అష్టమములలో రవి, శని స్థితి మంచిదికాదు. ఉద్యోగ, వ్యాపార ధర్మములలో అనేక అంతరాయములు కలుగును. అధికారుల ఆగ్రహమునకు పాత్రులగుదురు.వ్యాపారస్తులు తమ లెఖ్ఖలను జూపుటలో అప్రమత్తత పనికిరాదు. పదచ్యుతి కలుగునన్నభీతి.స్థానచలనము, కాని, పదింట నున్న కుజ, శుక్ర శుభత్వమువలన ప్రమాదముల తప్పించుకొనుటయేగాక, ధైర్యముతో జయమును సాధించుకొనగలరు. ఉద్యోగ వ్యాపారములలో లాభము కలుగుచున్ననూ ఆకస్మిక అవాంతరములకై ధననష్టము. కుటుంబపరిస్థితులు సుఖము నివ్వక-తఱచు అనారోగ్యములుసంభవమగును.

వృశ్చికము

(విశా 4 అనూ, జ్యేష్ట,)

జన్మరాశ్యాధిపతి నీచ,గురు శనుల వక్రము మంచిదికాదు. తాపత్రయము. బాధ్యతలు ఎక్కువ, విశ్రాంతి తక్కువ, అధైర్యము విచక్షణలేని పనులు కొంతకాలము ఆధ్యాత్మిక చింతన మఱికొంతకాలము భౌతికచింతన. శాస్త్రపరిశోధన, జ్ఞానాభివృద్ధి ప్రణయకౌతూహలం. ఉద్యోగ వ్యాపారములలో మార్పు కనిపించదు. అలస్యముమీద పనులు సమకూరుచుండును. సంఘమందు వ్యతిరేకత, పెద్దలతో వైరము, వ్యవహార వ్యాపారనిమిత్తము ఇతర పట్టణవాసము. ఋణధనప్రాప్తి, ఆదాయమునకు మించినఖర్చు, శుభకార్యములకై ధనవ్రయము. సప్తమ రవిస్థితివలన కళత్ర అనారోగ్యము,

ధనుస్సు

(మూల, పూషా, ఉషా 1 పా,)

రవి, బుధులు అనుకూలురు, శని కుజులు ప్రతికూలురు,శుభాఽశుభ మిశ్రమఫలితం పురోగమనకు తగు అవకాశములు కనుపించును. ఉత్సాహ మధికం, ప్రేరణాశక్తి వ్యక్తిత్వము. ముందుకు నడుస్తూ యుండును కాని పరిస్థితులు అనుకూలించవు మధ్య మధ్య అవాంతరములు అడ్డు వచ్చుచునే యుండును ప్రయాసవలన గాని పనులు సమకూరవు. అధ్యాపకులకు - సివిల్ ఉద్యోగులకు పబ్లిక్ సంస్థలలో. పనిజేయువారికి పదవులలో యాధిక్యత గౌరవము, శాస్త్రపరిశోధకులు యోగ్యతాపత్రముల పొందగలరు. వర్తకులువిరివిగావ్యాపారముజేసి లాభముల పొందగలరు. కుటుంబచిక్కులుఅనారోగ్యం,స్థానచలనం బంధుమృతి. అపనిందలు.

మకరము

(ఉషా 2, 3, 4 శ్రవణ, ధని 1, 2 పా:)

గ్రహస్థితి అనుకూలము. మానసికంగా సుఖపడేయోగం. మీ విజ్ఞానాత్మకమగు కృషి చక్కగా ఫలిస్తుంది, ఆధ్యాత్మికచింతన తాత్వికవిద్యాభిలాష కళలయందభిరుచి కలిగియుందురు - పంచమ. రవి,బుధ స్థితివలన చక్కని కార్యాలోచన మంత్రాంగము,వ్యవహార దక్షత. వ్యాపార, నిపుణతవలన యత్నకార్యములు సఫలములగుచుండును పదవియం దాధిక్యత, గౌరవము,సజ్జనసాంగత్యము, సత్కర్మాభిలాష వ్యాపారాదికృషులలో భాగస్థుల చేరికలాభదాయకమగును వివాహాది శుభకర్మలు జరుగును ఆర్థిక పరిస్థితులలో యూహించిన లాభము ఆలస్యముగా చేతికి వచ్చును కుజ శుక్రుల సప్తమ స్థితివలన భార్యా భర్తల ప్రేమానురాగములకు కొద్ది కాలము భంగము వాటిల్లును

కుంభము

(ధని 3, 4 శత, పూభా 1, 2, 3 పా)

గ్రహస్థితి మీ విజ్ఞానాత్మకమైన కృషికి దోహదమిచ్చును బుద్ధి కుశలతతో యత్నకార్యములు నెరవేరుచుండును కథకులకు నవలా రచయితలకు మంచికాలం. ఎక్కువగా సాహిత్యగోష్ఠియందు కాలం గడుపుదురు. ఉద్యోగ వ్యాపారాది కృషులలో సామాన్య లాభము కంట్రాక్టు పనులలో లౌకిక వ్యవహారములలో ధనలాభము శుభకార్యములకై ధన వ్రయం - తలంచిన ప్రయాణములు ఆగిపోవును. ఆరవఇంట కుజశుక్రస్థితివలన - శత్రుజయం - రాజప్రియము, కళత్రకలహం, చోరభయం, క్షుద్రదేవతారాధన.

మీనము

(పూభా 4 ఉభా, రేవ;)

మనోవికాసం - విజ్ఞానాభివృద్ధి - మీ శక్తి సామర్థ్యములు. వ్యక్తిత్వము, ప్రతిభ కార్యరూపంతాల్చి ప్రతిష్టచేకూరును మీరుసూచించే భావములు ప్రజానురంజకముగా యుండును. కాని ఆచరణలో అతిగా సంచరించుట, అహంభావత్వము నిర్లక్ష్యము వలన ముప్పువచ్చును. రవి బుధులు విక్రమస్థానములో నున్నందున నూతన వ్యాపారాదికృషులకై కావించు ప్రయత్నములు సఫలములగును. భాగస్థుల లేక మిత్రుల సహకారం వ్యాపార నిబంధనలు ఎగ్రిమెంట్సు అనుకూలం నిర్మాణాత్మకంగా కృషి జరుగుటకు కొంత ఆలస్యమగును ధన భాగ్యాది పతికి నీచస్థితిచే ఆర్థిక ఇబ్బందులు తప్పవు. మిత్రుల కార్యకలాపములకై ధనవ్యయం.

నవభారతి ప్రెస్

అందమైన అచ్చుపనులకు

అన్నిరకాల బైండింగులకు

కలరు ప్రింటింగుకు - మాతో సంప్రదించండి.

సరికొత్త టైపులు - చక్కని పనితనం

సరసమైన రేట్లు - సకాలంలో డెలివరీ

మా ప్రత్యేకతలు.

★

• వివరములకు •

నవభారతి ప్రెస్,

గాంధీనగరం, విజయవాడ-2.

Edited, Printed & Published by Sri J Radhakrishna Reddy, Vijayawada-2
Printed at Nava Bharathi Press, Vijayawada-2